

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 267

సోమవారం 18-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




అర్ష్‌దీప్, అవేశ్ అదుర్స్

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై 8 వికెట్లతో నెగ్గిన భారత్. -12లో



భారం దింపుకుందాం?


ఇంటి రుణం ఈఎంఐ భారంగా మారితే ప్రత్యామ్నాయాలపై కథనం -13లో



భద్రతా వైఫల్యం తీవ్రమైనది

లోక్‌సభలోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి పొగపెట్టిన ఘటనను తీవ్రమైన అంశంగా ప్రధాని మోదీ అభివర్ణించారు.

- వివరాలు 6లో



60 మంది జలసమాధి

యూరప్‌కు బయల్దేరిన ఓ పడవ లిబియా సముద్రతీరంలో బోల్తాపడటంతో 60 మందికిపైగా జలసమాధి అయ్యారు.

- వివరాలు 6లో



ఎన్‌కౌంటర్‌లో ఎస్సై మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో సీఆర్పీఎఫ్ ఎస్సై సుధాకర్‌రెడ్డి మరణించారు.

- వివరాలు 6లో



గాల్లో 30 అడుగులు..

అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో ఓ 4 నెలల బుడతడు టోర్నడోలో చిక్కుకున్నా నిక్షేపంగా బయటపడి ఔరా అనిపించాడు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సాయుధ దళాలు వినూత్నంగా ఉండాలి



సాయుధ దళాలలో యువ అధికారులు నూతనత్వానికి, వినూత్న ఆలోచనలకు పదునుపెట్టాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం శిక్షణ పూర్తి చేసుకున్న 213 ఫ్లైట్ కేడెట్లకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు.

- వివరాలు 14లో▶

ఉద్యోగం చేయలేను



తాను ఇప్పుడు ఏ ఉద్యోగం చేసే స్థితిలో లేనని, ఉద్యోగం బదులుగా ధర్మప్రచారానికి ఉపయోగపడేలా సాయం చేస్తే స్వీకరిస్తానని మాజీ డీఎస్పీ నళిని పేర్కొన్నారు. తన పోరాటాన్ని జనం తెలుసుకొనే ఒక సందర్భంగా సీఎం సృష్టించడం సంతోషంగా ఉందన్నారు.

- వివరాలు 2లో▶

సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు



సంక్రాంతి పండుగలోపే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.

- వివరాలు 3లో▶

అయ్యప్ప యాత్రలో విషాదం



తమిళనాడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన ముగ్గురు అయ్యప్ప భక్తులు మృతిచెందారు. శబరిమల యాత్ర ముగించుకొని కారులో తిరిగొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

- వివరాలు 5లో▶



..ఇచ్చిన హామీలు కచ్చితంగా నెరవేర్చుతాం!

వారికే చెప్పుకోండి!

'కాళేశ్వరం'పై త్వరలో జ్యుడీషియల్ కమిషన్ • నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలకు సీఎం రేవంత్ స్పష్టీకరణ

- మేడిగడ్డ కుంగుబాటు, అన్నారం బుంగలపై సమగ్ర నివేదిక ఇవ్వండి
- మరమ్మతులపై యూటర్న్ నేపథ్యంలో ఎల్‌అండ్‌టీపై చర్యలు చేపట్టండి
- గత సర్కారు హయాంలో కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల ఖర్చు వివరాలు ఇవ్వాలని ఆదేశం
- 20న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై కీలక ప్రకటనకు చాన్స్
- నీటి పారుదల శాఖ మంత్రి, ఈఎన్‌సీలతో సీఎం సమీక్ష
- గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచన



ఆదివారం రాత్రి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలసి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆ శాఖ అధికారులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై త్వరలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని.. ప్రాజెక్టును నిర్మించిన అధికారులు, ఇంజనీర్లు ఏం చెప్తారో కమిషన్‌కే చెప్పుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం బ్యారేజీకి బుంగలు పడిన ఘటనలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్, కొత్తగూడెం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేందర్‌రావు తదితరులతో సీఎం ఆదివారం రాత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ నంబర్ బ్లాక్‌లో పిల్లర్ కుంగిపోగా.. బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత

మిగతా 2వ పేజీలో ▶

రైతుబంధులో మార్పులు!

పరిమితి విధించే అంశంపై వ్యవసాయశాఖ కసరత్తు

అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులకు నిలిపివేత యోచన

త్వరలోనే మార్గదర్శకాలు.. వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలు

రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతుల సంఖ్యే ఎక్కువగా ఉందన్న అధికారులు

ఐదెకరాలలోపే ఉన్న 62లక్షల మంది చేతిలో ఉన్న భూములు కోటి ఎకరాలు

కేవలం 6.65 లక్షల మంది చేతిలో 52 లక్షల ఎకరాలు భూమి ఉన్నట్టు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో మార్పులు చేయాలని కాంగ్రెస్ సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టినట్టు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం గుంట భూమి ఉన్న రైతుల నుంచి వందల ఎకరాలున్న భూస్వాములు, ప్రముఖులు, సినీ, రాజకీయ, వ్యాపార రంగాల వారికి కూడా రైతుబంధు అందుతోంది. వ్యవసాయ పనుల ప్రారంభంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సాయపడటమే లక్ష్యంగా ఏర్పడిన ఈ పథకం కింద.. భారీగా భూములన్న వారికి, ధనికులకు రైతుబంధు ఎందుకు ఇవ్వాలన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి విమర్శలు వచ్చినా.. అప్పటి సీఎం కేసీఆర్ అందరికీ ఇవ్వాలన్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. కొందరికే ఇస్తే పథకంలో పైరవీలు, అక్రమాలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుందన్నది కేసీఆర్ భావన అని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి.

పరిమితి ఐదెకరాలా.. పదెకరాలా?

కాంగ్రెస్ సర్కారు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని, కౌలు రైతులు, కూలీలకు కూడా ఆర్థికసాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. అయితే కొత్త సర్కారు రైతుబంధు సాయానికి ఐదెకరాల పరిమితి విధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. పదెకరాలలోపు పరిమితి ఆలోచన కూడా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందంటున్నారు. భారీగా ఆస్తులున్న రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు,

మిగతా 3వ పేజీలో ▶

దుబారా తగ్గాలి.. పన్నేతర ఆదాయం పెంచాలి



- రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ సూచనలు
- సంక్షేమం అమల్లో ఆర్థిక మూలాలు దెబ్బతినొద్దు
- అభివృద్ధిపై తిరోగమన ప్రభావం పడొద్దని స్పష్టీకరణ
- సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో భేటీ

2లో

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్

- ధరణి, రైతు భరోసా, కౌలు రైతుల గుర్తింపు తదితర అంశాలే ఎజెండా
- గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక, ప్రజావాణి కార్యక్రమ విస్తరణపై చర్చ
- కొత్త ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని స్పష్టం చేయనున్న సీఎం రేవంత్

2లో

కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు



- 'మహాలక్ష్మి'ఎఫెక్ట్‌తో 40 శాతం పెరిగిన ప్రయాణికులు
- రోజువారీ సగటు సంఖ్య 28 లక్షల నుంచి 43 లక్షలకు పెంపు
- అసలే పాత బస్సులు కావటంతో అదుపు తప్పే ప్రమాదం ఉందనే ఆందోళన.. రెండున్నర వేల కొత్త బస్సుల అవసరం ఉందన్న యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులపై పెద్ద ప్రభావమే చూపుతోంది. నిత్యం 13 లక్షల మేర ప్రయాణికుల సంఖ్య పెరిగింది. అదనంగా ప్రయాణిస్తున్న వారిలో 90 శాతం మహిళలే అన్నది సుస్పష్టం. ఈ రూపంలో ఆర్టీసీకి రోజువారీ ఆదాయం దాదాపు రూ.4.50 కోట్లు పెరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సు (ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్)ల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నందున టికెట్ రూపంలో నేరుగా ఆర్టీసీకి ఆదాయం తగ్గుతుంది తప్ప పెరగదు. కానీ ఈ పథకంతో ఆర్టీసీ కోల్పోయే ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయనున్నందున ఆ రూపంలో అదనపు ఆదాయం వచ్చి పడుతుంది. గతంలో సాధారణ రోజుల్లో ఆర్టీసీకి నిత్యం రూ.13–14 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా, ఇప్పుడది రూ.18.25 కోట్లకు చేరుతోంది. గతంలో సాధారణ రోజుల్లో (సోమవారం కాకుండా) నిత్యం ఆర్టీసీ

మిగతా 5వ పేజీలో ▶



నా మూడో ఇన్నింగ్స్ పక్కా

- దేశాన్ని 10 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
- ప్రపంచంలో బలమైన బ్రాండ్‌గా మేడిన్ ఇండియా..
- సూరత్ డైమండ్ బోర్స్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

6లో



అరవింద్ కుమార్



దానకిశోర్

అరవింద్ కుమార్‌కు 'విపత్తు' బాధ్యతలు

- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా దానకిశోర్
- విద్యాశాఖ కార్యదర్శిగా బుర్రా వెంకటేశం.. వైద్యారోగ్య శాఖ కార్యదర్శిగా క్రిస్టినా జెడ్.చొంగ్తూ
- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం - వివరాలు 2లో

పురపాలికల్లో మోగుతున్న అవిశ్వాస గంట



- పలువురు మేయర్లు, మునిసిపల్ చైర్మన్లపై బీఆర్ఎస్‌లోనే అసంతృప్తి
- గతంలోనే 34 మునిసిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు
- బీఆర్ఎస్ అధిష్టానం నచ్చజెప్పడంతో నిలిచిన అవిశ్వాసాలు
- కొత్త సర్కార్ కొలువుదీరడంతో అసమ్మతి వర్గంలో కొత్త ఊపు
- కలిసివస్తున్న కాంగ్రెస్ సభ్యులు

- వివరాలు 5లో

ఇటు అభివృద్ధి .. అటు పేదరికం!

- ఒకవైపు అభివృద్ధి, అపార అవకాశాలు ఉన్న నగరాలు, గ్రామాలు
- పౌష్టికాహారం, రోడ్డు, ఉండేందుకు ఇళ్లులేని ప్రాంతాలు మరోవైపు
- తెలంగాణలో గడిచిన ఏడేళ్లతో పోలిస్తే 7.3 శాతం తగ్గిన పేదరికం
- నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచీ–2023 వెల్లడి
- ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలు అవసరమంటున్న నిపుణులు -3లో



9 మంది ఐపీఎస్‌ల బదిలీ

మరో ఐదుగురు నాన్‌కేడర్ ఎస్పీలకూ స్థాన చలనం.. ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి

- వివరాలు 2లో


ఇంజనీరింగ్ కాలేజీల ఎదురీత

8 ఏళ్లలో 75 కాలేజీల మూత... జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువ

రాజధాని పరిసరాల్లో 20 కాలేజీలు క్లోజ్... దూసుకొస్తున్న ప్రైవేటు వర్సిటీలు

కంప్యూటర్ కోర్సుల విజృంభణ... ఈ దిశగా పోటీ పడలేని కాలేజీలు

విదేశీ వర్సిటీలొస్తే ఇంకా ప్రమాదమే.. సర్కార్‌కు ఉన్నత విద్యామండలి నివేదిక



సాక్షి, హైదరాబాద్:రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. దశాబ్ద కాలంగా ఏటా కళాశాలలు మూతపడుతున్నాయి. 2015 నాటికి రాష్ట్రంలో 234 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, ప్రస్తుతం వాటి సంఖ్య 159కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాలకు చేరువగా ఉండే కాలేజీలే ఎక్కువగా మూతపడుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 48 కాలేజీలుంటే, ఇప్పుడు వాటి సంఖ్య 11కు తగ్గింది. ఖమ్మం జిల్లాలో 28 ఉంటే, ఇప్పుడు 8 మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11కుగాను ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. ఇలా ప్రతీ జిల్లాలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఆఖరుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ 2015లో 74 కాలేజీలుంటే, 20 కాలేజీలు మాయమై 54 మిగిలాయి. ఇటీవల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మరికొన్ని కాలేజీలు కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదని ఉన్నత విద్యామండలి అధికారులు అంటున్నారు.

ఎందుకీ పరిస్థితి?

సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో డిమాండ్ బాగా తగ్గింది. ఈ కోర్సుల్లో 40 శాతం కంటే తక్కువే అడ్మిషన్లు జరుగుతున్నాయి. కొన్ని కాలేజీల్లో మెకానికల్, సివిల్ బ్రాంచీల జోలికే వెళ్లడం లేదు. 2023 ప్రవేశాల్లో దాదాపు 30 కాలేజీల్లో సివిల్ బ్రాంచ్‌లో సగానికి పైగానే సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా 58 శాతం కంప్యూటర్ కోర్సుల్లోనే ప్రవేశాలుంటున్నాయి. సీఎస్ఈ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సుల వైపే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్మీడియెట్ విద్యకు ఎక్కువ మంది హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంటుండగా, ఆ తర్వాత ఇంజనీరింగ్ విద్యనూ ఇక్కడే పూర్తి చేయాలని భావిస్తున్నారు. చదువుకునే సమయంలోనే పార్ట్‌ టైం ఉద్యోగం వెతుక్కునే అవకాశం నగరంలో ఉందని భావిస్తున్నారు. అరకొర విద్యార్థులతో జిల్లాల్లో కాలేజీలను నడిపే పరిస్థితి లేదని నిర్వాహకులు అంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులకు మౌలిక వసతుల కల్పనపై ఖర్చు చేయడానికి ఇష్టపడటం లేదు. దీంతో విద్యార్థులు ఆ కాలేజీల వైపు వెళ్లే పరిస్థితి లేదు. అందువల్ల అవి క్రమంగా మూతపడుతున్నాయి.

ప్రైవేటు వర్సిటీలొస్తే మరో ప్రమాదం

ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కేంద్ర విద్యాశాఖ ఆహ్వానం పలుకుతోంది. అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీలోని ప్రధాన కాలేజీలు ఇక్కడ బ్రాంచీలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులను ఆకట్టుకునేందుకు అవి ప్రయత్నిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పోటీని మన ఇంజనీరింగ్ కాలేజీలు తట్టుకునే అవకాశం తక్కువనే వాదన విన్పిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 80 శాతం కాలేజీల

మిగతా 5వ పేజీలో ▶

శీతాకాల విడిదికి రాష్ట్రపతి రాక నేడు



- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస.. 20న భూదాన్ పోచంపల్లిలో పర్యటన

- వివరాలు 2లో

జట్టుగా పనిచేసి లక్ష్యాలు సాధిద్దాం

- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. బాధ్యతల స్వీకరణ
- వన్యప్రాణుల దాడుల మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంపుపై తొలిసంతకం - వివరాలు 3లో

క్లుప్తంగా...

భట్టితో ఏపీ డిప్యూటీ సీఎం భేటీ




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్కను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కలిశారు. ఆదివారం సచివాలయంలో కలిసిన ఆయన భట్టికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. భట్టిని కలిసిన వారిలో పుదుచ్చేరి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కూడా ఉన్నారు.

నేడు పీఏసీ భేటీ

హాజరు కానున్న సీఎం, డిప్యూటీ సీఎం, ఠాక్రే తదితరులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం సోమవారం జరగనుంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, పీఏసీ సభ్యులు హాజరవుతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న ఈ సమావేశంలో పార్టీ పక్షాన గెలిచిన ఎమ్మెల్యేలకు అభినందనలతో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధత లాంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

పీవీకి చేసిన ద్రోహంపై హరీశ్ మాట్లాడితే తప్పేంటి?

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పట్ల కాంగ్రెస్ అధిష్టానం వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడితే తప్పేముందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు మీద హరీశ్‌రావుకు ఎందుకంత ప్రేమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనడాన్ని తప్పుపట్టారు. పీవీ కాంగ్రెస్ వాది అయినా...కాంగ్రెస్ అధిష్టానం ఆయన సేవలను గుర్తించ లేదని, అవమానకరంగా ఆయన అంత్యక్రియలు జరిపారని గుర్తు చేశారు. దివంగత కాంగ్రెస్ ప్రధానులకు ఢిల్లీలో స్మారక స్థలాలు ఉంటే, తెలంగాణ బిడ్డ పీవీ స్మారక స్థలం ఎందుకు నెలకొల్పలేదని ప్రశ్నించారు. పీవీ శతజయంతి వేడుకలు తెలంగాణలో కేసీఆర్ నిర్వహించారని గుర్తు చేశారు. సీలేరు విద్యుత్ కేంద్రంతో పాటు ఏడు మండలాలు ఏపీకి ఇచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రశ్నించలేదన్నారు. కాళేశ్వరం అవినీతి మీద ఉత్తమ్ ప్రశ్నించారు కానీ..కోచ్ ఫ్యాక్టరీ గురించి అడగలేదని పేర్కొన్నారు.

'అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్న సందర్భంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కోసం అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోవడం సంప్రదాయంగా ఉండేదని, తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆ సాంప్రదాయానికి స్వస్తి పలికారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేయడంలో అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని జూలకంటి సూచించారు.

పాతబస్తీలో పేలుడు కలకలం

కెమికల్ డబ్బా పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రసాయనాలతో కూడిన డబ్బా బ్లాస్ట్ కావడంతో పాతబస్తీలో ఆదివారం కలకలం రేగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బర్మా దేశానికి చెందిన హమీద్ హుస్సేన్ (55) బాలాపూర్ రాయల్ కాలనీకి వలస వచ్చి చిత్తు కాగితాలు సేకరిస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం బండ్లగూడలోని క్రిస్టల్ టౌన్‌షిప్‌లో ఖాళీగా ఉన్న ఓ ప్రహరీలో కాగితాలు ఏరుకుంటుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. శబ్దాల ధాటికి పక్కనే ఉన్న భవనం, ఓ కారు అద్దాలు సైతం ధ్వంసమయ్యాయి. ఈ హఠాత్పరిణామంతో స్థానికులు భయకంపితులయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలకు గురైన హుస్సేన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాంబు స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

దుబారా తగ్గాలి.. పన్నేతర ఆదాయం పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ సూచనలు

- సంక్షేమం అమల్లో ఆర్థిక మూలాలు దెబ్బతినొద్దు
- సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో భేటీ
- ఆర్థిక పరిస్థితులు, ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై 2 గంటలకు పైగా చర్చ



ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఏ దేశమైనా, రాష్ట్రమైనా ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో క్రమశిక్షణ, నిశిత పరిశీలన, వ్యూహాత్మక వినియోగం కీలకమని.. ఆర్థిక నిర్వహణను బట్టే ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు సాధ్యమవుతాయని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు రఘురాం రాజన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం కూడా ఆ దిశలో పనిచేయాలని.. దుబారా తగ్గించుకుని, ప్రజలపై పన్ను భారం మోపకుండా ఆర్థిక వ్యవస్థను నడిపించే వ్యూహాన్ని రూపొందించుకోవాలని సలహా ఇచ్చారు. రఘురాం రాజన్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వచ్చారు. రేవంత్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. రెండు గంటలకుపైగా జరిగిన ఈ సమావేశంలో.. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆర్థికాభివృద్ధి కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, దేశంలో ఇతర రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు రఘురాం రాజన్ పలు సూచనలు చేశారు.

ఆర్థిక పరిస్థితిని బట్టి ముందుకెళ్లండి

రాష్ట్ర ప్రభుత్వ వాస్తవ ఆర్థిక పరిస్థితిని బట్టి ముందుకెళ్లాలని, ఆర్థిక మూలాలను బలోపేతం చేసుకోవడం దృష్టి పెట్టాలని రఘురాం రాజన్ సూచించినట్టు తెలిసింది. మైనింగ్‌తోపాటు నాలా చార్జీల్లాంటి పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవాలని చెప్పినట్టు సమాచారం. కొత్త వాహనాలు కొనడం, కొత్త నిర్మాణాలు చేపట్టడం వంటి దుబారా ఖర్చుల జోలికి వెళ్లవద్దని.. సంక్షేమ పథకాల అమలు కారణంగా అభివృద్ధిపై తిరోగమన ప్రభావం పడకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. పథకాల కోసం అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవడంలో క్రమశిక్షణను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నట్టు సమాచారం. ఈ సందర్భంగా రఘురాం రాజన్ తన అనుభవాలను సీఎం బృందంతో పంచుకున్నట్టు తెలిసింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

శీతాకాల విడిదికి రాష్ట్రపతి రాక నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస
- 20న భూదాన్ పోచంపల్లిలో పర్యటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది కోసం సోమవారం సాయంత్రం 4 గంటల 55 నిమిషాలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వస్తున్నారు. రాష్ట్రపతి దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ విమానాశ్రయంలో దిగనున్నారు. రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిగుప్తా, మేడ్చల్ జిల్లా కలెక్టర్, రాచకొండ కమిషనర్ తదితరులు స్వాగతం పలకనున్నారు. రాష్ట్రపతి ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈనెల 20వ తేదీ న భూదాన్ పోచంపల్లిలో ఆమె పర్యటించను న్నారు. అక్కడ చేనేత ప్రదర్శన తిలకిస్తారు. ఈనెల 23 వరకు శీతాకాల విడిది చేస్తారు. ఈ విడిది సమయంలో రాష్ట్రపతి పలువురు ప్రముఖులను, సామాన్యులను కలిసే అవకాశమున్నట్టు సమాచారం.ఈ సందర్భంగా పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు, పర్యటన సందర్భంగా ట్రాఫిక్ దారి మళ్లించే చర్యలను అధికారులు చేపట్టారు. ఈనెల 23న రాష్ట్రపతి తిరిగి ఢిల్లీ బయల్దేరి వెళ్తారని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

యాసంగి పంటకు నీరివ్వండి

మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ



సిద్దిపేట జోన్: యాసంగి పంట కోసం సిద్దిపేట జిల్లా రైతాంగానికి మిడ్ మానేరు నీటిని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రాసిన లేఖను ఆదివారం హరీశ్‌రావు హైదరాబాద్‌లో అందజేశారు. నూతనంగా నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌ను లేఖలో అభినందించారు. జిల్లా రైతుల ప్రయోజనాల కోసం రంగనాయకసాగర్‌లోకి గోదావరి నీటిని పంపింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల యాసంగిలో పంటకు సరిపడేలా నీరు రంగనాయకసాగర్‌లో లేకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతోందని లేఖలో పేర్కొన్నారు. యాసంగిలో రైతు పంటకు నీరు అందించాలంటే మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండాలని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.50 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని మిడ్‌మానేరు నుంచి 1.50 టీఎంసీ నీటిని రంగనాయకసాగర్‌లోకి విడుదల చేయాలని మంత్రిని కోరారు.

నేను ఏ ఉద్యోగం చేయలేను

- ఉద్యోగానికి బదులు ధర్మప్రచారానికి ఉపయోగపడేలా సాయం చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిన మాజీ డీఎస్పీ నళిని
- ఫేస్‌బుక్‌లో సుదీర్ఘ లేఖ



సాక్షి, హైదరాబాద్: తాను ఇప్పుడు ఏ ఉద్యోగం చేసే స్థితిలో లేనని, తనకు ఉద్యోగం ఇవ్వడానికి బదులుగా ధర్మ ప్రచారానికి ఉపయోగపడేలా ఏదైనా సహాయం చేస్తే స్వీకరిస్తానని మాజీ డీఎస్పీ నళినీ చెప్పారు. తెలంగాణ ఉద్యమం తర్వాత 12 ఏళ్లకు తెలంగాణ మూలాలున్న సీఎంగా రేవంత్‌రెడ్డి ఇన్నాళ్లకు తన పోరాటాన్ని, సంఘర్షణను జనం తెలుసుకొనే ఒక సందర్భం సృష్టించడం సంతోషంగా ఉందన్నారు. అందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అంటూ ఫేస్‌బుక్‌లో బహిరంగ లేఖను పోస్ట్ చేశారు. కొద్దిరోజులుగా మీడియా మిత్రులు తన ప్రతిస్పందన తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, అందుకే ఫేస్‌బుక్‌లో బహిరంగ లేఖ పెడుతున్నానని చెప్పారు. తన లేఖ చివరిలో డి.నళినీ ఆచార్య, యజ్ఞ బ్రహ్మ, వేద ప్రచారకురాలు అని పేర్కొన్నారు. 'తెలంగాణ ఉద్యమంలో బలికి బయటపడి సర్వస్వం కోల్పోయిన వాళ్లలో నేను ముందు వరుసలో ఉన్నానన్న విషయం ప్రజలకు అర్థమైంది. నిజం నిలకడ మీద తెలుస్తుందన్నది నిరూపితమైంది. గతం ఒక రీల్ మాదిరి నా కళ్ల ముందు కదులుతోంది. ఇన్నాళ్లు నేను ఒక సస్పెండ్ ఆఫీసర్‌గా 'సోషల్ స్టిగ్మా (కళంకం)'ను మోశాను. నన్ను ఆనాటి ప్రభుత్వం మూ డేళ్లు చాలా ఇబ్బంది పెట్టింది. క్షణక్షణం ఒక గండంలా గడిచింది'అని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంతో ప్రజలకు దగ్గరైనా.. తన బంధుమిత్ర పరివారమంతా వెలివేసిందని, పర్యవసానంగా ఇల్లు, కుటుంబం, ఆరోగ్యం, మనశ్శాంతి అన్నీ కోల్పోయి జీవచ్ఛవంలా బతికానని ఆవేదన వ్యక్తం చేశారు. 'దేవుడు నన్ను క్రిమినాలజీ (నేర శాస్త్రం) నుంచి ఫిలాసఫీ (వేదాంతం) వైపు నడిపించాడు. రెండేళ్ల క్రితం నా జీవితంలోకి మహర్షి దయానంద సరస్వతి ప్రవేశించారు. వేదమాత, యజ్ఞ దేవతలు నాలో తిరిగి ప్రాణం పోశారు. అందుకే నేను నా జీవితాన్ని ఆ మహనీయుని చరణాలకు సమర్పించుకున్నాను. మీరు (సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) రాజు, నేను బ్రాహ్మణిని. మీరు ఇచ్చే ప్రభుత్వ ఫండ్‌ను నేను స్వతంత్రంగా ఉంటూనే వేద, యజ్ఞ, ధార్మిక కేంద్ర ఏర్పాటుకు వినియోగిస్తాను'అని పేర్కొన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మానికి మూలాలైన 'వేదం యజ్ఞం' అనే పుస్తకాన్ని తెలుగు, హిందీ భాషల్లో రాస్తున్నానని, అందువల్ల సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేకపోతున్నట్టు నళినీ చెప్పారు.

మంత్రి కోమటిరెడ్డి డిశ్చార్జ్



సాక్షి, హైదరాబాద్: గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ సోమాజిగూడ యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం డిశ్చార్జ్ అయ్యారు. ఆయన గత మంగళవారం సాయంత్రం సాధారణ పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లగా, వైద్యులు పరీక్షించి గొంతు ఇన్ఫెక్షన్, శ్వాసకోశ సమస్యలు ఉన్నట్టు చెప్పారు. వైద్యుల సూచన మేరకు మంత్రి వెంటనే ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరిన విషయం తెలిసిందే. అనంతరం కోలుకోవడంతో ఆయనను వైద్యులు ఆసుపత్రి నుంచి ఆదివారం డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రిలో ఉండగానే సమావేశాలు ప్రారంభం కావడంతో ఆసుపత్రికి, అసెంబ్లీకి మధ్య మంత్రి కోమటిరెడ్డి రాకపోకలు సాగించడం విశేషం.

బిగ్‌బాస్–7 విజేత ప్రశాంత్

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్ బిగ్‌బాస్ సీజన్–7 విజేతగా నిలిచాడు. 105 రోజులపాటు సాగిన ఈ రియాలిటీ షోలో అసాధారణ ప్రతిభతో టైటిల్‌ను దక్కించుకున్నాడు. రైతుబిడ్డ అయిన ప్రశాంత్ తన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకుంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. తొలుత టాప్–6లో ప్రవేశించిన ప్రశాంత్.. ఆ తర్వాత ఉత్కంఠగా సాగిన ఎలిమినేషన్ల పర్వంలో రెండోస్థానంలో నిలిచాడు. టాప్–2లో అమర్, ప్రశాంత్ మిగిలారు. బిగ్‌బాస్ హోస్ట్ నాగార్జున ఆదివారం రాత్రి ప్రశాంత్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో గజ్వేల్ ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రశాంత్ స్నేహితులు, బంధువులు అభిమానాన్ని చాటుకుంటూ సామాజిక మాధ్యమాల్లో అభినందనల పోస్టులు పెట్టారు. ప్రశాంత్ స్వగ్రామం కొల్గూరులోనూ సంబరాలు అంబరాన్నంటాయి.



విజేత పల్లవి ప్రశాంత్‌కు బిగ్‌బాస్ సీజన్–7 టైటిల్‌ను అందజేస్తున్న నాగార్జున

వారికే చెప్పుకోండి!

▶ మొదటి పేజీ తరువాయి

తమదేనని నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ మరుసటి రోజే ప్రకటించిందని, ఇప్పుడు యూటర్న్ తీసుకోవడం ఏమిటని ఈ సందర్భంగా రేవంత్ నిలదీసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో సొంత ఖర్చుతో మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు నిర్వహించేందుకు స్వచ్ఛందంగా అంగీకరించిన ఎల్అండ్‌టీ.. ఇప్పుడు ఎందుకు మాట మార్చిందని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ అంశంలో జ్యుడిషియల్ కమిషన్‌కు వివరణ ఇచ్చుకోవాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో నిబంధనల మేరకు ఎల్‌అండ్‌టీపై చర్యలకు ఉపక్రమించాలని, అందుకు ఉన్న అవకాశాలను నివేదించాలని ఆదేశించినట్టు సమాచారం.

కొత్త ప్రాజెక్టుల ఖర్చు వివరాలివ్వండి

గత ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల ఖర్చులపై పూర్తి వివరాలు అందజేయాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి కృష్ణా ట్రిబ్యునల్ వద్ద వినిపించాల్సిన వాదనలు, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఈ సమావేశంలో చర్చించారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చే చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నిల్వలు అడుగంటిపోయాయని, ఈ రెండు ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు యాసంగిలో సాగునీరు ఇవ్వలేమని సీఎంకు ఈఎన్‌సీలు నివేదించారు. దీంతో హైదరాబాద్ జంట నగరాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాకు వేసవిలో తాగునీటి సమస్య ఎదురవకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఎగువన ఉన్న నారాయణపూర్ జలాశయం నుంచి కృష్ణానదిలో ఊట నీళ్లు వస్తాయని, మహబూబ్‌నగర్ జిల్లాకు తాగునీటి ఇబ్బందులు ఉండవని ఈఎన్‌సీలు సీఎంకు వివరించినట్టు తెలిసింది. ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్‌లోని నిల్వలను పరిరక్షించాలని సీఎం స్పష్టం చేసినట్టు సమాచారం.

శాసనసభలో ప్రకటించి..

ఈ నెల 20 నుంచి తిరిగి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో నీటిపారుదల శాఖపై కీలక ప్రకటన చేస్తానని.. అన్ని వివరాలతో తనకు నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు యాసంగిలో నీరు ఇవ్వలేని పరిస్థితి, దీనికి కారణాలు, బాధ్యులు ఎవరన్న అంశంపై సీఎం అసెంబ్లీలో ప్రకటన చేయవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాల్లోనే జ్యుడిషియల్ కమిషన్‌ను ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వివరించాయి.

సాగర్ కింద క్రాప్ హాలిడే!

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఆయకట్టుకు యాసంగిలో సాగునీటి సరఫరాపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రమే అధికారులతో సమీక్షించారు. సాగర్‌లో నిల్వలు అడుగంటిన నేపథ్యంలో యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించాలని ఈఎన్‌సీలు సూచించినట్టు తెలిసింది.

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్

- ధరణితో పాటు భూసంబంధిత అంశాలే ప్రధాన ఎజెండా
- గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక, ప్రజావాణి కార్యక్రమ విస్తరణపై చర్చ
- రైతు భరోసా, కౌలు రైతుల గుర్తింపు.. తదితర అంశాలు కూడా
- కొత్త ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని స్పష్టం చేయనున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో తొలిసారి సమావేశం కానున్నారు. ఈనెల 21న జరగనున్న జిల్లా కలెక్టర్ల సమావేశానికి సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వ ఆలోచనా విధానాలను స్పష్టం చేయడంతో పాటు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేసేందుకు గాను ఈ భేటీ ఏర్పాటు చేసినట్టు సీఎంవో వర్గాలు చెపుతున్నాయి. ఈ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ధరణి పోర్టల్‌పై కీలక సమీక్ష ఉంటుందని, పలు భూ సంబంధిత అంశాలు, జీవో 58, 59 అమలు, ప్రజావాణి కార్యక్రమం పట్టణాలు, జిల్లా కేంద్రాలకు విస్తరించడం, గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారుల ఎంపికపై మార్గదర్శకాల ఖరారు, రైతు భరోసా అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కౌలు రైతుల గుర్తింపు కోసం అనుసరించాల్సిన పద్ధతి.. తదితర అంశాలపై చర్చ ఉంటుందని తెలుస్తోంది. ముఖ్యంగా గృహలక్ష్మి పథకాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు ఉండి, ఇళ్లు లేని పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేసే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించాలని సీఎం రేవంత్ యోచిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇండ్ల స్థలాల గుర్తింపు, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల పంపిణీ కోసం మార్గదర్శకాల ఖరారుపై కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాలకు విస్తరించాలని, వారంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కూడా నిర్వహించాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా స్థాయిలో కలెక్టర్లు, క్షేత్రస్థాయిలో ఏయే అధికారులు ప్రజావాణిని ఏయే వారాల్లో నిర్వహించాలనే దానిపై కూడా కలెక్టర్ల భేటీలో నిర్ణయం తీసుకోనున్నారు.

అరవింద్ కుమార్‌కు 'విపత్తు'

- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా దానకిశోర్
- విద్యాశాఖ కార్యదర్శిగా బుర్రా వెంకటేశం
- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం


రాహుల్ బొజ్జా


బి.వెంకటేశం


క్రిస్టినా జెడ్.చొంగ్తు


వాకాటి కరుణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ను ప్రభుత్వం రెవెన్యూ శాఖ పరిధిలోని విపత్తుల నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. హైదరాబాద్ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.దాన కిశోర్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా స్థానచలనం కల్పించింది. కీలకమైన హెచ్ఎండీఏ కమిషనర్, పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ పదవుల అదనపు బాధ్యతల నుంచి సైతం అరవింద్‌కుమార్‌ను తప్పించింది. ఆ రెండు పోస్టుల అదనపు బాధ్యతలనూ దానకిశోర్‌కే అప్పగించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో లీజుపై అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అప్పగింతపై నిర్వహించిన టెండర్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయని అప్పట్లో రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై హెచ్ఎండీఏ కమిషనర్‌గా అరవింద్ కుమార్ స్పందిస్తూ రేవంత్‌రెడ్డికి లీగల్ నోటీసులు పంపారు. ఈ పరిణామాల నేపథ్యంలో అరవింద్‌కుమార్‌ను అప్రధానమైన విపత్తుల నిర్వహణ విభాగానికి బదిలీ చేయడం గమనార్హం. గత ప్రభుత్వంలో సీఎం కార్యదర్శిగా వ్యవహరించిన రాహుల్ బొజ్జాను సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఎస్సీల అభివృద్ధి శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఆయన్ను కొనసాగించింది. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను తప్పించి ఆమెను స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు బదిలీ చేసింది. ఆమె స్థానంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను విద్యాశాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. గత ప్రభుత్వంలో అప్రాధాన్య పోస్టుల్లో ఉన్న వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్.చొంగ్తును కీలకమైన వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా నియమించడం విశేషం.

బదిలీ అయిన ఐఏఎస్ అధికారులు వీరే..

అధికారి	ప్రస్తుత స్థానం	కొత్త పోస్టింగ్
అరవింద్ కుమార్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఎఫ్ఏసీగా హెచ్ఎండీఏ కమిషనర్, పురపాలక శాఖ కమిషనర్/డైరెక్టర్	రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
బి.వెంకటేశం	బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి - కమిషనర్	విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఎఫ్ఏసీగా కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
ఎ.వాణిప్రసాద్	రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి	పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ ముఖ్యకార్యదర్శి ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్(ఎఫ్ఏసీ)
ఎం.దానకిషోర్	జల మండలి మేనేజింగ్ డైరెక్టర్	పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, ఎఫ్ఏసీగా హెచ్ఎండీఏ కమిషనర్, పురపాలక శాఖ కమిషనర్ / డైరెక్టర్
కె.ఎస్.శ్రీనివాస రాజు	రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి	రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి
రాహుల్ బొజ్జా	సీఎం కార్యదర్శి	సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎఫ్ఏసీగా ఎస్సీల అభివృద్ధి శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా కొనసాగింపు
క్రిస్టినా జెడ్.చొంగ్తు	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్	వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి
సి.సుదర్శన్ రెడ్డి	పురపాలక శాఖ కార్యదర్శి	జల మండలి మేనేజింగ్ డైరెక్టర్
టీకే శ్రీదేవి	ఆర్థిక శాఖ కార్యదర్శి	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్
వాకాటి కరుణ	విద్యాశాఖ కార్యదర్శి	స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోజనుల సంక్షేమ శాఖ కార్యదర్శి - కమిషనర్, ఎఫ్ఏసీగా కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
ఆర్‌వీ కర్ణన్	నల్లగొండ జిల్లా కలెక్టర్	వైద్యారోగ్య శాఖ డైరెక్టర్

9 మంది ఐపీఎస్‌ల బదిలీ

- మరో ఐదుగురు నాన్‌కేడర్ ఎస్పీలకూ స్థాన చలనం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఐపీఎస్‌లు, పోలీసు అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఆదివారం తొమ్మిది మంది ఐపీఎస్‌లు, ఐదుగురు నాన్ కేడర్ ఎస్పీలు బదిలీ అయ్యారు. ఐపీఎస్‌ల బదిలీకి సంబంధించి ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, నాన్ కేడర్ ఎస్పీల బదిలీలపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ వేర్వేరుగా జీఓలు జారీ చేశారు.

- హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ సీపీ పి.విశ్వప్రసాద్‌ను హైదరాబాద్ నగర ట్రాఫిక్ సీపీగా బదిలీ చేశారు.
- ఎన్నికల సమయంలో ఈసీ బదిలీ చేసిన వరంగల్ మాజీ సీపీ రంగనాథ్‌ను హైదరాబాద్ సిటీ జాయింట్ సీపీ (క్రైమ్స్ అండ్ సిట్)గా నియమించారు.
- ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న ఎస్ఎం విజయ్‌కుమార్‌ను హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీగా.. ఇప్పటివరకు వెస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న జోయల్ డేవిస్‌ను హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా బదిలీ చేశారు.
- మెదక్ ఎస్పీగా ఉన్న రోహిణి ప్రియదర్శినిని హైదరాబాద్ సిటీ నార్త్‌జోన్ డీసీపీగా నియమించారు.
- సిద్దిపేట సీపీ ఎన్.శ్వేతను హైదరాబాద్ సిటీ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీగా బదిలీ చేశారు.
- పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎల్.సుబ్బారాయుడును హైదరాబాద్ సిటీ ట్రాఫిక్–1 డీసీపీగా నియమించారు.
- టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితిక పంత్, గజరావు భూపాల్, చందనాదీప్తి తదితర అధికారులను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

ఐదుగురు నాన్‌కేడర్ ఎస్పీలు బదిలీ..

- వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎన్.వెంకటేశ్వర్లుకు హైదరాబాద్ సిటీ ట్రాఫిక్–3 డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్–3 డీసీపీగా పనిచేస్తున్న డి.శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.
- రాచకొండ కమిషనరేట్‌లో రోడ్డు భద్రత విభాగం డీసీపీగా ఉన్న శ్రీబాలదేవి హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియమితులయ్యారు.
- మాదాపూర్ డీసీపీగా ఉన్న జి.సందీప్‌ను రైల్వేస్ ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. రైల్వేస్ ఎస్పీ(అడ్మిన్)గా ఉన్న జె.రాఘవేందర్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా...

పీవీపై బీఆర్ఎస్ ప్రేమ ఆశ్చర్యాన్ని కలిగించింది

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుపై బీఆర్ఎస్ కురిపించిన ప్రేమ ఆశ్చర్యాన్ని కలిగించిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పీవీ పక్కా కాంగ్రెస్‌వాది అని, ఆయన ఏ పదవి చేపట్టినా ఆ పదవులకే వన్నె తెచ్చారని చెప్పారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీవీ అంతిమయాత్రను హైదరాబాద్‌లో చేయాలని ఆయన కుటుంబ సభ్యులే కోరారని, అన్ని లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారని చెప్పారు. ఇప్పుడు దాని గురించి బీఆర్ఎస్ నేతలు సభలో చర్చించడం బాధాకరమన్నారు. కృష్ణా జలాలను అక్రమంగా ఏపీకి తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ నేతలు మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయటపెడతామని, ఈ విషయంలో సీఎం రేవంత్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు విమర్శలు మానుకుని ప్రజల నిర్ణయాన్ని గౌరవించి కొత్త ప్రభుత్వానికి సహకరించాలని జీవన్‌రెడ్డి కోరారు.

పార్టీకి పూర్తి సమయం కేటాయిస్తా

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి పని చేస్తా: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఓటమి అనుభవాలు తనకు ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వెల్లడించారు. సంగారెడ్డి ప్రజలు తనకు ఐదేళ్ల విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని ఆదివారం మీడియాతో చెప్పారు. సోనియా, రాహుల్‌గాంధీ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో పార్టీకి పూర్తి సమయం కేటాయించి పనిచేస్తానని ప్రభుత్వంలో ఉన్న నాయకత్వానికి, నాయకులకు, పార్టీ కార్యకర్తలకు వెల్లడిస్తున్నట్లు ఆయన చెప్పారు. తాను ఓడిపోయినప్పటికీ తెలంగాణ ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే ఆరు గ్యారంటీలు సంగారెడ్డి నియోజకవర్గాల ప్రజలకు అందుతాయని హామీ ఇచ్చారు. ఏ రంగంలోనైనా బలవంతులు బలహీనులవుతారని, బలహీనుడి మౌనం బలహీనత కాబోదని, సమయం వచ్చినప్పుడు బలహీనుడు కూడా బలవంతుడు అవుతాడని, ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని తన ప్రయాణంలో ముందడుగులు వేస్తానని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

తొలి జీతం పెన్షనర్ల సంక్షేమానికే..

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



షాద్‌నగర్: తనకు వచ్చే తొలి జీతాన్ని నియోజకవర్గంలోని పెన్షనర్ల సంక్షేమానికి అందజేస్తానని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు, మేధావుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేసిందని దుయ్యబట్టారు. విశ్రాంత ఉద్యోగులకు కనీసం పెన్షన్ ఇవ్వని పరిస్థితి వచ్చిందంటే.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంత అధ్వానంగా మారిందో అర్థమవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్లకు అండగా నిలుస్తుందని.. చిత్తశుద్ధితో పాలన కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

బీఆర్ఎస్ నేతలవి పిల్లిశాపాలు: మల్లు రవి

ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా కేటీఆర్, హరీశ్‌ల తీరు



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న విప్లవాత్మక మార్పులను బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఏడాదిలోగా ప్రభుత్వం పడిపోతుందని పిల్లి శాపాలు పెడుతున్నారని మాజీ ఎంపీ మల్లు రవి ధ్వజమెత్తారు. ఇంకా వారు అధికారంలోనే ఉన్నామన్న భ్రమలో ఉన్నారని, ఇప్పటికైనా భ్రమలు వదిలి వాస్తవంలోకి వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో హితవు పలికారు. పదిరోజుల కాంగ్రెస్ ప్రజాపాలనతో రాష్ట్ర ప్రజానీకం చాలా సంతోషంగా ఉన్నారని మల్లు రవి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌ల ప్రవర్తన ప్రజాస్వామ్య విలువలను దిగజార్చే విధంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో భాగంగానే అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేందుకు సంపూర్ణ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆ ప్రకటనలో రవి పేర్కొన్నారు.

ఇటు అభివృద్ధి.. అటు పేదరికం!

ఒకవైపు గణనీయమైన అభివృద్ధి, అపార అవకాశాలు ఉన్న నగరాలు, గ్రామాలు

- పౌష్టికాహారం, నడిచేందుకు రోడ్డు, ఉండేందుకు ఇళ్లులేని పేద ప్రాంతాలు మరోవైపు
- తెలంగాణలో గడిచిన ఏడేళ్లతో పోలిస్తే 7.3 శాతం తగ్గిన పేదరికం
- అదే సమయంలో పేదరికంలో దేశ సగటును మించిన కొమురంభీం, జోగులాంబ జిల్లాలు
- నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచి–2023 వెల్లడి
- ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలు అవసరమంటున్న నిపుణులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఒక రాష్ట్రం అభివృద్ధికి.. ఒక నగరం, కొన్ని పట్టణాలు, పలు గ్రామాలే కొలబద్ద కాదు. ఏ మూలకు వెళ్లినా కాస్త అటుఇటుగానైనా అభివృద్ధి, ఒకే జీవన విధానం, సమాన అవకాశాలు ఉండాలి. అలా ఉండేలా చూడటం ప్రభుత్వాల విధి. కానీ గణనీయమైన అభివృద్ధి, అపార అవకాశాలు ఉన్న నగరాలు, గ్రామాలు ఒకవైపు.. అసలు తినేందుకు పౌష్టికాహారం, నడిచేందుకు రోడ్డు, ఉండేందుకు ఇళ్లులేని పేద ప్రాంతాలు మరోవైపు ఉంటే ప్రగతి గతి సరిగా లేదనే చెప్పాలి. తెలంగాణలో ఇదే విధమైన పరిస్థితి ఉంది. ఇటీవల నీతిఆయోగ్ విడుదల చేసిన బహుముఖ పేదరిక సూచి–2023.. గడిచిన ఏడేళ్లతో పోలిస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పేదరికం 7.3 శాతం తగ్గిందని వెల్లడించింది. 2015–16లో రాష్ట్రంలో 13.18 శాతం పేదలుండగా 2019 –21కి వచ్చే సరికి 5.88 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. అయితే కొమురంభీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం జాతీయ సగటు (14.96 శాతం)కు మించి పేదరికం నమోదు అవటం గమనించాల్సిన అంశం. గడిచిన పదేళ్ల క్రితమే విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో పైమూడు జిల్లాల్లో అసమగ్ర అభివృద్ధి, సంక్షేమం ఉందని తేలినా.. అక్కడ ప్రత్యేక ప్రణాళిక, కార్యాచరణ అమలు చేయని కారణంగా ఇంకా ఆయా జిల్లాలు అత్యధిక పేద జిల్లాలుగానే కొనసాగుతున్నాయి.

ఇక్కడ అన్నీ సమస్యలే

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికల ఆధారంగా నీతి ఆయోగ్ బాలికా శిశు, బాలింతల ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, విద్యుత్, మంచినీరు, సొంత ఆస్తులు, బ్యాంక్ అకౌంట్ తదితర పన్నెండు అంశాలను తీసుకుని తెలంగాణలోని పేదల లెక్కలు తీసింది. అందులో అత్యధికం తినేందుకు పౌష్టికాహారం, ఉండేందుకు సరైన ఇంటి వసతి లేని వారి సంఖ్యే ఎక్కువగా ఉందని తేలింది. అలాగే అధ్వాన స్థితిలో ఉన్న రోడ్లు, వసతులు, ఉపాధ్యాయులు లేని పాఠశాలలు ఎక్కువగా ఉండటం శోచనీయం.



బండరాళ్ల దారిలో కాలినడక!

ఇది కొమురంభీం జిల్లా కెరమెరి మండలం లైన్‌పటార్ గ్రామానికి వెళ్లే రోడ్డు. ఈ గ్రామంలో 113 మంది జనాభా ఉన్నారు. దారి మొత్తం బండరాళ్లతో అధ్వానంగా ఉంది. దారి మధ్యలో రెండు ఒర్రెలు కూడా ఉండటంతో వర్షాకాలంలో ఆదివాసీల అవస్థలు వర్ణనాతీతం. పిల్లలు, పెద్దలు ఎవరైనా.. ఇలా ఇబ్బందులు పడాల్సిందే.


ఆరు కిలోమీటర్లు నడిస్తేనే..


కొమురంభీం జిల్లా తిర్యాణి మండలం భీమ్‌రెల్ల గ్రామానికి వెళ్లే దారి ఇది. మండల కేంద్రం నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉండే భీమ్‌రెల్లకు వెళ్లాలంటే ముల్కలమంద పంచాయతీ పరిధిలోని తోయరేటి వరకు వాహనంలో వెళ్లాలి. అక్కడి నుంచి ఆరు కిలోమీటర్లు నడిస్తేనే గానీ గ్రామానికి చేరుకోలేం. ఈ గూడెంలో 50 మంది ఆదివాసీలు నివాసం ఉంటున్నారు.



అక్షరాస్యతలో అధ్వానం.. గట్టు

జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అక్షరాస్యతలో దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉంది. మండలంలో 36 శాతం మాత్రమే అక్షరాస్యత ఉంది. మండలంలో 60 పాఠశాలలు ఉన్నాయి. కానీ సరైన వసతులు లేవు. టీచర్ల కొరత వేధిస్తోంది. ఎక్కువమంది తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపించేస్తున్నారు. ఆడపిల్లలను చదివించేందుకు పెద్దగా శ్రద్ధ చూపరు. సీడ్ పత్తి సీజన్ (పత్తి మొగ్గ గిల్లేందుకు చిన్నపిల్లలు అవసరం. దీంతో సీజన్‌లో ఎక్కువగా చిన్నపిల్లలను రైతులు పనుల్లో పెట్టుకుంటారు. పిల్లలు బడికి వెళ్లకపోవడానికి ఇదో ప్రధాన కారణం. అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా స్పందన అంతంత మాత్రమే. ఈ కారణంగా గట్టు మండలం పూర్తిగా వెనుకబడి ఉంది.





ప్రత్యేక కార్యాచరణ అవసరం



పేదరికం, వెనుకబాటుపై ప్రత్యేక కార్యాచరణ ఉండాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లవుతున్నా.. వెనుకబడిన ప్రాంతాలు అలాగే ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.
– ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు లేవు



వెనుకబాటు, అసమానతల వల్లే తెలంగాణ నినాదం పుట్టింది. ఈ రెండింటినీ లేకుండా చేయటం కోసమే తెలంగాణ ఏర్పడింది. కానీ గడిచిన పదేళ్లలో అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై ప్రణాళికలు, రాజకీయ నిర్దేశనం లేకపోవటం వల్లే అభివృద్ధిలో అసమానతలు నెలకొన్నాయి. – గాదె ఇన్నయ్య, సామాజిక విశ్లేషకుడు

మేడారం జాతరను దిగ్విజయం చేయాలి

- ఈ సారి కేంద్రం కూడా నిధులిస్తుందని ఆశిస్తున్నాం
- మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రి సమీక్ష



ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత వర్గాలు పార్టీలకు అతీతంగా పనిచేసి మేడారం జాతరను దిగ్విజయం చేయాలని పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆదివారం తొలిసారిగా ములుగు నియోజకవర్గంలో అడుగు పెట్టిన ఆమెకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మేడారం జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష అనంతరం మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మేడారం మహాజాతరకు నిధుల మంజూరులో అలస్యమైందని, కాంగ్రెస్ నూతన ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా వెంటనే ఆయన నిధులు మంజూరు చేశారని తెలిపారు. జాతర ప్రాంతంలో అభివృద్ధి పనులను శాశ్వతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని, భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, అలాగే జాతరకు నిధులు కేటాయించాలని కోరామని, ఈసారి కేటాయిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహంలో మంత్రి సీతక్క.. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ గాష్ ఆలం, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలసి జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మేడారం జాతరకు ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో భక్తుల తాకిడి జనవరి చివరి వారం నుంచే మొదలవుతున్నందున పనులన్నీ జనవరి 20 నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా రోడ్లు వేయాలని, అవసరమైన చోట మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మేడారంలో పార్కింగ్, వసతుల కల్పనలో ఇబ్బందులు రాకుండా అటవీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు.

ములుగు ప్రజలకు మొదటి ప్రాధాన్యం..

ములుగులో జరిగిన ర్యాలీలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ మంత్రులు, స్థానిక నాయకులు కుట్రలు చేసి తనను అనేక ఇబ్బందుకు గురిచేశారని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో రోడ్లు, నీటి సరఫరా వంటి సౌకర్యాలను కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ములుగు నియోజకవర్గమే తన ఇల్లని.. మొదటి ప్రాధాన్యం ములుగు ప్రజలకే ఇస్తానని, అవసరం అయితే ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలను కొనసాగిస్తానని సీతక్క చెప్పారు.

సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు

గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి



నకిరేకల్: సంక్రాంతి పండుగలోపే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న పొంగులేటి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తన భుజస్కంధాలపై మంచి శాఖలను పెట్టారని, ఇందిరమ్మ రాజ్యంలో సంక్రాంతిలోపే ప్రజలకు స్వీట్లు తినిపించబోతున్నామని చెప్పారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ తన అహంకారాన్ని విడిచిపెట్టలేదని, అసెంబ్లీలో కూడా అచ్చోసిన ఆంబోతులా వ్యవహరిస్తూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పొంగులేటి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దుబారా ఖర్చు పెట్టిన సొమ్మును కక్కించి, ఆ సొమ్మును తెలంగాణ ప్రజలందరికీ పంచి పెడతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ప్రగతి భవన్ కంచెలు బద్దలు కొట్టామని గుర్తుచేశారు. ఈనెల 28న మరో రెండు గ్యారంటీలను అమలు చేయబోతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా సాగిందని, రాబోయే 10, 20 రోజుల్లో డ్రగ్స్ మాఫియాను అంతమొందిస్తామని పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైతుబంధులో మార్పులు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు, సెలబ్రిటీలు, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారికి రెండు మూడెకరాలున్నా రైతుబంధు ఇవ్వకూడదని భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ అంశంపై కసరత్తు జరుగుతున్నందున.. ఇప్పటికిప్పుడే ఏం జరుగుతుందో చెప్పలేమని అంటున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో గతంలో మాదిరిగానే రైతుబంధు పథకాన్ని అమలు చేస్తారని.. వచ్చే వానాకాలం నుంచి కొత్త సంస్కరణలు అమల్లోకి వస్తాయని వివరిస్తున్నారు. దీనిపై త్వరలోనే మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది.

మొత్తంగా 68.99 లక్షల మందికి..

రాష్ట్రంలో రైతుబంధు పథకం 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రారంభమైంది. మొదట్లో ఒక్కో సీజన్‌లో ఎకరాకు రూ.4 వేల చొప్పున.. ఏటా రూ.8 వేల చొప్పున రైతులకు అందేవి. తర్వాత ప్రభుత్వం ఈ సొమ్మును ఏడాదికి రూ.10 వేలు చేసింది. 2018 వానాకాలం సీజన్‌లో 1.30కోట్ల ఎకరాలకు చెందిన 50.25లక్షల మంది రైతులకు రూ.5,236 కోట్లు జమచేయగా.. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1.52 కోట్ల ఎకరాలకు చెందిన 68.99 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్లు అందజేశారు. మొత్తంగా ఈ ఏడాది వానాకాలం సీజన్ వరకు మొత్తంగా రైతుబంధు కింద రైతులకు రూ.72,815 కోట్లు జమ చేశారు.

90 శాతానికిపైగా ఐదెకరాల్లోపు వారే..

ఈ ఏడాది వానాకాలం సీజన్ లెక్కల ప్రకారం చూస్తే.. రైతుబంధు సొమ్ము తీసుకున్న రైతులు 68.99 లక్షల మందికాగా.. అందులో అత్యధికంగా ఎకరాలోపే భూమి ఉన్న రైతులే 22.55 లక్షల మంది ఉన్నారు. వీరి చేతిలో ఉన్న భూమి 12.85 లక్షల ఎకరాలు మాత్రమే.

- ఎకరా నుంచి రెండెకరాల వరకు భూమి రైతుల సంఖ్య 16.98 లక్షలుకాగా.. వీరి చేతిలో ఉన్న మొత్తం భూమి 25.57 లక్షల ఎకరాలు.
- రెండు నుంచి మూడెకరాల వరకు ఉన్న రైతులు 10.89 లక్షలు. భూమి 26.50 లక్షల ఎకరాలు.
- ఇక మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు ఉన్న 6.64 లక్షల మంది రైతుల చేతిలో 22.62 లక్షల ఎకరాలు ఉన్నాయి.
- నాలుగు నుంచి ఐదెకరాల భూమి ఉన్న 5.26 లక్షల మంది చేతిలో 21.04 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి.
- మొత్తంగా ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షలుకాగా.. వీరందరికీ కలిపి సుమారు కోటి ఎకరాల భూమి ఉంది. అంటే మొత్తం రైతుల్లో 90 శాతానికిపైగా ఐదెకరాలలోపే.
- ఐదెకరాలకు పైబడి భూమి ఉన్న రైతుల సంఖ్య కేవలం 6.65 లక్షలే.. కానీ వారి భూమి ఏకంగా 52 లక్షల ఎకరాలు.
- ఈ క్రమంలో ఐదెకరాల పరిమితి విధిస్తే అవసరమైన రైతులకు పథకాన్ని వర్తింపచేసినట్టు అవుతుందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్, దేవాదాయశాఖ అర్చక ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు

వసంత పంచమి రోజున మొక్కు తీర్చుకోండి

- సీఎం రేవంత్‌ను కలిసి కోరిన జోగుళాంబ ఆలయ అర్చకులు
- అర్చక ఉద్యోగుల వేతనాలు, ఆలయాల అభివృద్ధిపై వినతి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 20న మీ అత్తమామలు ఆలయానికి వచ్చి మొక్కుకున్నారని, వసంత పంచమి రోజున వచ్చి మొక్కు తీర్చుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని ఆలంపూర్ జోగుళాంబ ఆలయ అర్చక బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కోరింది. ఏఐసీసీ కార్యదర్శి, ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ నేతృత్వంలో ఆలంపూర్ జోగుళాంబ సమేత బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక బృందం ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ఆశీస్సులతోపాటు అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి చొరవ చూపాలని, రాష్ట్రంలోని అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్చక బృందం వినతి పత్రం సమర్పించింది. అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌శర్మ, ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్‌గౌడ్, ధూప దీప నైవేద్య స్కీం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రాచార్యులు మాట్లాడుతూ...దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు మూడు నెలలకోసారి వేతనాలు వస్తున్నాయని, దశాబ్దాల కాలంగా ఆలయ ఉద్యోగులకు బదిలీలు లేవని సీఎంకు వివరించారు. ఇందుకు స్పందించిన సీఎం రేవంత్ వేతనాలు సకాలంలో ఎందుకు రావడం లేదని ఆరా తీశారు. దేవాదాయ మంత్రి కొండా సురేఖకు చెప్పి శాఖ పనితీరుపై సమీక్ష ఏర్పాటు చేయిస్తానని వారికి హామీనిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను తీర్చిదిద్దుకుందామని, వీలును బట్టి వసంత పంచమి రోజున ఆలయానికి వచ్చేందుకు ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా జోగుళాంబ అర్చకులకు సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.

జట్టుగా పనిచేసి లక్ష్యాలు సాధిద్దాం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

- సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి
- వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా పెంపుపై తొలిసంతకం



సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఆదివారం సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటవీ, కాలుష్య నియంత్రణ మండలి, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరై మంత్రిని అభినందించారు. అనంతరం మంత్రి అటవీ శాఖ కార్యకలాపాలపై తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పథకాలు, పనులపై అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్ గ్రేషియాను పెంచే ఫైలుపై మంత్రి కొండా సురేఖ తొలి సంతకం చేశారు. ప్రస్తుతం రూ. ఐదు లక్షలుగా ఉన్న పరిహారాన్ని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచనుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. వివిధ కార్యక్రమాలు, ఉత్సవాలకు ఏనుగులను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకునేందుకు వీలుగా అనుమతిని ఇస్తూ మరో ఫైల్‌పై మంత్రి సంతకం చేశారు. హరితహారం పథకం లక్ష్యాలపై మంత్రి ఆరా తీశారు. అలాగే అటవీ, దేవాదాయ శాఖలో ప్రస్తుత సిబ్బంది కొరత, కొత్తగా నియామకాలకు ఉన్న అవకాశాలను గురించి సమాచారం తెలుసుకున్నారు. త్వరలోనే శాఖల వారీగా పూర్తిస్థాయి సమీక్షా సమావేశాలు చేపడతామని తెలిపారు. అనంతరం 'జనవాణి– కాలుష్య నివారిణి' పేరిట రూపొందించిన ఆన్‌లైన్ పబ్లిక్ గ్రీవెన్స్ మొబైల్ అప్లికేషన్‌ను, పర్యావరణ అవగాహన పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. హన్మకొండలో నిర్మితమవుతున్న వరంగల్ జోనల్ లేబరేటరీ భవన నిర్మాణ పనుల వివరాలను పీసీబీ అధికారులు మంత్రికి వివరించారు. ఈ లేబరేటరీ భవనం ద్వారా వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు సంబంధించి కాలుష్యంపై శాంపిల్స్ విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. బాధ్యతలు చేపట్టిన మంత్రి సురేఖను బీసీ సంక్షేమం, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు మంత్రిని అభినందించారు.

మట్టి చంద్రమండలం నుంచి తేవాలా?

- అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి పనుల పరిశీలన
- సత్వరమే పూర్తి చేయాలని ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనుల జాప్యంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. వంతెన పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల జాప్యంపై జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్ నిర్మించాలని సూచించారు. అందుకు మట్టి దొరకడం లేదని అధికారులు చెప్పడంతో 'మట్టి ఏమైనా చంద్ర మండలం నుంచి తేవాలా.. స్థానికంగా దొరకడం లేదా'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి 2015లో శంకుస్థాపన చేస్తే ఇప్పటివరకు పనులు పూర్తి కాకపోవడం ఏంటని నిలదీశారు. పనులు వేగవంతం చేసి ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రాచలం రామాలయానికి దేశవిదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మోడల్ డివైడర్లు, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం నుంచి జగదల్‌పూర్ వరకు రహదారి పనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముసలిమడుగు వద్ద వంతెన వెడల్పు పనులను తక్షణమే ప్రారంభించాలని చెప్పారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. పనులకు సంబంధించి సమగ్ర నివేదికలను కార్యాలయంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆరు నూరైనా ఆరు గ్యారంటీలు అమలు

- కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పకుండా విచారణ
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



కాంగ్రెస్ నాయకులు బహూకరించిన ఖడ్గాన్ని ప్రదర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ కార్పొరేషన్/ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): ఆరు నూరైనా ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆదివారం హైదరాబాద్ నుంచి మంథని వెళ్తున్న ఆయనకు సిద్దిపేట పట్టణంలోని రంగథాంపల్లి చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. తరువాత ఆయన కరీంనగర్ చేరుకోగా నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా రెండుచోట్లా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేశామని, త్వరలో మరో రెండు అమలు చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిస్తామని ఎన్నికలకు ముందు చెప్పామని, ఇప్పుడు అసెంబ్లీలో ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో లోపాలు ఇప్పటికే వెల్లడైన విషయాలను కూడా సీఎం చెప్పారన్నారు. కేసీఆర్ కుటుంబసభ్యుల పాస్‌పోర్టులు సీజ్ చేయాలని బీజేపీ నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటేనన్నారు. బీఆర్ఎస్ నాయకులపై చర్య తీసుకోకుండా బీజేపీ తొమ్మిది సంవత్సరాలు ఏం చేసిందని ప్రశ్నించారు.

త్వరలో జాబ్ కేలండర్ ప్రకటిస్తాం

రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం త్వరలో ప్రత్యేక జాబ్ కేలండర్ ప్రకటించి, అమలు చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఉద్యోగ, నిరుద్యోగ, కార్మిక, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. ముఖ్యంగా నిరుద్యోగుల కోసం టీఎస్‌పీఎస్సీ ద్వారా జాబ్ కేలండర్ అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. వ్యవసాయ, ఉపాధి, పారిశ్రామిక, ఐటీతో పాటు ఇతర అన్ని రంగాలను అభివృద్ధి చేసి, దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలుపుతామన్నారు.



కొన్నిసార్లు జనాలు సత్యాలను నమ్మడానికి ఇష్టపడరు. ఎందుకంటే వారు తమ భ్రమలు చెదిరిపోవడాన్ని ఇష్టపడరు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 18 డిసెంబర్ 2023

శీతోష్ణస్నానం

వసంతకాలమే ఋతువుల రాణి అనుకుంటాం కానీ, హిమానీ నిబిడ హేమంతమూ, చలి వణికించే శిశిరకాలం మాత్రం ఏం తక్కువ? ఆమాటకొస్తే ఏ ఋతువుకా ఋతువు జీవజాలాన్ని ఏకచ్ఛత్రంగా శాసించే మహారాణియే! మహారాణి అన్నప్పుడు ఆగ్రహానుగ్రహాలు సమపాళ్లలో ఉండకతప్పదు. అసలు మనం అల్లుకునే ఊహలు, కల్పించుకునే భావనలు, సృష్టించుకునే మాటల ఇరుకులో మనమే ఎలా బందీలమవుతామంటే; చన్నీళ్ళ, వేణ్ణీళ్ళ స్నానాలూ; పర్వదినాల్లో నదీ, సముద్రస్నానాలే తప్ప ఏటేటా నిండా మునిగే ఋతుస్నానాలు మనకు స్ఫురించవు. జ్యేష్ఠ – ఆషాఢమాసాల మహోష్ణంలోనూ, శ్రావణ – భాద్రపదాల కుంభవృష్టుల్లోనూ స్నానించినట్టే మార్గశిర – పుష్యమాసాల్లో నిలువునా కోతపెట్టే శీతలస్నానాలే మనకు రాసిపెట్టి ఉంటాయి. ఇది ఋతువుల రాణి ఆగ్రహపార్శ్వమైతే; హేమంత – శిశిరాలలో మిట్టమధ్యాహ్నం వేళ ఆరుబయటికో, డాబా మీదికో తరిమి శీతోష్ణస్నానంతో హాయిగొలపడం అనుగ్రహపార్శ్వం.

హేమంతం కలిగించే ఆ హాయి ఇంకా ఎన్నెన్ని విధాలుగా ఉంటుందంటే, భక్త పోతన అంతటి వాడిలో కూడా అది రక్తిని రంగరించి రసికతను రాశిపోస్తుంది. శ్రీమంతమైన హేమంతం ప్రవేశించేసరికి చేమంతులు ధరించిన పూబంతుల కౌగిలిలో ఎందరో చలి భయాన్ని జయించారు కానీ; విరహులకు ఆ యోగం లేకుండా మన్మథుడు వేధించాడట. ఉత్తరపు గాలి అదే పనిగా విసురుతూ చీకాకు పెట్టే హేమంతరాత్రులలో మంచుకిరణాల రేరాజు మహాశత్రువయ్యాడట. ఎడమొహం, పెడమొహంగా ఉన్న దంపతులు కూడా రాజీపడిపోయి జంటగా చలిని జయించడానికి సిద్ధమయ్యారట. పగటి సమయం తగ్గి, అగ్ని ఆప్తమిత్రుడైపోయాడట. అతి శీతల దీర్ఘరాత్రుల పాలబడి లోకమంతా గడగడా వణికిపోయిందట. హిమం తాకిడికి కమలాలు బెదిరి తరిగి పోయాయట.

ఆదికవి వాల్మీకి హేమంత చిత్రణలూ హృద్యంగా ఉంటాయి. పృథివి విరగబండుతుంది కానీ మంచు కసిపట్టినట్టు మనుషుల్ని కాల్చుకుతింటుంది. నీరూ, నీడా దుస్సహమవుతాయి. మధ్యాహ్నాలు సుఖసంచార సమయాలవుతాయి. సూర్యుడు దూరంగా జరిగిపోవడం వల్ల హిమాలయాలు మంచుతో పూర్తిగా గడ్డకట్టి సార్థకనామాలవుతాయి. ఆకాశం కప్పు కింద నిద్రించడం మాని అందరూ ఇంటికప్పు కింద ముడుచుకుంటారు. సమస్త జనాన్ని ఇళ్ళల్లో బంధింపజేయగలిగిన హేమంత రుతురాజు యశస్సు దిక్కులను ఆవరించిందా అన్నట్టుగా మంచు సర్వత్రా కమ్ముకుందని మరో కవి వర్ణిస్తాడు. శీతఘాతానికి అన్ని జీవులూ సొమ్మసిల్లినా తను మాత్రం అచలంగా ఉండి అందగించే భూదేవిని మెచ్చి ఆ హేమంత ప్రభువే వజ్రాలు కానుక చేశాడా అన్నట్టుగా ప్రాతర్వేళల లేత పచ్చికలపై మంచుబిందువులు రహించాయని ఇంకో కవి అభివర్ణన.

నిత్యనూతనమవుతూ, ఆదికవి నుంచి ఆధునిక కవి వరకు ఋతుచక్రం ఒక్కలానే తిరుగుతూ ఉంటుంది. 'ఇవాళలాగే ఎప్పుడు కూడా ఇనబింబం పయనించు నింగిపై; ఎప్పుడు కూడా ఇవాళలాగే గాలులు వీచును, పూవులు పూచును' అంటూ శిశువులకు హామీపత్రం రాసిస్తాడు మహాకవి. 'రాత్రంతా మంచుముక్కలా బిగుసుకున్న ఆకాశంలో కదల్లేని నక్షత్రాలు వెండి తెరల కాంతిలోంచి జారుకుంటూ గడ్డిపరకలపై కన్ను తెరిచే' దృశ్యమూ; ఉదయం తొడుక్కున్న చలివస్త్రంలోంచి చెట్లు చల్లని పచ్చసిరాతో జీవితం కాగితమ్మీద కొత్త సంతకాలు చేయడ'మూ (బి.వి.వి. ప్రసాద్) నేటి కవి దృష్టినీ సమానంగా ఆకర్షిస్తాయి. అలాంటిదే, 'పటిక ముక్కల్లాంటి మంచుబిందువుల శీతాకాలంలో చెరువు తేటపడడమూ, అప్పుడే అడవి, ఆకాశం, చెరువు ఒకదాని సౌందర్యాన్ని ఒకటి ఆస్వాదించడమూ' (కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ) కూడా! సంగీతాన్ని వాయుశిల్పంలా దర్శించిన మరో కవి (పసునూరు శ్రీధర్ బాబు) స్వనస్నానమాచరించి శీతాకాలపు గదిలో చుబుకం కింద వణికే పిడికిళ్లేసుకుని ఓ మూల ముడుచుక్కూచోవలసిందేనంటాడు.

ఏ ఋతువూ మరో ఋతువులా ఉండదు; ఒక ఋతువులోంచి మరో ఋతువులోకి మారిపోయే మన అనుభవమూ, అనుభూతీ ఒక్కలా ఉండవు. ప్రతి ఋతువులోనూ మనం పునర్జన్మిస్తాం. ప్రతి ఋతువూ మనకు శైశవం నుంచి వార్ధక్యం వరకూ అన్ని దశలనూ చవిచూపి మరీ నిష్క్రమిస్తుంది. ప్రతి ఋతువులోకీ ఒక శిశువుగా కళ్ళు తెరుస్తాం. ఏటా పునర్జీవించే ఈ ఋతజన్మలను గణించకుండా ఒక్క జన్మనే ఊహించుకోవడం కూడా మనకు మనం విధించుకునే అజ్ఞానమే. అసలు జీవితమంటేనే ఋతువుల మధ్య నిరంతర సంచారం. సందర్భం వేరైనా మరో కవి(సిద్ధార్థ) అన్నట్టు, ఒక ఋతువులోంచి ఇంకొక ఋతువులోకి 'అందరూ ఎవరికివారే కొత్తగా పుట్టి నడచుకుంటూ వెళ్లిపోతారు'.

ఋతువులు, మాసాలు, సంవత్సరాలతో మన కేలండర్ మనకున్నట్టే ఈ విశ్వానికీ, అందులోని ఈ భూగోళానికీ, అందులో మనం కూడా భాగమైన ప్రకృతికీ తనదైన కేలండర్ ఉంది. వందల కోట్ల సంవత్సరాల అస్తిత్వంలో భూమి ఎన్నో హిమప్రళయాలను చూసింది. వాటిలో చివరిదైన మంచుయుగం ఇరవయ్యారు లక్షల సంవత్సరాల క్రితం మొదలై పదకొండు వేల సంవత్సరాల క్రితం వరకూ కొనసాగింది. ఇప్పుడు మనం జీవిస్తున్న కాలాన్ని కూడా మంచుయుగపు అంతర్దశగానే చెబుతారు. శీతోష్ణాల నిరంతర సంఘర్షణ నుంచే జీవం పుట్టి నేటి రకరకాల రూపాల్లోకి పరివర్తన చెందింది. ఆ వైశ్విక ఋతుభ్రమణం మన చేతుల్లో లేనిది కనుక దానినలా ఉంచితే; మనకు తెలిసిన, మనం ప్రత్యక్షంగా భాగమైన ఋతుభ్రమణాన్ని మన చేతులారా గతి తప్పించకుండా చూసుకోవలసిన బాధ్యత మనదే!

ఏం చెప్పినట్లు? ఏం చెప్పనట్లు?

కామెంట్



కరణ్ థాపర్

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. అయితే, 'రద్దు రాజ్యంగ బద్ధమే కానీ, అందుకోసం అనుసరించిన విధానం సమర్థనీయం కాదు' అని అభిప్రాయపడటం చర్చనీయాంశం అయింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి వీలుగా కశ్మీర్ 'రాజ్యాంగ సభ'ను కశ్మీర్ 'రాష్ట్ర శాసన సభ' అనే అర్థంలోకి తెచ్చేందుకు వెసులుబాటును కల్పించే ఆర్టికల్ 367ను కేంద్రం వాడుకుంది. మళ్లీ ఈ 367 సవరణ కోసం నియమ విరుద్ధంగా 272వ రాజ్యాంగ ఉత్తర్వును ఆసరా చేసుకుంది. ఇది అధికారాన్ని దాటి వెళ్లడమేనని న్యాయస్థానం అంటూనే, రద్దును సమర్థించడం తీర్పు సంపూర్ణత్వంపై న్యాయపరమైన సందేహాలను రేకెత్తిస్తోంది.

మునుపు చెప్పిన దానినే మళ్లీ చెప్పడంతో ప్రారంభిస్తాను. ఒక సంక్లిష్టమైన ముగింపును అర్థం చేసుకోడానికి అత్యుత్తమమైన మార్గం ఏమిటంటే స్పష్టత అవసరమయ్యే అంశాలను లేవనెత్తే ప్రశ్నలకు రూపకల్పన చేసుకోవడం. చీకటి సొరంగంలో చిన్న కాంతిరేఖను కనుగొనడం వంటిది ఇది. అందువలన నన్ను కశ్మీర్‌పై తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల వైపు వెళ్లనివ్వండి.

'రద్దు' అని అంతా అంటున్న ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో నేను విషయాన్ని ప్రారంభిస్తాను. రద్దును సమర్థించడాన్ని అలా ఉంచితే – ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి వీలుగా కశ్మీర్ 'రాజ్యాంగ సభ'ను కశ్మీర్ 'రాష్ట్ర శాసన సభ' అనే అర్థంలోకి తెచ్చేందుకు వెసులుబాటును కల్పించే ఆర్టికల్ 367ను కేంద్రం వాడుకుంది. మళ్లీ ఈ 367 సవరణ కోసం కేంద్ర ప్రభుత్వం నియమ విరుద్ధంగా 272వ రాజ్యాంగ ఉత్తర్వు (కాన్‌స్టిట్యూషనల్ ఆర్డర్)ను ఆసరా చేసుకుంది. ఇది అధికార అతిక్రమణేనని బెంచిలోని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 రద్దుకు కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న ఈ మార్గం చట్ట విరుద్ధమైనది కనుక రద్దు చెల్లుబాటు అవదని నిజానికి కోర్టు తీర్పు ఇవ్వవలసింది. కానీ అలా ఇవ్వలేదు. బదులుగా, క్లాజ్ 3ని ఉపయోగించి ఆర్టికల్ 370ని రద్దు చేయవచ్చని పేర్కొనడం ద్వారా కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థించింది. దీనర్థం... ప్రభుత్వం తప్పుగా చేసింది కానీ, మరోలా చేసి ఉంటే తప్పేమీ అయివుండేది కాదని కోర్టు తీర్పు ఇవ్వడం. అంటే ప్రభుత్వాన్ని సమర్థించడం.

ఇది నాకు ప్రభుత్వం నోటిలో న్యాయస్థానమే వాదనలు పెట్టినట్లుగా అనిపించింది. అయితే అవి ప్రభుత్వ వాదనలు కావు. దీనిపై కపిల్ సిబాల్, "ఆర్టికల్ 370పై ప్రభుత్వ స్వీయ అవగాహనకు, కోర్టు తీర్పునకు కొద్దిగానైనా పొంతన లేదు. సుప్రీంకోర్టు ఇలా తీర్పు ఇవ్వడం సరైన విధానమేనా?" అని ట్వీట్ చేశారు.

ఆర్టికల్ 367లో రాజ్యాంగ ఉత్తర్వు 272 ద్వారా ప్రవేశపెట్టిన క్లాజు 3 ప్రకారం, కశ్మీర్ రాజ్యాంగ సభను రద్దు చేయొచ్చన్న వాదన కూడా... 'కశ్మీర్ రాజ్యాంగ' సభ రద్దు అవడం అంటే 'కశ్మీర్ అసెంబ్లీ'కి ఉండే సిఫారసు అధికారం ఉనికిలో లేకుండా పోవడం మాత్రమే అనే వాదనపై ఆధారపడి ఉంటుంది. అంతే తప్ప రద్దుకు భారత రాష్ట్రపతికి ఉన్న అధికారంపై – సిఫారసు చేసేందుకైనా, చేయకుండా ఉండేందుకైనా – అది ఎలాంటి ప్రభావమూ చూపదు. ఈ వాదన ఆమోదయోగ్యమైనదా లేక వివాదాస్పదమైనదా?



ఇప్పుడిక ఆర్టికల్ 3 ప్రకారం ఒక రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు... అంటే, జమ్మూ కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా కుదించేందుకు... కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నదా లేదా అని నిర్ధారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయానికి వద్దాం. కోర్టు రెండు వాదనలపై ఆధారపడింది. ఒకటి: "ఆర్టికల్ 356 అమలులో ఉన్న సమయంలో రాష్ట్రపతి తీసుకున్న ఏ నిర్ణయాలపైన అయినా వచ్చే దావాల విచారణకు కోర్టు కొలువు తీరవలసిన అవసరం ఉంటుందని మేము భావించడం లేదు. ఎందుకంటే రాష్ట్రం తరఫున రాష్ట్రపతి, పార్లమెంటు తీసుకున్న ప్రతి చర్య కూడా సవాలుకు అనువుగా ఉంటే కష్టం. అప్పుడిక రాష్ట్రపతి పాలనలో తీసుకున్న ప్రతి చర్యతోనూ విభేదించే ప్రతి వ్యక్తినీ ఇది ఎలాంటి అడ్డంకులూ లేకుండా కోర్టు వరకు రానిస్తుంది" అని! రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగబద్ధమేనా, కాదా అని నిర్ధారించేందుకు నిరాకరించిన కోర్టు అందుకు చూపించిన ఈ కారణం న్యాయబద్ధమైనదేనా?

కోర్టు చూపించిన రెండవ కారణం – ఆర్టికల్ 3 కింద రాష్ట్ర శాసనసభ సిఫారసులు అమలుకు బద్ధతను కలిగి లేవు. అందులో సందేహం లేదు. అయినప్పటికీ రాజ్యాంగం ప్రకారం అదొక ప్రక్రియ. సిఫారసులకు బద్ధమై ఉండే అవసరం లేనంత మాత్రాన కోర్టు తన నిర్ణయం చెప్పడానికి నిరాకరించవచ్చునా?

ఇప్పుడు, పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగబద్ధమైనదా, కాదా అని నిర్ధారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించిన పర్యవసానంగా జరిగేది ఒకటేమిటంటే... ఇదే పద్ధతిలో మరికొన్ని పునర్వ్యవస్థీకరణలు జరగవచ్చు. ప్రభుత్వం బెంగాల్, కేరళ, తమిళనాడులలో రాష్ట్రపతి పాలనను ప్రకటించి, అసెంబ్లీ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేసి, ఆ తర్వాత – రాష్ట్రాన్ని రద్దు చేయాలా, లేక కేంద్రపాలిత ప్రాంతంగా రాష్ట్ర స్థాయిని తగ్గించాలా అన్న దానిని పార్లమెంటులో నిర్ణయించవచ్చు. ఈ విధానం, ముున్ముందు ఒక ఆనవాయితీగా స్థిరపడిపోతుంది.

రెండో పర్యవసానం... బహుశా మరింత ముఖ్యమైనది. సమాఖ్య భావన (ఫెడర లిజం) అనేది రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో భాగం అని కదా అలోక్ ప్రసన్న కుమార్ అంటారు. దాని అర్థం దాన్ని పార్లమెంటు సవరించలేదని! అయితే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అధికారాన్ని పార్లమెంటరీ అధికారంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనివల్ల పార్లమెంటు అధికారానికీ, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ ప్రాముఖ్యతకూ మధ్య ఇప్పుడు మనకు ఘర్షణ తలెత్తడం కనిపించదా?

'ది హిందూ' మరింత విస్తృతమైన అంశాన్ని వెల్లడించింది. "ఒక రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉన్నప్పుడు రాష్ట్ర శాసనసభ తరఫున ఎటువంటి చర్యనైనా – శాసనపరమైనవి, తిరుగులేని పరిణామాలకు తావిచ్చేవి – ఏవైనా గానీ కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చుననే ఒక సహేతుకం కాని తీర్మానాన్ని సుప్రీంకోర్టు తీర్పు సూచిస్తోంది" అని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దీని పైనే అర్ఘ్య సేన్‌గుప్తా మాట్లాడుతూ, "ఇది భారతదేశ సమాఖ్యతత్వ భవిష్యత్తుకు సంబంధించి కీలకమైన పరిణామాలతో ముడివడి ఉన్న రాజ్యాంగపరమైన ప్రశ్న" అన్నారు. అంటే... కోర్టు తన తాజా తీర్పుతో సమస్యల తుట్టెను కదిలించినట్లయిందా?

ఈ ప్రశ్నలకు సమాధానం దొరికినప్పుడే కశ్మీర్ తీర్పుల గురించి నేనేమనుకుంటున్నానో నాకు తెలుస్తుంది. కానీ ఆ సమాధానాలను ఎవరు అందిస్తారు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



లేని ఆశలు

'మండల్ వర్సెస్ మందిర్' అనేది ఏదో ఒకటి ఎంచుకొమ్మని తప్పుగా సూచిస్తోంది. మండల్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకించింది. కానీ ఇప్పుడు ఉత్తర భారత ఓబీసీ లను రాజకీయమయం చేయడం ద్వారా గట్టెక్కగలనని భావిస్తుండటం మహా అయితే దాని ఆశావాదం అనుకోవచ్చు.

– సూర్యకాంత్ వాగ్‌మోరే, సోషియాలజీ ప్రొఫెసర్



తస్మాత్ జాగ్రత్త!

ఉన్నట్టుండి, చాలామంది సెఫాలజిస్టులు (ఎన్నికల సర్వేలు నిర్వహించేవాళ్లు) 2024 ఫలితాలను ప్రచండంగా ఊహిస్తున్నారు. ఇకనుంచీ ప్రతి వారానికోసారి ఒపీనియన్ పోల్స్ జరుగుతాయి. అవన్నీ కూడా మోదీ 3.0 అని చెబుతాయి. ఇదంతా కూడా రాజకీయ అంచనాలను తలకిందులు చేయడానికి జరిగే వ్యవస్థీకృత ప్రజా సంబంధాల ప్రచారం. అంటే, మిమ్మల్ని మానసికంగా ఏమార్చడం! తస్మాత్ జాగ్రత్త!!

– సంజయ్ ఝా, రచయిత



సత్యం

"ఒకవేళ అందరూ చేస్తున్నప్పటికీ, తప్పు తప్పే. ఒకవేళ ఎవరూ చేయకపోయినప్పటికీ ఒప్పు ఒప్పే."

– వాలా అఫ్సార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్



మొత్తం మిగులే!

నా స్నేహితులు ఎప్పుడైతే తమ పిల్లలను హోమ్‌స్కూలింగ్ చేయడం మొదలు పెడతారో, వాళ్లకు పాఠాలు చెప్పడానికి ఇంత తక్కువ సమయం సరిపోతుందని తెలుసుకుని దిగ్భ్రాంతికి గురవుతారు.

– క్రిస్‌మన్ ఫ్రాంక్, హోమ్‌స్కూలింగ్ యాక్టివిస్ట్



మీరే బాధ్యులు

మనం మన ఆరోగ్యం పట్ల ఇంకొంచెం బాధ్యతగా ఉంటే – దేశమూ (యూకే), జాతీయ ఆరోగ్య సేవా (ఎన్‌హెచ్ఎస్) పథకమూ చాలా మెరుగైన స్థితిలో ఉంటాయి. కొద్దిగా చురుగ్గా ఉండటానికి మనకు అందరికీ రోజులో కొంత సమయం దొరుకుతుంది. ఇది జనాదరణకు నోచుకోని అభిప్రాయమే కావచ్చుగానీ, జనాన్ని మెరుగైన ఆకృతిలో ఉంచే బాధ్యత ప్రభుత్వానిది కాదు – అది మీ మీద ఆధారపడి ఉంటుంది.

– కరోల్ సైకోరా, ఆంకాలజిస్ట్



డబ్బుల్లేని రంగాలు

నైజీరియాలోని వినోద రంగం, సృజనాత్మక రంగాల్లో ఒక్కరు కూడా ధనికులు లేరు. ధనికులు కావాలంటే, కొకైన్ స్మగ్లింగ్ చేయాలి, రాజకీయాల్లోకి వెళ్లాలి. కిడ్నాపర్ కావాలి. పుస్తకం రాయడం, పాడటం, నటించడం పనికిరావు. ఇలాంటివన్నీ చివరికి ఎలా ముగుస్తాయో చూశాం: శస్త్రచికిత్స కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు భిక్ష అడగటంతో! అందుకే భ్రమలు వద్దు.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఫెడ్ రేట్లు తగ్గితే... అంతా బాగేనా?

అభిప్రాయం



డి. పాపారావు

అమెరికా ఫెడరల్ బ్యాంక్ ఈ మధ్య కాలం వరకూ వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చింది. అనంతరం గత కొద్ది దఫాల తమ సమావేశాలలో ఆ పెరిగిన వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయాలు తీసుకుంటూ వచ్చింది. ఈ వడ్డీరేట్ల పెంపు ఉద్దేశ్యం దేశంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం. ఈ చర్య వల్ల ప్రస్తుతం ఆ దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. నవంబర్ 2023కు సంబంధించి వెలువడిన అమెరికా 'వినియోగదారుల ధరల సూచీ' 3.1 శాతంగా నమోదు అయింది. అంతకుముందరి అక్టోబర్ మాసంలో ఈ ద్రవ్యోల్బణం 3.2 శాతంగా ఉంది. ముఖ్యంగా, కోర్ ఇన్‌ఫ్లేషన్‌గా పిలవబడే ఆహార, ఇంధన ధరల పెరుగుదలను లెక్కలలోంచి తీసివేసి, అంచనా వేసే ద్రవ్యోల్బణం 4 శాతం వద్ద స్థిరంగా ఉంది.

నిన్నా మొన్నటి వరకూ పెరుగుతూ వచ్చిన వడ్డీరేట్ల వలన అమెరికా ప్రజల కొనుగోలు శక్తీ, వారు తమ అవసరాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే అవకాశాలూ తగ్గిపోతూ వచ్చాయి. అలాగే వారు తాము గృహాలు లేదా వాహనాల కొనుగోలు కోసం తీసుకున్న రుణాలపై వడ్డీ మొత్తాలు పెరిగిపోయిన కారణంగా కూడా ప్రజల కొనుగోలు శక్తి దెబ్బ తినటం, అనేక సందర్భాలలో వారు అసలు తిరిగి తమ రుణాలను చెల్లించలేని స్థితికి చేరడం వంటివీ జరిగాయి. ఈ నేపథ్యంలోనే నేడు అమెరికాలోని అనేక బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు మొండి బకాయిలు పెరిగిపోయి, ప్రస్తుతం తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి.

ఈ పెరిగిన వడ్డీరేట్ల వలన అమెరికా ఆర్థిక వ్యవస్థలో మెల్లమెల్లగా మందగమనం మొదలవుతోంది. అక్టోబర్ 2023లో అమెరికాలో ఉపాధి కల్పన 8.7 మిలియన్లకు తగ్గడం దీని పర్యవసానమే. ఈ రెండేళ్ల కాలంలో అతి తక్కువ స్థాయి ఇదే! ఒక పక్కన ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన దాఖలాలూ... మరో పక్కన తగ్గిపోతున్న ఉపాధి కల్పన గణాంకాలూ... డిసెంబర్ నెలలో జరిగిన అమెరికా ఫెడరల్ బ్యాంక్ సమావేశంలో 2024లో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూబ్యాంక్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలను ఇచ్చేలా చేశాయి.

పెరిగిపోతున్న ఆటోమేషన్ (మర మనుషులు, సాఫ్ట్‌వేర్‌లలో పురోగతి), కొన్ని దేశాల్లో శ్రామిక శక్తి చౌకగా లభించడం వల్ల అమెరికా వంటి ధనిక దేశాల నుంచి పరిశ్రమలు, సేవారంగం భారీగా విదేశాలకు తరలిపోతున్నాయి. అమెరికాలో నేడు ప్రజల కొనుగోలు శక్తిని నిలిపి వుంచుతోంది షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్ వంటి సట్టా వ్యాపారాలూ, ఉద్దీపనా పథకాలూ; రుణ స్వీకరణను సులువు చేస్తూ, బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు వంటి చర్యలే! స్థూలంగా అటు ఉద్దీపన రూపంలో ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణీని పెంచే చర్యలూ... అలాగే వడ్డీరేట్లను 0 (సున్నా) శాతానికి తగ్గించి వేస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల అమెరికా వంటి దేశాలలో మార్కెట్‌లో డబ్బు చలామణి విపరీతంగా పెరిగిపోయింది. అందుకే సరఫరా పెరిగిపోయిన ఏ సరుకైనా దాని విలువ పడిపోయినట్లుగానే అమెరికా డాలర్ విలువ కూడా పడిపోయింది. సూక్ష్మంగా చెప్పాలంటే డాలర్ కొనుగోలు శక్తి పతనమై, ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు అటు ప్రజల కొనుగోలు శక్తీ, ఇటు షేర్ మార్కెట్ల వంటి ఎటువంటి ఉత్పత్తి లేకుండానే పెట్టుబడిగా పెట్టిన డబ్బును లాభాలతో కలిపి మరింత డబ్బుగా పెంచే వ్యాపారాలు వంటివన్నీ నష్టపోతాయి. కాబట్టి ఈ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత మరలా తిరిగి ప్రభుత్వంపైనో... లేకుంటే ఆ దేశం తాలూకా కేంద్రబ్యాంకు పైనో పడుతుంది.

ఇక ఇప్పుడు, కేంద్రబ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు రూపంలో, తాను చలామణీలోకి తెచ్చిన అధిక నగదు మొత్తాన్నో... లేదా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలోకి ఉద్దీపన రూపంలో పంపిన డబ్బునో తిరిగి మరలా వెనక్కి లాక్కోవలసి వస్తుంది. దీనికోసం కేంద్రబ్యాంకు వడ్డీరేట్లను పెంచుతుంది, ప్రభుత్వం ఉద్దీపన పథకాలను నిలిపివేస్తుంది. తద్వారా, ఆర్థిక వ్యవస్థలో ఉన్న అదనపు డబ్బును వెనక్కి లాగివేసి ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తుంది.

అమెరికాలో నేడు నడుస్తోన్న కథ ఇదే! ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఏర్పడితే డబ్బు చలామణీ పెంచడం... ఈ డబ్బు చలామణీ పెరగడం వలన ద్రవ్యోల్బణం పెరిగితే తిరిగి మరలా అధికంగా చలామణిలోకి తెచ్చిన ఆ డబ్బును వెనక్కి లాగివేయటం అనే వలయమే ఈ కథ సారాంశం. అమెరికా ఆర్థిక వ్యవస్థ తాలూకు ఈ రెండు దశల మధ్యనా ఉన్న కాలవ్యవధి నేడు వేగంగా కుచించుకు పోతోంది.

నిజానికి, అమెరికా ఆర్థిక వ్యవస్థలో డాలర్ల ముద్రణ గత



అనేక దశాబ్దాలుగా జరుగుతున్నప్పటికీ... మనం 2008 అనంతరం పరిణామాలను ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. 2008లో అమెరికాలో ఫైనాన్స్ సంక్షోభం ఏర్పడింది. ఈ సంక్షోభ క్రమంలో, అమెరికా జనాభాలోని సగానికి సగం మంది రాత్రికి రాత్రే దారిద్ర్య రేఖకు దిగువకు నెట్టివేయబడ్డారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు 2009 ఫిబ్రవరిలో ఒబామా ప్రభుత్వం 7,00,800 బిలియన్ డాలర్ల ఉద్దీపనను, అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇచ్చింది. ఆ తరువాత కూడా కొద్ది దఫాలు మరిన్ని ఉద్దీపనలు ఇచ్చారు. తదనంతరం నెలవారీ (95 బిలియన్ల డాలర్ల మేర) ఉద్దీపనలను ఇస్తూ పోయారు. తరువాత ఈ ఉద్దీపనల స్టెరాయిడ్‌ల ప్రభావంతో ఆర్థిక వ్యవస్థ 'నిలదొక్కుకుందనే' నమ్మకం కుదిరాక, కొంతమేర ఈ ఉద్దీపనలను తగ్గించివేశారు. అయితే, 2020 కోవిడ్, లాక్‌డౌన్‌ల అనంతరం మరలా లక్షల కోట్ల డాలర్ల మేర కరెన్సీని ముద్రించి అమెరికా ఉద్దీపనలను ఇచ్చింది. లాక్‌డౌన్‌ల వలన ఇళ్ళకే పరిమితం అయిపోయి... ఆదాయాలు నిలిచిపోయిన కుటుంబీకులను ఆదుకునేందుకు ఈ చర్య అవసరం అయ్యింది. అయితే, 2008 తరువాతి ఉద్దీపనలూ, వడ్డీరేట్ల తగ్గింపులూ, తదనంతరం 2020 నాటి మరింత ఉద్దీపనలూ కలగలిసి 2022 నాటికి ద్రవ్యోల్బణం రూపంలో దాడి మొదలు పెట్టాయి. అప్పటికే శక్తికి మించిన భారాన్ని మోస్తోన్న ఒక ఒంటి మూపుపై అదనంగా మరో గడ్డిపోచ వేసినా కుప్ప కూలిపోయినట్లు... 2008 నుంచి పెంచుతూ వచ్చిన డాలర్ల చలామణీ ప్రభావం, అంతిమంగా 2022లో తీవ్ర ద్రవ్యోల్బణ రూపంలో బయటపడింది. దీనికి విరుగుడుగా మరలా ద్రవ్య చలామణీని తగ్గించే వడ్డీరేట్ల పెంపు వంటి నిర్ణయాలు జరుగుతూ పోయాయి. ఈ క్రమంలోనే నేడు అమెరికా తిరిగి మందగమనం, ఉపాధి కల్పనలో బలహీన స్థితికి చేరింది.

ప్రస్తుత ఫెడరల్ బ్యాంక్ సమావేశం 2024లో మూడు దఫాలుగా 75 బేసిస్ పాయింట్ల మేరకు వడ్డీరేట్లను తగ్గించే అవకాశం గురించి మాట్లాడిందంటే ఈ మందగమనం ద్రవ్యోల్బణాల విషవలయం తాలూకు మరో రౌండ్ మొదలయ్యిందన్న మాట! కానీ, ఈ రౌండ్... గత రౌండ్ (2008, 2022)లు ఉన్నంత కాలం ఉండే అవకాశమే లేదు. ప్రస్తుత రౌండు వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయాలు అతి స్వల్పకాలంలోనే ద్రవ్యోల్బణం తిరిగి తలెత్తే పరిస్థితిని తెచ్చిపెడతాయి. ఫలితంగా ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ తాలూకు ఈ గడియారం లోలకం పరస్పర విరుద్ధ కొసలు అయిన వృద్ధి మందగమనం– ద్రవ్యోల్బణం మధ్య... మరింత వేగంగా కొట్టుమిట్టాడుతుంది. ఆర్థిక వ్యవస్థలో అటువంటి అనిశ్చితి అమెరికా ప్రజా జీవితంలో మరింత తీవ్ర అభద్రతకూ, అనిశ్చితికీ దారితీయగలదు. ఈ క్రమంలోనే అమెరికా డాలర్ పతనం ప్రమాదం కూడా మరింత తీవ్రతరం అవుతుంది. ఇదే జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తాలూకూ స్వరూప స్వభావాలనే పునర్నిర్వచించే పరిస్థితి తలెత్తవచ్చు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

నెల రోజుల వ్రతం

ధనుర్మాస వ్రతం, శ్రీవ్రతం, తిరుప్పావై వ్రతం, గోదా వ్రతం అనే పేర్లతో వ్యవహరింపబడే ముప్పయి రోజుల వ్రతం ఈ డిసెంబర్ 17న ప్రారంభమైంది. ఒక నెల రోజుల పాటు కొనసాగనున్నది. విష్ణు భక్తులు ఆచరించే మూడు వ్రతాలు కృష్ణాష్టమీ వ్రతం, ఏకాదశీ వ్రతం, ధనుర్మాస వ్రతం – ఈ మూడింటిలో కృష్ణాష్టమి ఒకే రోజు ఆచరించునట్టిది. ఏకాదశీ వ్రతం నెలలో 2 సార్లు, సంవత్సరంలో 24 రోజులు చేస్తారు. ఇక ధనుర్మాస వ్రతం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా 'ముప్పదుం తప్పామే' (30 రోజులు) పాటిస్తారు.



తమ తమ గృహాలలో కొందరు, అలాగే దగ్గరలో ఉన్న వైష్ణవాలయాల్లోకి తెల్లవారు జాము సమయంలో భక్తులు చేరుకొని గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలను (తమిళ పాటలను) పాడుతూ, అష్టోత్తర శతనామాలను శ్రీకృష్ణునిపై, గోదాదేవిపై చదువుతూ తులసీదళాలతో, పూలతో అర్చనలు చేస్తారు. ఉపనిషత్తులలో నిగూఢంగా చెప్పబడిన వేదాంతార్థాలను గోదాదేవి 'తిరుప్పావై' అనే తమిళ ప్రబంధాలలో 30 పాటలలో ఇమిడ్చి భక్త జన ప్రియంగా ఒక దివ్య ప్రబంధంగా, ధ్వని కావ్యంగా భక్తులకు అందించింది.

సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించినపుడు మొదలయ్యే ఈ గోదావ్రతం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే వరకు కొనసాగుతుంది. వ్రత సమయంలో భక్తులు తోటి వారితో పరుషంగా, కఠినంగా పలుకరాదు. చాడీలను చెప్పరాదు. ఆహార నియమాలను పాటించాలి. సహృదయంతో మెలగాలి. పరమాత్మ గుణాలను వినాలి. భగవంతుడి పాదాల వైభవాన్ని గూర్చి నోరారా పాడాలి. భగవన్నామ సంకీర్తనం చేయాలి. తెల్లవారు జామునే నిదుర లేచి త్వరగా స్నానం చేయాలి. తమ శక్తి మేరకు దానధర్మాలు చేయాలి. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయాలనే సంకల్పాన్ని కలిగియుండాలి. పుష్పాలతో శ్రీహరిని పూజించాలి. శరణాగతి భావంతో సాత్త్వికమైన ఈ ధనుర్మాస వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించాలి అని తెలిపి, తాను ఆచరించి మనకు అందించింది గోదా దేవి.

– సముద్రాల శఠగోపాచార్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.షష్ఠి సా.6.29 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.6.35 వరకు, తదుపరి శతభిషం తె.4.49 వరకు (తెల్లవారితే మంగళవారం), వర్జ్యం: ప.1.17 నుండి 2.45 వరకు, దుర్ముహూర్తం: ప.12.19 నుండి 1.07 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.12 వరకు, అమృతఘడియలు: రా.10.09 నుండి 11.36 వరకు, సుబ్రహ్మణ్యషష్ఠి; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 5.25.

క్లుప్తంగా...



వామనావతారంలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం భద్రాద్రి రామయ్య వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు దివ్య ప్రబంధం పఠించారు. అనంతరం మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్దకు తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చి హారతి సమర్పించారు. కాగా, ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరువీధి సేవ నిర్వహించారు.

జితేందర్‌రెడ్డి మాతృమూర్తి మృతికి సంతాపం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి మాతృమూర్తి ఈశ్వరమ్మ మృతి పట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఇతర నేతలు సంతాపం తెలిపారు. ఈశ్వరమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

జేఏసీ పోరాటంతోనే స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ

కవాడిగూడ (హైదరాబాద్): జేఏసీ పోరాట ఫలితంగా స్టాఫ్‌నర్సు 7,031 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని స్టాఫ్‌నర్సు జేఏసీ రాష్ట్ర నాయకుడు బొల్లేపాక వెంకటేశ్ తెలిపారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం 5,204 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వగా అనంతరం మరో 1,827 పోస్టులకు ఫైనాన్షియల్ అప్రూవల్ వచ్చిందన్నారు. ఆగస్టులో ప్రకటించిన, ఫైనాన్షియల్ అప్రూవల్ వచ్చిన పోస్టులకు ఒకే సిలబస్, ఒకే పరీక్షవిధానం ఉన్నందున మరోసారి నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల నర్సింగ్ అభ్యర్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదు ర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. అందుకోసం మొత్తం పోస్టులను కలిపి ఫలితాలు ప్రకటించాలని అనేక దఫాలుగా పోరాటం చేశా మని ఈ సందర్భంగా వెంకటేశ్ గుర్తుచేశారు.

రాష్ట్రంలో తొలి చరిత్ర గ్రంథాలయం ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో తొలిచరిత్ర గ్రంథాలయాన్ని నిజామాబాద్‌లో ప్రారంభించినట్లు ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర సంఘటన మంత్రి వేదుల నరసింహం తెలిపారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోటగల్లిలో ఆదివారం ఇతిహాస సంకలన సమితి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో అశ్మక చరిత్ర గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ చరిత్ర అధ్యయనం అనేది యజ్ఞంతో సమానమన్నారు. అలాంటి చరిత్ర అధ్యయనం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందకుర్తి యాదవరావు అని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయం కోసం యాదవరావు 60 ఏళ్లుగా తాను పోగుచేసిన నాలుగు వేలకుపైగా చరిత్ర పుస్తకాలను అందజేసి, తన ఇంటిని చరిత్ర గ్రంథాలయ నిర్వహణ కోసం ఉచితంగా కేటాయించారని పేర్కొన్నారు. మన చరిత్ర వక్రీకరణకు గురైందని, వక్రీకరణలే వాస్తవాలనే భ్రమలో చాలా మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.15 వేలతో పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయానికి అందజేసిన జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్‌ను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో రచయితలు కందకుర్తి యాదవరావు, తాటి వీరేశం, మోహన్ దాస్, బుషి, కందకుర్తి ఆ నంద్, శ్రీమన్నారాయణ విరాట్ పాల్గొన్నారు.

పురపాలికల్లో మోగుతున్న అవిశ్వాస గంట

- పలువురు మేయర్లు, మునిసిపల్ చైర్మన్లపై బీఆర్‌ఎస్‌లోనే అసంతృప్తి
- గతంలోనే 34 మునిసిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు
- బీఆర్‌ఎస్ అధిష్టానం నచ్చజెప్పడంతో నిలిచిన అవిశ్వాసాలు
- కొత్త సర్కార్ కొలువుదీరడంతో అసమ్మతి వర్గంలో కొత్త ఊపు
- కలిసివస్తున్న కాంగ్రెస్ సభ్యులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పురపాలికల్లో కొత్త ఎత్తులు మొదలయ్యాయి. సుమారు నాలుగేళ్లుగా పదవుల్లో కొనసాగుతున్న పాలక మండళ్ల చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లతోపాటు మేయర్లపై 'అవిశ్వాస పరీక్ష'అనే కత్తి వేలాడుతోంది. గత జనవరితో మూడేళ్ల పదవీ కాలం పూర్తవడంతో మునిసిపల్ చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టి చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను గద్దె దించాలని కొందరు సభ్యులు చేసిన ప్రయత్నాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నెరవేరలేదు. దాదాపు 95 శాతం మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో బీఆర్‌ఎస్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లే ఉండటంతో అవిశ్వాసం ద్వారా ఎవరిని గద్దె దించినా.... రాష్ట్రవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే భావనతో గులాబీ పెద్దలు వీరి ప్రయత్నాలకు చెక్ పెట్టారు. దీంతో రాష్ట్రంలోని 130 మునిసిపాలిటీలకుగాను 34 చోట్ల అవిశ్వాస తీర్మానం నోటీసులు జిల్లాల కలెక్టర్లకు ఇచ్చినప్పటికీ, ఎలాంటి అడుగు ముందుకు పడలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని 15 మంది చైర్మన్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే అధికారం దక్కిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లకు అవిశ్వాసంపై పెద్దగా టెన్షన్ లేనప్పటికీ, బీఆర్‌ఎస్‌లోనే ఉన్న మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లలో పదవీగండం భయం పట్టుకుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కువగా గెలిచిన జిల్లాల్లో బీఆర్‌ఎస్‌లో ఉన్న మునిసిపల్ చైర్మన్లు, మేయర్లు అవసరమైతే పార్టీ మారేందుకూ సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే అదే సమయంలో బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్ వాళ్లతో కలిసి ప్రస్తుత పాలక మండళ్ల చైర్మన్లను, వైస్ చైర్మన్లను గద్దె దించేందుకు వ్యూహరచన చేస్తున్నారు.

చాలాచోట్ల ప్రయత్నాలు షురూ

ప్రస్తుతం రాష్ట్రంలోని నల్లగొండ, నేరేడుచర్ల, మంచిర్యాల, బెల్లంపల్లి, ఖానాపూర్, కోస్గి, ఆంథోల్ మునిసిపాలిటీల్లో ఇప్పటికే అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఇందులో బెల్లంపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, సభ్యులు అవిశ్వాస నోటీసు ఇవ్వడం గమనార్హం. ఆర్నెల్ల క్రితం అవిశ్వాస నోటీసులు ఇచ్చిన మునిసిపాలిటీల్లో 15 మంది బీఆర్‌ఎస్ చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, చాలాచోట్ల సభ్యులు వారిని గద్దె దించాలనే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు ఉన్న అన్ని మునిసిపాలిటీల్లో కలెక్టర్లకు అవిశ్వాస నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ అసంతృప్త సభ్యులకు కాంగ్రెస్ సభ్యులు కూడా తోడవుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో సగం మునిసిపాలిటీల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ఇల్లందు, వైరా, జనగాం, భూపాలపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట, పెద్దపల్లి, సుల్తానాబాద్, కోరుట్ల, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, కోదాడ, యాదగిరిగుట్టలో అవిశ్వాస నోటీసులు ఇచ్చేందుకు అసమ్మతి సభ్యులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర సభ్యులతో కలిసి ఈ మేరకు మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు మునిసిపాలిటీల్లోనూ అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

కార్పొరేషన్లలో సైతం

రాష్ట్రంలోని 13 మునిసిపల్ కార్పొరేషన్లలో హైదరాబాద్ మినహా మిగతా కార్పొరేషన్లలో సైతం అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ శివారులోని జవహర్‌నగర్, నిజాంపేట, బోడుప్పల్, ఫిర్జాదీగూడ కార్పొరేషన్లతోపాటు నిజామాబాద్, రామగుండం, ఖమ్మం వంటి కార్పొరేషన్లలో కూడా అవిశ్వానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ మేయర్, చైర్మన్లు ఉన్న పట్టణాల్లో కొంత భిన్నమైన వైఖరి ఉండే అవకాశం ఉంది. కలెక్టర్లకు నోటీసులు ఇచ్చిన తరువాత నెల రోజుల్లోపు అవిశ్వాస తీర్మానానికి గడువు ఇచ్చి ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. అయితే అవిశ్వాస తీర్మానాలపై ప్రభుత్వ నిర్ణయం ఏంటో తెలియాల్సి ఉంది.

యాదాద్రిలో ధనుర్మాస ఉత్సవాలు



గోదాదేవికి హారతులు పడుతున్న ఆచార్యులు, భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. శ్రీస్వామివారి ఆలయాన్ని వేకువజామునే తెరచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం ముఖ మండపంపైన ఉన్న ఉత్తర భాగం మందిరంలో గోదాదేవి అమ్మవారిని అధిష్ఠించి, అలంకరించారు. అనంతరం ఆచార్యులు ఆగమ శాస్త్రానుసారం ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళా భక్తులు మంగళ హారతులతో అమ్మవారిని పూజించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రధానార్చకులు మొదటి పాశురాన్ని పఠించగా.. వేద మంత్రాలతో ఆచార్యులు ఆరాధించారు. ఇక గోదాదేవికి కట్టె పొంగలిని ఆరగింపుగా నివేదించారు. 30 రోజుల పాటు అమ్మవారికి వేకువ జామున పూజలను ఆచార్యులు జరిపించి 30 పాశురాలను పఠిస్తారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ మాఢ వీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కొండపై, కొండ కింద గల బస్టాండ్లు భక్తులతో నిండుగా కనిపించాయి. కొండపైన, కొండ కింద భక్తుల వాహనాలతో పార్కింగ్ నిండిపోయింది. కాగా శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి రెండున్నర గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.54,09,081 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అయ్యప్ప యాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వాముల దుర్మరణం
- తమిళనాడులో ఘటన



సుబ్బయ్య నాయుడు



నర్రా సాంబయ్య



కొట్టు రాజు

మంగపేట: శబరిమల అయ్యప్ప దర్శనం చేసుకుని కారులో తిరిగి వస్తున్న ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన స్వాములు తలారి సుబ్బయ్య నాయుడు, నర్రా సాంబయ్య, కొట్టు రాజు ఆదివారం తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారితో పాటు కారులో ఉన్న కూనూరి అజయ్, జర్పుల రాము తీవ్ర గాయాలపాలయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14న ఇరుముడి సమర్పించేందుకు ఐదుగురు భక్తులు కారులో శబరిమల వెళ్లారు. స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం పేణి జిల్లా, దేవదాన గ్రామంలో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన అజయ్, రామును స్థానికుల సహకారంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

అయ్యప్ప స్వామి భక్తులు మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎంఓ ఆఫీస్‌కు ఫోన్ చేసి మరణించిన వారి మృతదేహాలను స్వస్థలాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎన్‌ఐఏ మోస్ట్‌వాంటెడ్ లిస్టులో ఇద్దరు తెలంగాణవాసులు



అబ్దుల్ అహద్



అబ్దుల్ సలీం

జగిత్యాలక్రైం/ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) ఇద్దరు తెలంగాణవాసులను మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో చేర్చింది. జాబితాలో చేర్చినవారిలో జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన అబ్దుల్ సలీం, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాలపల్లికి చెందిన పీఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ అహద్ ఉన్నారు. సలీం గతంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా పేరుతో జగిత్యాలలో కొంతమందితో కలిసి ఉగ్రవాద శిక్షణ కార్యకలాపాలు కొనసాగించారు. దీంతో 2022 సెప్టెంబర్ 18న ఎన్‌ఐఏ అధికారులు జగిత్యాలలో సోదాలు చేశారు. సెప్టెంబర్ 20న కొంతమందిని అరెస్ట్ చేశారు. ఆ సమయంలో అబ్దుల్ సలీం తప్పించుకున్నాడు. ఈ విషయం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా కలకలంరేపింది. అప్పటి నుంచి ఎన్‌ఐఏ అధికారులు జగిత్యాలతోపాటు నిజామాబాద్, భైంసా ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. సలీం వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. గతేడాది జూలైలో నిజామాబాద్ ఆరోటౌన్ పోలీసులు నగరంలోని ఆటోనగర్‌లో పీఎఫ్‌ఐ శిక్షకుడు అబ్దుల్ ఖాదర్, పీఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సాదుల్లాతోపాటు మరికొందరిని అరెస్ట్ చేశారు. అహద్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అహద్ ఇంట్లో ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేశారు. అయినా విచారణకు హాజరుకాకపోవడంతో అహద్‌ను వాంటెడ్ జాబితాలో చేర్చారు.

ఎయిర్ ఇండియా నిర్వాకం.. అయ్యప్ప స్వాముల అగచాట్లు

బండి సంజయ్ చొరవతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఆదేశించిన కేంద్రమంత్రి



సాక్షి, హైదరాబాద్: ఎయిర్ ఇండియా విమానం నిర్వాహకుల పనికి అయ్యప్ప స్వాములు ఇబ్బంది పడ్డారు. శంషాబాద్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 2.45కి హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా కొచ్చిన్ (కనెక్టింగ్ ఫ్లయిట్ 55990) వెళ్లాల్సిన విమానం సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. దీంతో 7 గంటలుగా ఎయిర్‌పోర్టులోనే 63 మంది అయ్యప్ప స్వాములు పడిగాపులు కాశారు. వీరంతా షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం శబరిమల దర్శనం చేసుకోవాల్సి ఉంది. అయితే అదే సమయంలో ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్ పోర్టుకు విచ్చేసిన బండి సంజయ్‌ను కలిసి వారి గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ఫోన్ చేసిన సంజయ్.. అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయానికల్లా స్వాములు కొచ్చిన్ చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని సంజయ్ కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి వెంటనే ఎయిర్ ఇండియా అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బహ్రెయిన్‌లో వలస జీవులవెత

- ప్రభుత్వం నుంచి కంపెనీలకు నిలిచిన చెల్లింపులు
- వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో కంపెనీలు
- ఇంటి బాట పడుతున్న కార్మికులు

మోర్తాడ్: గల్ఫ్ దేశాల్లో పర్యాటక కేంద్రంగా, వలస కార్మికులకు ఉపాధిని కల్పించే కల్పతరువుగా పేరు సంపాదించిన బహ్రెయిన్ ఇప్పుడు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. వివిధ కంపెనీలకు ప్రభుత్వం నుంచి చెల్లింపులు నిలిచిపోవడంతో వలస కార్మికులకు యాజమాన్యాలు నెలల తరబడి వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో కార్మికులు ఇంటిబాటపడుతున్నారు. నెల రోజుల వ్యవధిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు 2,500 మంది వలస కార్మికులు ఇంటికి చేరుకున్నారని సమాచారం. బహ్రెయిన్‌లో గతంలో సుమారు 75 వేల మంది తెలంగాణ వలస కార్మికులు ఉపాధి పొందేవారు. కరోనా అనంతరం ఏర్పడిన ఆర్థిక సంక్షోభ పరిస్థితులతో చాలామంది స్వదేశానికి చేరుకున్నారు. కరోనా కష్టకాలం నుంచి ఇప్పటివరకు 40 వేల మందికిపైనే సొంతూర్లకు తిరిగి వచ్చినట్లు తెలుస్తోంది. కంపెనీలు దివాలా తీస్తుండటంతో ఇంటికి చేరే వలస కార్మికుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని అక్కడ ఉన్న కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

కొత్త సర్కారుపై కోటి ఆశలు..

అధికారంలోకి వస్తే గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఇప్పుడు ఆ పార్టీయే తెలంగాణలో అధికారంలోకి రావడంతో బహ్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన వలస కార్మికులు సర్కారు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బహ్రెయిన్‌కు రావొద్దు..



ఎవరైనా గల్ఫ్ ఏజెంట్లు బహ్రెయిన్‌లో వర్క్ వీసాలు ఉన్నాయంటే కార్మికులు నమ్మవద్దు. ఇక్కడ అనేక కంపెనీలు దివాలా తీశాయి. వలస కార్మికులకు ఉపాధి కల్పించే పరిస్థితి అసలే లేదు. ఇప్పటికే పని చేసిన వారికి నెలల తరబడి వేతనాలు అందడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వలస కార్మికులకు ఉపాధి చూపేందుకు అనుకూల వాతావరణం లేదు. పనికోసం ఎవరూ ఇక్కడికి రావొద్దు.

– శ్రీనివాస్ గుప్తా, బహ్రెయిన్‌లో ఉన్న నిజామాబాద్ జిల్లావాసి


కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు

▶ మొదటి పేజీ తరువాయి

బస్సుల్లో 25-30 లక్షల మధ్య ప్రయాణించేవారు. ఇప్పుడది 43 లక్షలు దాటుతోంది. వెరసి.. ఈ పథకం ప్రారంభమయ్యాక 40 శాతం ప్రయాణికులు పెరిగినట్టు గుర్తించారు.

జీరో టికెట్ జారీతో తేలిన లెక్క

సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో సోమవారం రద్దీ అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో సగటున 28 లక్షల మంది ప్రయాణిస్తే, సోమవారాల్లో ఆ సంఖ్య 34 లక్షల వరకు ఉంటుంది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభమయ్యాక, గత సోమవారం 51 లక్షల మంది ప్రయాణించినట్టు అధికారులు లెక్కలేశారు. అయితే, ఆరోజు వరకు మహిళలకు టికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. టికెట్లు జారీ చేస్తే, ఎంతమంది మహిళలు బస్సులెక్కారో కచ్చితంగా తెలుస్తుంది. మూడు రోజుల క్రితం జీరో టికెట్ల జారీ ప్రక్రియ మొదలుపెట్టారు. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించారో ఆ టికెట్ల జారీతో తేలుతుంది. దానికి ఎంత చార్జీ చెల్లించాల్సి ఉంటుందో కూడా అందులో స్పష్టమవుతుంది. ఆర్టీసీ ఆ లెక్కలను ప్రతినెలా ప్రభుత్వానికి అందిస్తుంది. దాని ఆధారంగానే ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. ఇప్పుడు జీరో టికెట్ల జారీ ప్రకారం 16వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 43,12,033 మంది ప్రయాణించినట్లు తేలింది. వీరి ద్వారా రూ.1,826.49 కోట్ల ఆదాయం సమకూరింది.



నాలుగువేల బస్సులు పాతవే..: మహిళల సంఖ్య భారీగా పెరిగినందున బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. చాలా బస్సుల్లో మూడొంతుల స్థలంలో మహిళలే ఉంటున్నారు. దీంతో పురుషులు కొందరు స్థలం లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితి అదుపుతప్పకుండా ఉండాలంటే కనీసం 2,500 కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు లెక్కలేశారు. ప్రస్తుతం 40 శాతం రద్దీ పెరిగినా, ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న బస్సులతోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. అయితే, ఆర్టీసీలో దాదాపు నాలుగు వేల బస్సులు బాగా పాతబడి ఉన్నాయి. ఈ బస్సుల్లో రద్దీ పెరిగితే అదుపుతప్పే ప్రమాదం ఉంటుంది. గతంలో కొండగట్టు వద్ద జరిగిన ప్రమాదానికి ఓవర్‌లోడింగే కారణం. ప్రమాదాలు చోటుచేసుకునే వరకు ఎదురుచూడకుండా కొత్త బస్సులు సమకూర్చుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. గతంలో ఆర్డర్ ఇచ్చిన బస్సులు కొన్ని త్వరలో సమకూరే అవకాశం ఉంది. కానీ అవి సరిపోవు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని కొత్త బస్సులు కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించింది.

ఇంజనీరింగ్ కాలేజీల ఎదురీత

▶ మొదటి పేజీ తరువాయి

నాణ్యత పెంచాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) రాష్ట్రానికి సూచించింది. న్యాక్ అక్రిడిటేషన్ పరిధిలోకి వస్తేనే అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ తరహా పోటీని తట్టుకునే ప్రైవేటు కాలేజీలు 20కి మించి లేవు. ఇంజనీరింగ్ విద్యలోనూ మార్పులు వస్తున్నాయి. బోధన ప్రణాళికను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ భవిష్యత్‌లో మరికొన్ని కాలేజీలు మూతపడేందుకు కారణాలవుతాయని అంటున్నారు.

పోటీ పెరిగితే మనుగడ: ప్రొఫెసర్ డి.రవీందర్, ఉస్మానియా వర్సిటీ వీసీ

ప్రైవేటు యూనివర్సిటీలు పెరుగుతున్నాయి. కొత్త కోర్సుల దిశగా అవి దూసుకెళ్తున్నాయి. భవిష్యత్‌లోనూ ఇదే ట్రెండ్ కన్పిస్తుంది. ముఖ్యంగా కంప్యూటర్ కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాల్లోని ప్రైవేటు కాలేజీలు ఈ పోటీని తట్టుకునేలా లేవు. ఇందుకు తగ్గట్టుగా ముందుకెళ్తే పరిస్థితి రావాలి. అప్పుడే వాటికి మనుగడ ఉంటుంది.

కేరళలో కోవిడ్ వేరియంట్

పత్తనంతిట్ట: కేరళలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసు బయటపడింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ఆదివారం ప్రకటించారు. అయితే, దీనితో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని స్పష్టం చేశారు. 'కొన్ని నెలల క్రితం సింగపూర్ ఎయిర్‌పోర్టులో భారతీయ ప్రయాణికుల స్క్రీనింగ్ సందర్భంగా ఈ సబ్ వేరియంట్‌ను గుర్తించారు. దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ కొత్త వేరియెంట్లను గుర్తించారు. తాజాగా, జేఎన్.1 ఉప వేరియెంట్ తిరువనంతపురం కరకుళంలో బయటపడింది. దీనితో కంగారు పడాల్సిన పనిలేదు'అని మంత్రి అన్నారు. అయితే, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సార్స్–కోవ్–2 జెనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్)సాధారణ పరీక్షల్లో భాగంగా ఒక శాంపిల్‌లో ఈ వేరియంట్‌ను నవంబర్ 18న గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ పేర్కొంది. 79 ఏళ్ల బాధిత మహిళ ఇన్‌ఫ్లూయెంజా వంటి తేలికపాటి లక్షణాలతో ఆస్పత్రిలో చేరి కోలుకున్నారని వివరించింది.

మహారాష్ట్రలో ఫ్యాక్టరీలో పేలుడు...
తొమ్మిది మంది దుర్మరణం

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా బజార్‌గావ్‌లోని ఓ పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో సంభవించిన పేలుడులో తొమ్మిది మంది చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోలార్ ఇండస్ట్రీస్‌లోని కాస్ట్ బూస్టర్ విభాగంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆర్మీకి అవసరమైన డ్రోన్లు, పేలుడు పదార్థాలు ఈ యూనిట్‌లో తయారవుతాయి. ఉత్పత్తయిన బూస్టర్లకు సీల్ చేస్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఆ తీవ్రతకు ఫ్యాక్టరీ భవనం కుప్పకూలింది. ఘటన సమయంలో అక్కడ 12 మంది సిబ్బంది విధుల్లో ఉన్నట్లు కంధాలి పోలీస్‌స్టేషన్ అధికారి ఒకరు చెప్పారు. తొమ్మిది మంది మృతుల్లో ఆరుగురు మహిళలున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు.

నాలుగు గగనతల లక్ష్యాలను...
ఒకేసారి ఛేదించిన ఆకాశ్

న్యూఢిల్లీ: గగనతల రక్షణలో భారత్ అసాధారణ ప్రతిభాపాటవాలను ప్రదర్శించింది. ఒకేసారి నాలుగు గగనతల లక్ష్యాలను ఛేదించి ప్రపంచంలోనే ఈ తరహా సామర్థ్యమున్న మొట్టమొదటి దేశంగా అవతరించింది. డీఆర్‌డీఓ ఆదివారం ఈ మేరకు 'ఎక్స్'లో పేర్కొంది. ఆకాశ్ క్షిపణి వ్యవస్థ సాయంతో కేవలం ఒక్క ఫైరింగ్ యూనిట్ నుంచి భిన్న దిశల్లో 25 కిలోమీటర్ల దూరంలోని నాలుగు గగనతల లక్ష్యాలను ఒకేసారి విజయవంతంగా ఛేదించినట్టు తెలిపింది. గగనతల దాడుల నుంచి సున్నిత ప్రాంతాలను రక్షించేందుకు ఆకాశ్ క్షిపణులను వినియోగిస్తారు.

టోర్నడో ఎగరేసుకుపోయినా...
చెక్కుచెదరలేదు!

ఈ బుడతడు మృత్యుంజయుడు
గాల్లో 30 అడుగుల దూరం ఎగిరి పడ్డా ఏమీ కాలేదు
అమెరికాలోని టెన్నెసీలో జరిగిన అద్భుతం

అమెరికాలోని టెన్నెసీలో గత వారం ఓ అద్భుతమే జరిగింది. రెండు భయానక టోర్నడోలు రాష్ట్రాన్ని నిలువునా వణికించాయి. ఓ చిన్నారితో సహా ఆరుగురు వాటి బారిన పడి దుర్మరణం పాలయ్యారు. వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఎన్నో ఆస్తులు ధ్వంసమయ్యాయి. కానీ భయానకమైన అంతటి టోర్నడోలో అమాంతం గాల్లోకెగిసి ఏకంగా 30 అడుగుల దూరం ఎగిరిపోయిన ఓ నాలుగు నెలల బుడతడు మాత్రం చెక్కు చెదరలేదు! అంతటి ప్రమాదం నుంచి నిక్షేపంగా బయటపడి ఔరా అనిపించాడు. సినిమాల్లోనే కన్పించే అద్భుతం తమ జీవితంలో నిజంగా జరిగిందంటూ అతని తల్లిదండ్రులు దేవునికి దండం పెట్టుకుంటున్నారు.

ఇలా జరిగింది..

సిడ్నీ మూర్ (22), అరామిస్ యంగ్‌బ్లడ్ (39) దంపతులది టెన్నెసీలోని క్లార్క్స్‌విల్లే. మొబైల్ వ్యాన్లోనే నివాసం. వారికిద్దరు కొడుకులు. పెద్దవాడు ప్రిన్స్‌టన్‌కు ఏడాది కాగా రెండో వాడు లార్డ్‌కు నాలుగు నెలలు. గత శనివారం హఠాత్తుగా టోర్నడో (భారీ



సుడిగాలి) క్లార్క్స్‌విల్లేను కకావికలు చేసి పారేసింది. స్థానిక అధికార యంత్రాంగం టోర్నడో సైరన్ ఇవ్వకముందే వారి మొబైల్ వ్యాన్‌పై విరుచుకుపడింది. చూస్తుండగానే పైకప్పును లేపేసింది. దాంతో మూర్ హుటాహుటిన ప్రిన్స్‌టన్‌ను హృదయానికి హత్తుకుని నేలకు కరుచుకుపోయింది. ఊయలలో నిద్రిస్తున్న లార్డ్‌ను కాపాడేందుకు తండ్రి పరుగులు తీశాడు. అప్పటికే ఆ చిన్నారిని టోర్నడో అమాంతంగా ఎగరేసుకుపోయింది. సుడిగాలి, అందులో అప్పటికే చిక్కిన అనేకానేక శిథిలాల మధ్య పాపం పసివాడు సుడులు తిరుగుతూ కొట్టుకుపోయాడు. ఆ వెంటనే మొబైల్ వ్యాన్ పూర్తిగా నేలమట్టమైంది. హోరు గాలులు, వాటిని మించిన జోరు వానతో పరిస్థితి భీతావహంగా తయారైంది. శిథిలాల్లోంచి పెద్ద కొడుకుతో పాటుగా మూర్ పాక్కుంటూ సురక్షితంగా బయటికి రాగలిగింది. కానీ పసివాడితో పాటు అతన్ని కాపాడబోయిన తండ్రి సైతం సుడిగాలి దెబ్బకు కొంత దూరం ఎగిరిపడ్డాడు. అంతెత్తు నుంచి అమాంతంగా కిందపడి భుజం విరగ్గొట్టుకున్నాడు. అంతటి నొప్పితోనే బాబు కోసం 10 నిమిషాల పాటు శిథిలాల దిబ్బలన్నీ ఆత్రంగా వెదికాడు. చివరికి 30 అడుగుల దూరంలో పడిపోయిన చెట్టు కింద చిన్నారి లార్డ్ గుక్కపట్టి ఏడుస్తూ కన్పించాడు. అంత దూరం ఎగిరిపోయి అమాంతంగా కింద పడ్డా గాయాలు కాకపోవడం విశేషం. ఇదంతా ఏదో సినిమాలో సన్నివేశంలా తోస్తోందంటూ జరిగిన భయానక ఘటనను మూర్ గుర్తు చేసుకుంది. ''హోరు వానలో జారిపోయిన భుజంతో నిలువెల్లా తడిసి చేతుల్లో మా చిన్న కొడుకుతో నా భర్త తిరిగొస్తున్న దృశ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను'' అంటూ హర్షాతిరేకాలు వెలిబుచ్చింది.

టెన్నెసీలో అంతే...

టెన్నెసీ రాష్ట్రం అమెరికాలో భారీ టోర్నడోలకు పెట్టింది పేరు. గత శనివారం గంటకు ఏకంగా 125 మైళ్ల వేగంతో కూడిన గాలులు, భారీ వర్షంతో విరుచుకుపడ్డ టోర్నడోలు పెను విధ్వంసమే సృష్టించాయి. వాటిలో ఒక టోర్నడో అయితే మాంట్‌గొమరీ కౌంటీ నుంచి లొగాన్ కౌంటీ దాకా ఏకంగా 43 మైళ్ల దూరం ప్రయాణించింది. దారిపొడవునా సర్వాన్నీ తుడిచిపెట్టేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

నా మూడో ఇన్నింగ్స్ పక్కా!

సూరత్ డైమండ్ బోర్స్ భవన ప్రారంభంలో మోదీ

సూరత్: ప్రధానమంత్రిగా తన మూడో ఇన్నింగ్స్‌లో మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. తద్వారా తాను వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. గుజరాత్‌లోని సూరత్ నగరంలో ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య సముదాయంగా అభివృద్ధి చేసిన 'సూరత్ డైమండ్ బోర్స్' భవనాన్ని ఆయన ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాణిజ్య కేంద్రం నూతన భారతదేశ బలానికి, అంకితభావానికి ఒక ప్రతీక అని చెప్పారు. సూరత్ వజ్రాల పరిశ్రమ 8 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని ప్రశంసించారు. కొత్త వాణిజ్య సముదాయంతో మరో 1.5 లక్షల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. సూరత్ కీర్తికిరీటంలో మరో వజ్రం చేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఇది చిన్న వజ్రం కాదని, ప్రపంచంలోనే అత్యుత్తమమైన వజ్రమని వ్యాఖ్యానించారు. దీని వెలుగుజిలుగుల ముందు ప్రపంచంలోనే పెద్దపెద్ద భవనాలు కూడా వెలవెలబోతాయని అన్నారు. ప్రపంచంలో వజ్రాల పరిశ్రమ గురించి ఎవరూ మాట్లాడుకున్నా ఇకపై సూరత్‌ను ప్రస్తావించాల్సిందేనని చెప్పారు.

సూరత్ భాగస్వామ్యం పెరగాలి

వచ్చే 25 ఏళ్లలో సాధించాల్సిన లక్ష్యాలకు ప్రభుత్వం నిర్దేశించుకుందని మోదీ చెప్పారు. దేశాన్ని దాదాపు 10 ట్రిలియన్ డాలర్ల(10 లక్షల కోట్ల డాలర్లు) ఆర్థిక వ్యవస్థగా మార్చడంతోపాటు ఎగుమతుల్లో కొత్త రికార్డులు సృష్టించాలన్నదే తమ ధ్యేయమని వివరించారు. దేశం నుంచి ఎగుమతుల విషయంలో సూరత్ సిటీ భాగస్వామ్యం మరింత పెరగాలని పిలుపునిచ్చారు. వజ్రాలు, ఆభరణాల పరిశ్రమకు ఇదొక గొప్ప అవకాశమని అన్నారు.



'సూరత్ డైమండ్ బోర్స్' భవనం. (ఇన్‌సెట్లో) భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

'డైమండ్ భవన్' కథా కమామిషు...

- మొత్తం విస్తీర్ణం: 35 ఎకరాలు
- భారీ దుకాణాలు: 4,700
- ఆఫీస్ స్పేస్: 71 లక్షల చదరపు అడుగులు
- ఎలివేటర్లు: 131
- బిల్డింగ్ రేటింగ్: ప్లాటినమ్
- మొత్తం వ్యయం: రూ.3,200 కోట్లు

భారత్ వైపు ప్రపంచ దేశాల చూపు

నేడు ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఎన్నో అంశాల్లో మనపై ఆధారపడుతున్నాయని, మన దేశ పేరు ప్రతిష్టలు పెరిగాయని, మేడిన్ ఇండియా ఇప్పుడు బలమైన బ్రాండ్‌గా మారిందన్నారు. లక్షలాది మంది యువతకు సూరత్ డ్రీమ్ సిటీగా మారిందని, ఇక్కడ ఐటీ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. సూరత్ ఎయిర్‌పోర్టులో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను మోదీ ఆదివారం ప్రారంభించారు.

కాశీ తమిళ సంగమం ప్రారంభం

- కాశీ తమిళ సంగమం ఎక్స్‌ప్రెస్‌కు ప్రధాని మోదీ పచ్చజెండా
- నేడు వారణాసిలో 37 ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని నమో ఘాట్‌లో కాశీ తమిళ సంగమం రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకూ జరిగే ఈ వేడుకలో తమిళనాడు, పుదుచ్చేరి నుంచి 1,400 మంది ప్రతినిధులు పాల్గొంటారు. గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధూ, కావేరి పేరిట పలు బృందాలుగా కాశీకి తరలిరానున్నారు. వారణాసితోపాటు ప్రయాగ్‌రాజ్, అయోధ్యను వారు సందర్శిస్తారు. తమిళనాడు, కాశీ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక సంగమాన్ని మరింత బలోపేతం చేయడమే కాశీ తమిళ సంగమం ప్రధాన లక్ష్యం. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు అందులో పాలుపంచుకుంటున్నాయి. వారణాసి–కన్యాకుమారి మధ్య నడిచే కాశీ తమిళ సంగమం ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. ఆయన సోమవారం వారణాసిలో రూ.19,155 కోట్లకు పైగా విలువైన 37 అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో రోడ్లు, వంతెనలు, ఆరోగ్యం, విద్య, పోలీసు సంక్షేమం, స్మార్ట్ సిటీ, పట్టణాభివృద్ధి, రైల్వే, ఎయిర్‌పోర్టు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.

అంబులెన్స్‌కు దారిచ్చిన మోదీ కాన్వాయ్

వారణాసిలో ఆదివారం ప్రధాని మోదీ వాహన శ్రేణి ఓ అంబులెన్స్‌కు దారి ఇచ్చింది. నాదేసర్ ప్రాంతంలోని కటింగ్ మెమోరియల్ స్కూల్ వైపు మోదీ కాన్వాయ్ దూసుకెళ్తుండగా దాని వెనుకే హారన్ మోగిస్తూ అంబులెన్స్ వచ్చింది. దారి కోసం ఎదురు చూస్తోంది. అది గమనించిన మోదీ కాన్వాయ్‌లోని వాహనాలు వేగం తగ్గించుకొని కాస్త పక్కకు వెళ్లాయి. వాటిని దాటుకొని అంబులెన్స్ ముందుకెళ్లిపోయింది.



అంబులెన్స్‌కు దారిస్తున్న ప్రధాని కాన్వాయ్

21న సీడబ్ల్యూసీ కీలక భేటీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అమలుచేయాల్సిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) డిసెంబర్ 21వ తేదీన సమావేశం కానుంది. డిసెంబర్ 19వ తేదీన విపక్షాల 'ఇండియా' కూటమి భేటీ పూర్తయిన రెండు రోజులకు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరగనుంది. వివిధ రాష్ట్రాల్లో కూటమి పార్టీలతో సీట్లు పంపకం, ఎన్నికల ప్రచార వ్యూహాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. హిందీ ప్రాబల్య రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఓటమిపై సమీక్ష జరగొచ్చు. నిరుద్యోగం, పెరిగిన ధరలను ప్రధాన విమర్శనాస్త్రాలుగా తీసుకుని పశ్చిమ–ఈశాన్య భారతాల మధ్య రాహుల్‌గాంధీ మరోమారు పాదయాత్ర చేసే అంశాన్నీ చర్చించే వీలుంది.

19న ఇండియా 'కీలక' భేటీ

'ఇండియా' కూటమి విపక్ష పార్టీలు ఢిల్లీలో ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం సమావేశం కానున్నాయి. సీట్ల పంపకం, కనీస ఉమ్మడి కార్యాచరణ, సీట్ల పంపకం జరిగిన చోట్ల ఉమ్మడిగా ప్రచార ర్యాలీలు చేపట్టడం వంటి సవాళ్లు నేతలకు స్వాగతం పలకనున్నాయి. వీటిపై సమావేశంలో ఒక స్పష్టత వచ్చే వీలుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ''నేను కాదు, మనం'' అనే కొత్త నినాదంలో జనంలోకి వెళ్లాలని విపక్షాల కూటమి నిర్ణయించిన సంగతి తెల్సిందే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
నేలకొరిగిన సీఆర్‌పీఎఫ్ ఎస్సై

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల ఘటనలో సీఆర్పీఎఫ్ 165వ బెటాలియన్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి వీరమరణం పొందగా రాము అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో బద్రేలోని సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి ఉర్సంగల్ వైపు జవాన్లు కూంబింగ్ సాగిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఎస్సై సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు. సుధాకర్‌రెడ్డి సొంతూరు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు. ఈ నెలలో బస్తర్ డివిజన్‌లో మావోయిస్టుల సంబంధిత ఘటనల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారు. 13న నారాయణ్‌పూర్ జిల్లా మావోయిస్టుల దాడిలో ఒక జవాను, 14న కాంకేర్ జిల్లా నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి మరో బీఎస్ఎఫ్ జవాను ప్రాణాలు కోల్పోయారు.



పోప్ ఫ్రాన్సిస్ 88వ పడిలోకి ప్రవేశించారు. ఆదివారం తన 87వ జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాటికన్‌లో ఆయన పుట్టినరోజు కేకును రుచి చూస్తున్న బాలలు.

'సామాజిక' దూరంతో
మానసిక ఆరోగ్యం, ఉద్యోగ తృప్తి

సోషల్ మీడియా వాడకం తగ్గిస్తే ఎంతో మేలు • అధ్యయనంలో వెల్లడైన పలు ఆసక్తికర అంశాలు

న్యూఢిల్లీ: అస్తమానం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో మునిగిపోయేకంటే కాస్తంత సేపు వాటిని పక్కనబెడితే మానసిక ఆరోగ్యంతోపాటు ఉద్యోగంలో సంతృప్తి పెరుగుతాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చి చెప్పింది. జర్మనీలోని ప్రఖ్యాత రూహర్–యూనివర్సిటీ బూచమ్, జర్మనీ మానసిక ఆరోగ్య కేంద్రం నిర్వహించిన అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సామాజిక మాధ్యమాల్లో గడిపేవారు తమ ఉద్యోగంపై దృష్టిపెట్టలేకపోతున్నారు. వీరు ఒక 30 నిమిషాలు సోషల్ మీడియా వాడకాన్ని తగ్గిస్తే మానసిక ఆరోగ్యం మెరుగవడంతో పాటు వృత్తిజీవితం పట్ల సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు
- సోషల్‌మీడియాలో ఆన్‌లైన్‌లో లేనపుడు ఏదో మిస్ అవుతున్నామే అనే భావన ఈ 30 నిమిషాల దూరం తర్వాత తగ్గిందట



- ఇంతకాలం సోషల్ మీడియాలో గడుపుతూనే పని చేసిన వాళ్లు అతిగా పనిచేశామని భావించే వారట. 30 నిమిషాలు సోషల్‌మీడియా పక్కనబెడితే 'అతిపని' భావన కొంచెం తగ్గిందట
- పని మధ్యలో వదిలేసి వాట్సాప్, ఫేస్‌బుక్ చూసేవాళ్లు తిరిగి పని మీద పూర్తి ఫోకస్ చేయలేకపోతున్నారు. దీంతో పనిలో చక్కని ఫలితాలు అందుకోలేకపోతున్నారు
- రోజుకు కనీసం 35 నిమిషాలు సోషల్‌మీడియాలో గడిపేవారిపై అధ్యయనం చేశారు
- అధ్యయనంలో భాగంగా సగం మంది పాత అలవాట్లనే కొనసాగించగా, మిగతా వారిని పూర్తిగా మీడియాకు దూరంపెట్టారు
- ఒక ఏడు రోజుల తర్వాత వారి పనిభారం, ఉద్యోగంలో సంతృప్తి, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి స్థాయిలు, పని పట్ల అంకితభావం, మీడియాకు ఎందుకు అతుక్కుపోవాల్సి వస్తోంది? వంటి ప్రశ్నలడిగి విశ్లేషించారు.
- దైనందిన జీవితంలో కోల్పోయిన భావోద్వేగాలను 'సోషల్ మీడియా' ద్వారానైనా పొందేందుకు కొందరు వాటికి అతుక్కుపోయారని అధ్యయనం అభిప్రాయపడింది
- కొందరు మెరుగైన ఉద్యోగం కోసం లింక్డ్‌ఇన్ వంటి వేదికను ఆశ్రయించారు.
- వాస్తవిక ప్రపంచం నుంచి తప్పించుకునేందుకు కొందరు సోషల్ నెట్‌వర్క్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇవిలాగే కొనసాగితే ప్రతికూల ప్రభావం చూపుతాయని అధ్యయనం హెచ్చరించింది.

భద్రతా వైఫల్యం తీవ్రమైన అంశం

దీనిపై అనవసర వాదులాట వద్దు • ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ: లోక్‌సభలోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి పొగపెట్టిన ఘటనను తీవ్రమైన అంశంగా ప్రధాని మోదీ ఆదివారం అభివర్ణించారు. గత బుధవారం జరిగిన ఈ ఘటనపై ఓ హిందీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తొలిసారిగా స్పందించారు. ''పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం తీవ్రమైన అంశమే. ఈ ఘటన నన్నెంతగానో బాధించింది. దీనిపై విపక్షాలు ఉభయ సభల్లో ఆందోళనలు చేస్తూ అనవసర వాదులాటకు దిగడం వ్యర్థం. ఈ చొరబాటు వెనుక ఉన్న శక్తుల గుట్టుమట్లు బయటపెడతాం. ఇవి పునరావృతం కాకుండా ఉమ్మడిగా పరిష్కారం కనుగొందాం'' అని సూచించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్లలో ముఖ్యమంత్రులైన వారు కొత్తవాళ్లు కాదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. సుప్రీంకోర్టు నేపథ్యంలో 370ను ఎవరూ ఎప్పటికీ తిరిగి అమల్లోకి తేలేరన్నారు. ''2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేయబోతోంది. ఇకనైనా విపక్ష పార్టీలు తమను ప్రజలు ఎందుకు గెలిపించట్లేదనే ఆత్మావలోకనం చేసుకుంటే మంచిది' అని సూచించారు.

ప్రధాని పారిపోతున్నారు: కాంగ్రెస్

లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై చర్చించకుండా ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. నిందితులకు లోక్‌సభలోకి పాస్‌లిచ్చింది బీజేపీ ఎంపీ కావడమే ఇందుకు కారణమని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.



కాలిన ఫోన్లు స్వాధీనం

లోక్‌సభలో కలకలం ఘటనలో నిందితుల తాలూకు కాలిన ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన సూత్రధారి లలిత్ ఝా బసచేసిన రాజస్తాన్‌లోని నాగౌర్‌లో అవి లభించాయి. వాటిని కాల్చేయడంతో సాక్ష్యాధారాల ధ్వంసం సెక్షన్లను ఎఫ్‌ఐఆర్‌కు జతచేశారు. ఈ ఘటనలో సాగర్ శర్మ, మనోరంజన్, అమోల్ షిండే, నీలం దేవి, లలిత్ ఝా, మహేశ్ కుమావత్‌లను అరెస్ట్ చేసి కఠిన ఉపా చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు పెట్టడం తెలిసిందే. లోక్‌సభ ఛాంబర్‌లో మనోరంజన్, సాగర్‌శర్మ, పార్లమెంట్ ప్రాంగణంలో నీలం దేవి, అమోల్ షిండే పొగ గొట్టాలు విసిరి కలకలం రేపడం తెలిసిందే. సంబంధిత వీడియోలను వైరల్ చేయాలంటూ లలిత్ తన మిత్రుడు సౌరవ్‌కు పంపాడు. తర్వాత రాజస్థాన్‌లోని నాగౌర్‌లో తమ ఫోన్లను తగలబెట్టాడు. ఢిల్లీ వచ్చి లొంగిపోయాడు.

అయోధ్యలో మసీదు నిర్మాణం..
మేలో ప్రారంభం

లక్నో: రామజన్మభూమి– బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అయోధ్యలో ప్రతిపాదిత మసీదు నిర్మాణ పనులు వచ్చే ఏడాది మేలో ప్రారంభం కానున్నాయి. అయోధ్యలోని ధన్నిపూర్‌లో మసీదు నిర్మాణ బాధ్యతలను ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ తీసుకుంది. మసీదు నిర్మాణానికి అవసరమై నిధుల సేకరణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జుల నియామకాలు చేపట్టాలని ట్రస్ట్ యోచిస్తోంది. ఫిబ్రవరిలో మసీదు తుది డిజైన్‌ను ఖరారు చేసి అధికారుల ఆమోదానికి పంపుతామని ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ చీఫ్ ట్రస్టీ జుఫర్ ఫరూకీ తెలిపారు. '15 వేల చదరపు అడుగులకు బదులు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మసీదు నిర్మాణం జరగనుంది. జవాబుదారీతనం, పారదర్శకత పాటిస్తూ నిధులు సేకరిస్తాం. ప్రభుత్వమిచ్చే భూమిలో మసీదుతో పాటు ఆస్పత్రి, లైబ్రరీ, కమ్యూనిటీ కిచెన్, మ్యూజియంలను కూడా నిర్మిస్తాం. నిర్మాణ పనుల కోసం ముంబైకి చెందిన సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నాం. నిధుల లభ్యతపైనే నిర్మాణ పనుల వేగం ఆధారపడి ఉంటుంది'' అని ట్రస్ట్ సెక్రటరీ అథార్ హుస్సేన్ చెప్పారు. మధ్యప్రాచ్య మసీదుల శైలిలో రూపొందిన తొలి డిజైన్ తిరస్కరణకు గురవడం కూడా ఆలస్యానికి ఒక కారణమన్నారు. ప్రతిపాదిత మసీదు, ఇతర భవనాల డిజైన్‌ను మసీదు కమిటీ 2021లో అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీకి సమర్పించగా ఈ ఏడాది మార్చిలో అనుమతులు లభించాయి. కేంద్రం అయోధ్యలో ఐదెకరాలను యూపీ సున్నీ సెంట్రల్ వక్ఫ్‌బోర్డ్‌కు అందజేయగా, బోర్డ్ మసీదు నిర్మాణ బాధ్యతలను ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్‌కు అప్పగించింది.

అయోధ్యకు రాకండి!

స్థానిక మందిరాల్లోనే పూజలు చేయండి: నిర్వాహకులు

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగే జనవరి 22న అయోధ్యకు పోటెత్తొద్దని ఆలయ నిర్వాహకులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ''ఆ రోజు అయోధ్యలో ఊహించనంతటి రద్దీ ఉంటుంది. కనుక ఎలాగైనా కార్యక్రమాన్ని కళ్లారా చూడాలని అయోధ్య దాకా రాకండి. మీరున్న చోటే ఆలయాల్లో పూజలు చేయండి'' అని భవ్య రామమందిరం ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ విజ్ఞప్తి చేశారు. జనవరి 16వ తేదీ నుంచే వైదిక కార్యక్రమాలు మొదలవుతాయని చెప్పారు. 80 వేల మంది భక్తులకు బస, భోజన వసతి కల్పించేలా అయోధ్యలో 'టెంట్ సిటీ'ని నిర్మిస్తున్నారు.

ఆలయ పూజారుల్లో తిరుపతి పూర్వ విద్యార్థి

అయోధ్య రామాలయ పూజారిగా ఎంపికైన మోహిత్ పాండే తిరుపతిలో గతంలో వేద విద్య అభ్యసించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయంలో ఎంఏ (ఆచార్య) పట్టా సాధించారు. లక్నోలోని సీతాపూర్‌కు చెందిన మోహిత్ గాజియాబాద్‌లోని దుధేశ్వర్ వేద్ విద్యాపీఠ్‌లో ఏడేళ్ల సామవేదం అభ్యసించారు. తర్వాత వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వేద విద్యాభ్యాసం కొనసాగించారు.

'వేగంగా బెయిల్ దరఖాస్తుల పరిష్కారం'

న్యూఢిల్లీ: బెయిళ్లు, ముందస్తు బెయిళ్ల మంజూరులో జాప్యం వద్దని, వాటిపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పేర్కొంది. ఇటీవల ఓ ఫోర్జరీ కేసులో విచారణ సందర్భంగా జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్‌పై కీలక వ్యాఖ్యలు చేసింది. బెయిల్ అనేది వ్యక్తుల స్వాతంత్ర్యానికి సంబంధించి అత్యంత ముఖ్యమైన అంశమని స్పష్టం చేసింది. బెయిల్ దరఖాస్తులను లిస్టింగ్ చేయడంలో, వాటిని అమోదించడం లేదా తిరస్కరించడంలో జాప్యం జరిగితే అది వ్యక్తుల స్వేచ్ఛను హరించినట్టే అవుతుందని స్పష్టం చేసింది.

'మధ్యధరా'లో పడవ మునిగి 60 మంది మృతి

కైరో: మధ్యధరా సముద్రంలో పడవ మునిగి 60 మందికి పైగా వలసదారులు దుర్మరణం పాలయ్యారు. యూరప్‌కు బయల్దేరిన ఈ పడవ లిబియా తీర ప్రాంతంలో బోల్తాపడింది. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువని ఐరాస వలసల విభాగం ఆదివారం వెల్లడించింది. ఈ మార్గంలో కిక్కిరిసిన అక్రమ పడవల్లో ప్రయాణిస్తూ వేలాది మంది నిర్భాగ్యులు పడవ ప్రమాదాలకు బలయ్యారు. ఈ ఏడాదే 2,250 మంది మరణించారని ఐరాస తెలిపింది.

ఇంకా లింగ వివక్ష: సీజేఐ



బెంగళూరు: ప్రాంతీయ భేదాలకు అతీతంగా చాలా కుటుంబాల్లో నేటికీ లింగ వివక్ష సూక్ష్మ రూపంలో కొనసాగుతూనే ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు. పైగా వాటిని ఎవరూ ప్రశ్నించరాదన్న ధోరణి కూడా గూడుకట్టుకుని పోయిందని ఆక్షేపించారు. ''ఎవరు ఔనన్నా, కాదన్నా చేదు నిజం మాత్రం ఇదే. పైగా న్యాయస్థానాలు వ్యక్తిగత స్వేచ్ఛ కంటే వివాహ వ్యవస్థను నిలబెట్టడానికే ప్రాధాన్యతనిస్తూ రావడం ద్వారా దీనికి కొంతవరకు పరోక్షంగా ఆమోదముద్ర వేశాయి'' అని అభిప్రాయపడ్డారు. ఆదివారం బెంగళూరులో ఆయన జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య శతాబ్ది స్మారక ప్రసంగం చేశారు. సంతానంలో ఒకరికి మించి పై చదువులు చదివించలేకపోతే అత్యధిక కుటుంబాల్లో ఆ అవకాశం కచ్చితంగా మగ సంతానానికే దక్కుతుంది. స్త్రీకి ఉండే ఆంక్షలు, ఒత్తిళ్లు మగవాడికి ఉండవన్నది కూడా వాస్తవం'' అని సీజేఐ అన్నారు.

సాక్షి కరీంనగర్

సోమవారం । 18 । డిసెంబర్ । 2023

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



కరీంనగర్ కల్చరల్: ధనుర్మాసోత్సవాలను ఆదివారం ప్రారంభమయ్యాయి. కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్, విద్యానగర్, మంకమ్మతోట, జెడ్పీ క్వార్టర్స్, కట్టరాంపూర్, జ్యోతినగర్ శ్రీవేంకటేశ్వర, వావిలాలపల్లి, సప్తగిరికాలనీ, గాంధీ రోడ్ రామాలయాలు, బొమ్మకల్ రోడ్ యజ్ఞవరాహక్షేత్రం భక్తులతో సందడిగా మారాయి.



రాజన్నకు కోడె మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది.

గరిష్టం/కనిష్టం

28.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి. తెల్లవారుజామున పొగమంచుకు అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎలగందులలో ఉచిత వైద్య శిబిరం



కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఎలగందుల గ్రామంలో ఆదివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రారంభించారు. వైద్యులు రామనాథన్(కార్డియాలజిస్టు), నాగరాజు (జనరల్ ఫిజీషియన్) సుమారు 200 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, 2డీ–ఇకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, మేనేజర్ దాసరి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ బోనాల నరేశ్, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, రతన్‌కుమార్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కరీంనగర్: ఎంపీ సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మరోసారి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్‌లపై అవాకులు చెవాకులు పేలితే తరిమికొడతామని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబసభ్యుల పాస్‌పోర్టులు సీజ్ చేయాలని, కోట్లాది డబ్బులను మింగారని చేస్తున్న అబద్ధపు ప్రచారం రానున్న ఎంపీ ఎన్నికల్లో సీటు పొందడం కోసమేనని విమర్శించారు. బీజేపీ దోపిడీ దొంగల పార్టీ అన్నారు. లలిత్ మోడీ, నీరవ్‌మోడీ, అదానీ, అంబానీలు దేశ సంపదను కొల్లగొట్టారని, వారి పాస్‌పోర్టులను సీజ్ చేయకుండా స్వరాష్ట్ర సాధన కోసం, అభివృద్ధి కోసం పరితపించిన కేసీఆర్‌పై విమర్శలు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ఎంపీ ఐదేళ్లలోనే వేల కోట్ల రూపాయలు సంపాదించాడని ఆరోపించారు. ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకొని, పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు



కరీంనగర్ స్పోర్ట్స్: మానేరు డ్యాం ఆనకట్టపై ఆదివారం జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు జరిపారు. వీటిని మానేరు లేక్ ఎస్‌ఐ సురేశ్ ప్రారంభించారు. 16, 18, 20 ఏళ్ల బాల బాలికలకు, పురుషులకు, మహిళలకు వయసుల వారీగా 2, 4, 6, 8, 10 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

50 ఏళ్లకు.. ఒక్కచోటకు



సప్తగిరికాలనీ(కరీంనగర్): చొప్పదండి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్లో 1973లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట చేరారు. కరీంనగర్ పట్టణంలోని ఓ హోటల్ ఇందుకు వేదికైంది. జీవితంలో ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు.. ఇలా ఒక్కో రంగంలో స్థిరపడిన 30 మంది 50 ఏళ్లకు తమ చిన్ననాటి మిత్రులను కలుసుకున్నారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని, మురిసిపోయారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నలుమాచు మనోహర్, రాజిరెడ్డి, నర్సింహం, సుభాష్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'క్రిటికల్ కేర్' వేగవంతం

- చురుగ్గా సాగుతున్న భవన నిర్మాణ పనులు
- క్షతగాత్రులకు వరంగా మారనున్న ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి



ఆస్పత్రి స్థలంలో నిర్మాణంలోని క్రిటికల్ కేర్ భవనం

కరీంనగర్‌టౌన్: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను.. పలు సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నం చేస్తున్నవారిని కాపాడేందుకు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ వైద్యసేవలు అందించాలని నిర్ణయించారు. సంబంధిత భవన నిర్మాణ పనులకు ఈ ఏడాది మార్చి 8న అప్పటి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు. రూ.2.3 కోట్లతో పనులు వేగంగా సాగుతున్నాయి. మరో 6 నెలల్లో పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నారు. ఆస్పత్రిలో ఇప్పటికే మెడికల్ కళాశాల ప్రారంభం కాగా, క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పూర్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న కరీంనగర్ దవాఖానా ప్రమాద బాధితులకు వరంగా మారనుంది.

వరంగల్, హైదరాబాద్ తరలింపు

కరీంనగర్‌కు రైల్వేలైన్‌తో పోలిస్తే హైవే రోడ్డు కనెక్టివిటీనే ఎక్కువగా ఉంది. నిత్యం వివిధ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో గాయపడి, ఆసుపత్రుల పాలవుతున్నారు. వీరే కాకుండా జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. అయితే, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వైద్యం అందించేందుకు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగం లేదు. దీంతో పేషెంట్లను వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయం తర్వాత ఆయా దవాఖానాలకు చేరాలంటే గంటలకొద్దీ సమయం పడుతోంది. దీంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రజల డిమాండ్‌తో..

రోడ్డు ప్రమాదాల బాధితులను కాపాడేందుకు కరీంనగర్‌లో ఒక క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి పెరిగింది. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గతంలో మంత్రిగా ఉండి, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరడంతో 50 పడకలతో సకల సౌకర్యాలతో భవనం నిర్మించేందుకు అనుమతి ఇచ్చింది. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆవరణలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం వెనక భాగంలో శంకుస్థాపన చేశారు. క్రిటికల్ కేర్ విభాగ భవన నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వస్తే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ఇక్కడే అందుతుంది.

పాలనలో మార్పు చూపిస్తాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజలు మార్పు కోరుకొని, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, తాము పాలనలో మార్పు చూపిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తుంచుకుంటామని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆదివారం తొలిసారి మంథనికి వెళ్తూ మార్గమధ్యలో కరీంనగర్‌కు చేరుకున్న ఆయనకు పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ లక్ష్యాలు, ఏ ఆశయాల కోసం తెలంగాణ సాధించుకున్నామో వాటిని బీఆర్ఎస్ విస్మరించిందని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని గద్దెదించారన్నారు. పీసీసీ నాయకుడు వైద్యుల అంజన్‌కుమార్, ఎండీ.తాజ్, సమద్ నవాబ్, కమ్రొద్దీన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'దీర్ఘకాలిక సేవలు అభినందనీయం'



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీపీసీఏ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి, ప్రత్యేక ఆహ్వానితుడిగా రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి వివిధ శాఖల్లో దీర్ఘకాలిక సేవలందించడం అభినందనీయమన్నారు. పెన్షనర్స్ డే ఆవశ్యకతను నర్సయ్య వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు త్వరలోనే వస్తాయని పేర్కొన్నారు. అనంతరం 60 మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, ఆదిరెడ్డి, లక్ష్మీరాజం, నరసింహాచారి, మోహన్ రెడ్డి, కృష్ణమూర్తి, సత్తయ్య, మక్సూద్, లక్ష్మి, జాయింట్ సెక్రటరీలు ఎల్లయ్య, పద్మారావు, రాజయ్య, కుమారస్వామి, సయ్యద్ ఇస్మాయిల్, సుధాకర్, అంజయ్య, నాగేంద్రమ్మ, జిల్లా కోశాధికారి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఫైల్ తొక్కి పెట్టిందెవరు?

- చార్జెస్ ఫ్రేమ్ విషయంలో గత ఉన్నతాధికారిపై ఆరోపణలు

కరీంనగర్ కార్పొరేషన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారులు కమిషనర్లుగా పదోన్నతి పొందిన వ్యవహారం ఓ ఉన్నతాధికారి మెడకు చుట్టుకునే అవకాశం కనిపిస్తోంది. సదరు అధికారులపై చార్జెస్ ఫ్రేమ్ అయి ఉన్నా ఆ ఫైల్‌ను తొక్కి పెట్టి, దొడ్డిదారిన పదోన్నతి వచ్చేట్లు చేయడంలో గతంలో కరీంనగర్‌లో పనిచేసి, వెళ్లిన ఓ ఉన్నతాధికారి పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి. 'ఆరోపణలున్నా అందలం' పేరిట 'సాక్షి'లో కథనం ప్రచురితమవడంతో విచారణ చేపట్టాలంటూ నగరపాలక సంస్థ కమిషనర్ సీడీఎంఏను కోరిన విషయం విదితమే. రెండున్నరేళ్ల కిందటి ఈ వ్యవహారం ఇప్పటివరకు ఎందుకు వెలుగు చూడలేదు? ఆన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ (ఏసీఆర్)లో తప్పుడు సమాచారాన్ని ఎవరు సీడీఎంఏకు పంపించారన్న అంశాలు ప్రస్తుతం తెరపైకి వస్తున్నాయి.

అప్పట్లో ఆదేశించినా లేఖ రాయలే

2021లో నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న అధికారి, అకౌంటెంట్‌లపై ఆరోపణలు రావడం, అప్పటి కమిషనర్ ఇరువురిపై చార్జెస్ ఫ్రేమ్ చేయడం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ సీడీఎంఏకు నివేదించాలని అప్పటి కలెక్టర్ నగరపాలక సంస్థను ఆదేశించారు. కానీ ఈ విషయమై నగరపాలక సంస్థ సీడీఎంఏకు ఎలాంటి లేఖ రాయలేదు. దీంతో విచారణ అంశం అటకెక్కింది. అటు చార్జెస్ ఫ్రేమ్ ఫైల్‌ను, ఇటు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తొక్కి పెట్టి, అడ్డదారిలో ఇద్దరు అధికారులకు లబ్ధి చేకూరేలా చేయడంలో గతంలో పని చేసిన ఓ ఉన్నతాధికారి కీలకంగా వ్యవహరించారన్న ప్రచారం జరుగుతోంది. ఉద్యోగి పదోన్నతికి ముందు సీడీఎంఏకు పంపించే ఏసీఆర్‌లోనూ చార్జెస్ ఫ్రేమ్ అంశాన్ని పొందుపరచకుండా, క్లీన్ ఇమేజ్‌తో పంపించడంలోనూ ఆ ఉన్నతాధికారిదే కీలక పాత్ర అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏసీఆర్‌ను స్వయంగా ఉద్యోగి పూర్తి చేసినప్పటికీ, సంబంధిత ఉన్నతాధికారే సీడీఎంఏకు పంపించాల్సి ఉంటుంది. అన్నీ తెలిసి, సదరు అధికారులతో కుమ్మక్కవడం వల్లే తప్పుడు సమాచారాన్ని పంపించారన్న ఆరోపణలున్నాయి. నగరపాలక సంస్థ కోరిన మేరకు సీడీఎంఏ ఒకవేళ విచారణకు ఆదేశిస్తే నిజాలు వెల్లడి కానున్నాయి.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

- కేసీఆర్, బీఆర్ఎస్‌లపై ఎంపీవి మతిభ్రమించిన మాటలు
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు


కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, అసహనంతో కేసీఆర్, బీఆర్ఎస్‌లపై మతిభ్రమించి మాట్లాడుతున్నారని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడం, యువతను రెచ్చగొట్టడం ఎంపీ నైజమని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు చేయడం కాదని.. వాటిని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేకుంటే క్షమాపణ చెప్పి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రూపాయి లేదని చెప్పి, గెలిచి, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రూ.50 కోట్లు ఎలా ఖర్చు పెట్టారని ప్రశ్నించారు. మున్సిపల్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై చేసిన అవినీతి ఆరోపణలను ఖండించారు. ఎంపీగా గెలిచాక బండి సంజయ్ ఈ ఐదేళ్లలో ఏనాడూ ప్రజల మధ్యలో లేరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది ప్రజాప్రతినిధులను కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రలోభాలకు లొంగనివారిపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ల నాయకత్వంలో కరీంనగర్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఎంపీ చేసిందేమిటో చెప్పాలన్నారు. కార్పొరేటర్లు గంట కల్యాణి, ఐలేందర్ యాదవ్, గందె మాధవి, సల్ల శారద, కోల మాలతి, కుర్ర తిరుపతి, వంగల శ్రీదేవి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలే 'బండి'ని సీజ్ చేశారు

ఎంపీ బండి సంజయ్ అర్థం లేని మాటలు మానుకోవాలని, ఎమ్మెల్యేగా ఓటమి చెందాననే నిరాశలో కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతల పాస్‌పోర్టులు సీజ్ చేయాలని మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో ముందు నిలిపారన్నారు. ఐదేళ్లలో ఎంపీగా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం తెచ్చిన నిధుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల పాస్‌పోర్టులు సీజ్ చేయాలని మాట్లాడుతున్న బండి సంజయ్‌ని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే సీజ్ చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేయకుండా బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసి, మాట్లాడటం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు.

అవినీతికి కేరాఫ్‌గా నగరపాలక సంస్థ

- బీఆర్ఎస్ నేతలపై ఏసీబీకి ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ అవినీతికి కేరాఫ్‌గా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా తామే అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ ప్రతీచోట అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. నగరపాలక సంస్థ నుంచి అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న ప్రజలను మేయర్ తన ప్రైవేటు సైన్యంతో భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేరు చెప్పి, అపార్ట్‌మెంట్ల నిర్మాణం నుంచి శ్మశానవాటికల వరకు.. బడా కంపెనీల నుంచి చిరు వ్యాపారుల వరకు ఇలా ఎవరినీ వదలడం లేదని మండిపడ్డారు. ఈ దోపిడీని అడ్డుకునేందుకే 89 వేల పైచిలుకు ఓటర్లు ఎంపీ బండి సంజయ్‌ను తమ ప్రతినిధిగా ఎన్నుకోవడానికి సాహసోపేతంగా ఓటేశారని తెలిపారు. కోట్లాది రూపాయల నిధులు ఇవ్వమని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14 రోజులకే చేయి చాపుతున్న మేయర్ పరిస్థితి చూస్తుంటే దేహీ అని అడుక్కుంటున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఇక్కడి అక్రమాలపై విజిలెన్స్‌కు.. అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయదుందుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, దురిశెట్టి అనూప్‌కుమార్, నాయకులు బండ రమణారెడ్డి, బంగారు రాజేంద్రప్రసాద్, శివరామకృష్ణయ్య, రాపర్తి ప్రసాద్, కటకం లోకేశ్, ఎన్నం ప్రకాశ్, గాజే రమేశ్, నాగసముద్రం ప్రవీణ్, సుధాకర్ పటేల్, అవుదుర్తి శ్రీనివాస్, పురం హరి, వాసు పాల్గొన్నారు.

టీచర్లకు గుదిబండలా 'టెట్'

- సీనియర్ ఉపాధ్యాయులు పదోన్నతులకు దూరమయ్యే అవకాశం
- ఎన్‌సీటీఈ ఉత్తర్వులతో ఆందోళన
- బదిలీ చేసిన చోటుకు వెళ్లని చాలామంది ఎస్‌ఏలు
- జిల్లాలో 2,800 మంది టీచర్లు



కరీంనగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) సీనియర్ ఉపాధ్యాయులకు గుదిబండలా మారింది. ఇందులో ఉత్తీర్ణులైన వారే పదోన్నతికి అర్హులని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) ఉత్తర్వులు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 2010 తర్వాత నియామకమైన జూనియర్ టీచర్లకు లబ్ధి చేకూరనుండగా ఏళ్లుగా పని చేస్తున్న సీనియర్లు పదోన్నతులకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. పదోన్నతుల ప్రక్రియ అక్టోబర్ నెలలో హైకోర్టు తీర్పు వల్ల నిలిచిపోగా.. ఇప్పుడు మరో వివాదం తెరపైకి రావడంతో ఎంతోకాలంగా పదోన్నతుల కోసం వేచిచూస్తున్న వారిలో గుబులు నెలకొంది. ఇప్పటికే ఎస్జీటీల బదిలీలు నిలిచిపోయిన విషయం విదితమే. వాస్తవానికి మొదట పీజీ హెచ్‌ఎంల బదిలీలు జరిగాయి. తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. అనంతరం స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తయ్యాయి. పదోన్నతులు లేకపోవడంతో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ల స్థానంలో రిలీవర్ లేక చాలా మంది ఇదివరకు పని చేస్తున్న పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 2,800 మంది ప్రభుత్వ టీచర్లు ఉన్నారు.

45 ఏళ్ల వయసు నిబంధనతో అయోమయం

పదోన్నతులు లేకుండా, ఆర్థిక ప్రయోజనం పొందకుండానే ఉద్యోగ విరమణకు దగ్గరవుతున్న టీచర్లు ఇదేం పాపమంటూ నిట్టూరుస్తున్నారు. జూనియర్ల కళ్లెదుటే టెట్ అర్హతతో పదోన్నతులు పొందే అవకాశాలు ఏర్పడుతుంటే తమ గోడు పట్టించుకునేదెవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌సీటీఈ గైడ్‌లైన్స్ ప్రకారం టెట్ అర్హత పరీక్ష తప్పనిసరి చేయడం, 45 ఏళ్ల వయసు నిబంధన విధించడంతో వయసు పైబడిన ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. ఇదివరకు పదోన్నతుల జాబితాలో 1989 నుంచి 2002 డీఎస్సీ వరకు నియమితులైనవారే అత్యధికులు ఉండగా.. ఇప్పుడు ఎన్‌సీటీఈ ఉత్తర్వులతో జాబితా పూర్తిగా మారిపోనుంది. ఇందులో 2012 నుంచి 2017 వరకు నిర్వహించిన డీఎస్సీల్లో నియమితులైన వారికే చోటు దక్కనుంది.

కోర్టుకు వెళ్లడంతో ఆగిపోయిన పదోన్నతులు

టెట్ అర్హత లేని వారికి పదోన్నతులు ఎలా ఇస్తారని కొందరు కోర్టుకు వెళ్లడంతో అప్పట్లో ఎస్జీటీల పదోన్నతులు ఆగిపోయాయి. దీనికి కారణం ప్రభుత్వ తప్పిదాలేనని చెప్పవచ్చు. ఎందుకంటే సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ అవసరం లేదని పేర్కొనడంతో చాలా మంది పరీక్ష రాయలేదు. ఇప్పుడు ఎన్‌సీటీఈ ఉత్తర్వులు టెట్ అర్హత కలిగిన వారికి మేలు చేస్తుండటంతో.. ఆ అర్హత లేనివారు తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సానుకూలంగా పరిశీలించాలని, 12 ఏళ్లకు పైగా ఒకేచోట పని చేస్తున్నవారికి స్థానచలనం కల్పించేలా చొరవ చూపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. వేలాది మంది టీచర్లు కొన్నేళ్లుగా ప్రమోషన్లు, బదిలీల కోసం వేచిచూస్తున్నారు. పదోన్నతులకు టెట్ తప్పనిసరి అంటూ తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలి.

– కట్టా రవీంద్రాచారి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

చాలామంది నష్టపోతారు



టెట్ ఉంటేనే పదోన్నతి అంటే చాలా మంది సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతారు. మూడేళ్లు లేదా ఐదేళ్ల షరతు విధించి, అర్హులకు పదోన్నతి ఇవ్వాలి. బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేసి, కొత్త వారికి పదోన్నతి కల్పించి, ఎస్జీటీల బదిలీలు చేపట్టాలి.

– పోరెడ్డి, దామోదర్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

- వారబందీ విధానం అమలు
- జిల్లాకు ఈ నెల 25, 26వ తేదీల్లో మొదటి తడి

కరీంనగర్‌రూరల్: ఉత్తర తెలంగాణ జిల్లాలకు వరప్రదాయిని ఎస్సారెస్పీ. ఈ ప్రాజెక్టు నీటిని యాసంగి పంటల సాగు కోసం అధికారులు సోమవారం నుంచి విడుదల చేయనున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టుకు నీరందించాలని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇంజినీర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1,081 అడుగులు కాగా, ప్రస్తుతం 1,088.60 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 78.342 టీఎంసీలు ఉంది. యాసంగి పంటలకు 60 టీఎంసీల నీటిని అందించనున్నారు. ఎస్సారెస్పీ నీటి విడుదలతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది. ప్రధానంగా వరి, మొక్కజొన్న సాగు పెరగనుంది. అయితే, కాలువల లైనింగ్, తూములు శిథిలావస్థకు చేరడం, కాలువల్లో పేరుకుపోయిన పూడిక కారణంగా నీరు ఆయకట్టు చివరకు అందుతుందా అన్న అనుమానం కలుగుతోంది. గతంలో నీరందక పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

ఆయకట్టు కింద 4,42,920 ఎకరాలకు..

ఎస్సారెస్పీ స్టేజ్–1 పరిధిలో కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్(ఎగువ మానేరు ఆయకట్టు కింద) జిల్లాల్లోని 4,42,920 ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. వారబందీ విధానంలో 8 రోజులు నీటి సరఫరా, 7 రోజులు నిలిపివేత పద్ధతిలో నీరందిస్తారు.



ఈ మేరకు ఈ నెలాఖరులో ఒక నీటి తడి, వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండేసి తడుల చొప్పున మొత్తం ఏడు తడులను యాసంగి పంటలకు అందించనున్నారు. మార్చి నెలాఖరుతో నీటి విడుదల ముగుస్తుంది.

చివరి భూములకు అందేలా చర్యలు

యాసంగి పంటల సాగుకు నీరందించాలని ఇంజినీర్ల కమిటీ నిర్ణయించింది. కరీంనగర్ జిల్లాకు ఈ నెల 25, 26వ తేదీల్లో మొదటి నీటి తడి అందుతుంది. ఆయకట్టు చివరి భూములకు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సంతోష్, డీఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

అప్పు తీర్చాలని అంత్యక్రియల అడ్డగింత

మెట్‌పల్లి:అప్పు చేసి ఉడాయించిన ఓ వ్యక్తి.. తండ్రి అంత్యక్రియల కోసం రాగా ఆ తంతును అడ్డుకున్న సంఘటన ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసే చైతన్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కొంతకాలం క్రితం దివాళాపేరుతో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ఉడాయించాడు. పలువురి బాధితులకు సుమారు రూ.కోటికి పైగానే చెల్లించాల్సి ఉన్న ఆయన.. కొన్ని నెలల క్రితం తల్లి మరణించడంతో ఇంటికొచ్చాడు. ఆ సమయంలో తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు పట్టుబట్టారు. తొందరలోనే చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో ఆ సమయంలో వదిలిపెట్టారు. ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ అతని నుంచి స్పందన లేకుండా పోయింది. శనివారం ఆయన తండ్రి చనిపోవడంతో ఆయన అంత్యక్రియల కోసం సదరు వ్యక్తి మళ్లీ ఇక్కడకు వచ్చాడు. దీంతో బాధితులంతా వెళ్లి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బులు ఇచ్చేవరకూ అంత్యక్రియలు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని అతనితోపాటు మిగతా కుటుంబ సభ్యులతో బాధితులకు రాత పూర్వక హామీని ఇప్పించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత అంత్యక్రియల తంతును పూర్తి చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

- 15 రోజుల క్రితం ప్రమాదం


గంగాధర్ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): పదిహేను రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రుద్రంగికి చెందిన మోతె గంగాధర్(45) శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి వస్తుండగా కథలాపూర్ మండలం సిరికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంటి వద్దే ఉంటుండగా శనివారం అర్ధరాత్రి గంగాధర్ మృతిచెందాడు. మృతుడికి భార్య జల, ఇద్దరు కుమారులు నిఖిల్(21), నితిన్(17) ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- మంచి నివేశన స్థలం రాలేదని మనస్తాపం


చికిత్స పొందుతున్న నాగరాజు

జమ్మికుంట(హుజూరాబాద్): మంచి నివేశన స్థలం రాలేదని మనస్తాపంతో జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోలుగూరి నాగరాజు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. నాగరాజు హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఇంటి స్థలం కోసం అతనికి పట్టా మంజూరైంది. కానీ అధికారులు హద్దులు చూపించలేదు. ఈ క్రమంలో సైదాబాద్‌లోని సర్వే నంబర్ 234లో ఇటీవల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అధికారుల ఆధ్వర్యంలో మరోసారి డ్రా పద్ధతిలో అర్హులకు నివేశన స్థలాలు కేటాయించారు. అయితే, తనకు వచ్చిన స్థలంలో బండ రాళ్లు, బొందలు ఉన్నాయని, ఇంటి నిర్మాణానికి అనువుగా లేదని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. స్థలం కేటాయింపులో తనకు న్యాయం చేయాలని అతను కోరుతున్నాడు.


ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

రాజన్నకు కోడెమొక్కులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దంపతులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. రాజన్నను హైదరాబాద్ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దంపతులు దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు ఉన్నారు. రాజన్న దర్శనానికి వీఐపీల సంఖ్య పెరగడంతో పీఆర్వో కార్యాలయాన్ని మూసివేశారు. దీంతో వీఐపీలంతా పీఆర్వో ఆఫీస్ ముందే వేచి చూశారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది

ప్రభుత్వవిప్‌గా నియమితులై మొదటిసారి వేములవాడకు వచ్చిన ఆది శ్రీనివాస్‌ను రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు.

మరణంలోనూ వీడని అన్నదమ్ముల అనుబంధం

- లక్కేపూర్ క్రాస్‌రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి దుర్మరణం
- కన్నీటిసంద్రమైన మృతుల కుటుంబసభ్యులు
- తల్లడిల్లిన తల్లి హృదయం.. రోదించిన మంథని


నాగరాజు (ఫైల్)


నవీన్ (ఫైల్)


రోదిస్తున్న కుటుంబసభ్యులు


అగ్గిపెట్టిన మృతుల పిల్లలు

మంథని: ఆ కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు.. అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మలివయసులో అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారు హఠాత్తుగా చనిపోవడంతో ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఈ విషాద సంఘటన మంథనిలో విషాదం నింపింది. పుట్టినప్పుంచి ఎంతో ఆప్యాయంగా పెరిగి వారి బంధాలు.. మరణంలోనూ ఒకటిగా కలిసేపోవడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్సై కిరణ్ కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి నాగరాజు(42), ఆయన సోదరుడు నవీన్(35) రామగిరి మండలం బేగంపేటకు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం వెళ్తున్నారు. అయితే, లక్కేపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా, అతివేగం వచ్చిన ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన అక్కేపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. అన్నదమ్ములను ఢీకొట్టిన ట్రాక్టర్ సమీపంలోని ప్లాట్ల వద్ద అదుపుతప్పి పడిపోయినట్లు సమాచారం. ప్లాట్లలో మట్టి పడి ఉంది. ట్రాక్టర్ బోల్తాపడిన ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. ట్రాక్టర్‌ను సరిచేసుకొని డ్రైవర్ అక్కడి పారిపోయినట్లు భావిస్తున్నారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన నాగరాజుకు భార్య, కూతురు(12) ఉన్నారు. అలాగే నవీన్‌కు భార్య, సంవత్సరం, మూడేళ్ల కుమారులు ఉన్నారు. మృతులిద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కదిలించిన హృదయాలు

మంథని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి రాధ–బాపు దంపతులకు నలుగురు కుమారులు. అనారోగ్యంతో బాపు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్తను కోల్పోయిన రాధ.. దుఃఖాన్ని కడుపులోనే దాచుకుని తన కుమారులను చూసుకుంటోంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లుగా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మరో కుమారుడు అమాయకుడు కావడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. కాగా, నాగరాజుకు కుమారుడు లేడు. దీంతో కూతురుతో చితికి నిప్పంటించారు. అలాగే నవీన్ పెద్దకుమారుడు(3)తో చితికి నిప్పు పెట్టించడంతో అక్కడున్నవారుకన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే అన్నదమ్ములు ఒకేరోజు ప్రమాదంలో మృతి చెందడం విషాదం నింపింది.

కొండగట్టులో చందన పూజ


కొండగట్టు ఆలయం


శ్రీఆంజనేయస్వామి విగ్రహం

కొండగట్టు(చొప్పదండి):ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో త్వరలో చందనోత్సవ పూజకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈవో వెంకటేష్ తెలిపారు. వారంలో రెండురోజులపాటు పూజ నిర్వహిస్తారు. స్వామివారికి ప్రతి మంగళ, శనివారాల్లో చందనంతో అర్చకులు ఉదయమే అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఒక్కరోజు ముందుగా ఆలయ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. పూజ టికెట్ ధర సుమారుగా రూ.800 వరకు ఉండనుందని సమాచారం. టికెట్ తీసుకున్న మరుసటి రోజు ఉదయాన్నే భక్తుల పేరు, గోత్రానామాలు చదివి భక్తులకు చందనం (సింధూరం)తో పాటు ప్రసాదం అందజేస్తారు. ఇలా స్వామి వారికి చందనోత్సవం చేయించడం ద్వారా గ్రహపీడలు తొలగడం, చిన్న పిల్లలు అల్లరి మానడం, వ్యాపార అభివృద్ధి, అనుకున్న పనులు పూర్తవడం, చేపట్టిన కార్యాలు దిగ్విజయం అవుతాయని అర్చకులు చెబుతున్నారు. శ్రీరాముడికి ఇష్టమైన చందనం ఆంజనేయస్వామి వారికి నిత్యం అభిషేకం చేయడం ద్వారా ఆయన సంతోషంగా ఉండి కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం

స్వామివారికి ఇష్టం



చందనం అంటే శ్రీరాముడికి ఇష్టం. అందుకే కొండగట్టులో చందన పూజ నిర్వహించాలని నిర్ణయించారు. పూజ చేయడం ద్వారా భక్తులకు నరగోష ఉండదు. కష్టాలు దరిచేరవు. కోరికలు నెరవేరుతాయి.

– జితేంద్రప్రసాద్ స్వామి, కొండగట్టు ఆలయ ప్రధాన అర్చకులు

త్వరలో ప్రారంభం



దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు కొండగట్టు ఆలయంలో త్వరలోనే చందన పూజ ప్రారంభిస్తాం. టికెట్ ధరగా రూ.800 వరకు ఉండే అవకాశం ఉంది. చందనపూజలో పాల్గొనే భక్తులు ఒక్కరోజు ముందుగానే ఆలయ అధికారులను సంప్రదించాలి.

– వెంకటేశ్, ఈవో

ఉచిత ఇళ్ల స్థలాల ప్రచారం అవాస్తవం

- భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్

గన్నేరువరం: జగిత్యాల జిల్లా రాజారం శివారులో ఇళ్ల స్థలాలను ఉచితంగా ఇస్తున్నారన్న ప్రచారం అవాస్తమని, దీన్ని నమ్మి అక్కడికి వెళ్లొద్దని భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ అన్నారు. ఆదివారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 58 ప్రకారం ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలంలో అప్పటికే నివాసం ఉంటున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలు మాత్రమే ఇంటి స్థలం పొందేందుకు అర్హులని తెలిపారు. స్థిర నివాసాలు లేక, సెంటు భూమి కూడా లేని స్థానికులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయిస్తారని పేర్కొన్నారు. గన్నేరువరం మండలం కరీంనగర్ జిల్లా ప్రాంతమని, జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ భూములను స్థానికేతరులకు ఇచ్చే అవకాశం లేదన్నారు. అవాస్తవ ప్రచారాన్ని నమ్మి ప్రజలు తమ విలువైన సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.

అదనపు పనులు కొనసాగేనా?

- ఎన్నికలతో నెల క్రితమే ఆగిపోయిన వైనం
- బిల్లులు ఆగిపోతాయన్న అనుమానంతో నిలిపివేసిన కాంట్రాక్టర్
- రెండు ప్యాకేజీలుగా కాల్వ పనులు
- కాల్వ నిర్మాణంలో 600 ఎకరాలు ముంపు

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ వరదకాల్వ పనులు మరోసారి నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బిల్లులు వస్తాయో.. రావోనని కాంట్రాక్టర్ ముందస్తుగానే పనులు నిలిపివేశాడు. నెల క్రితం ఆగిపోయిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై నిర్ణయం ఎలా ఉంటుందోననే అనుమానంతో పనులు మళ్లీ మొదలు పెట్టలేదని తెలిసింది.

23 కిలోమీటర్ల మేర వరద కాల్వ

కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరద కాల్వ చేస్తున్నారు.

- ఈ కాల్వ నిర్మాణంలో మూడు మండలాల రైతుల భూములు సుమారు 600 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొంతమంది రైతులకు పరిహారం డబ్బులు రాగా, మరికొందరికి రావాల్సి ఉంది.
- ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు.
- రామడుగు మండలం శ్రీరాములపల్లి 99 కి.మీ నుంచి 113 కి.మీ వరకు ఒక ప్యాకేజీ, 113 కి.మీ నుంచి 122 కి.మీ వరకు రెండో ప్యాకేజీగా నిర్ణయించారు.
- దాదాపు 120 నుంచి 160 మీటర్ల వెడల్పుతో పాత వరదకాల్వను ఆనుకునే ఎడమ వైపు ఈ పనులు చేస్తున్నారు.
- ఇప్పుడు ఉన్న వరదకాల్వలో సుమారు రెండు టీఎంసీల మేర నీరు నిల్వ ఉంటుంది. అదనంగా మరో టీఎంసీ నీటి నిల్వ కోసం కొత్త కాల్వ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు.

పనులు ఇలా..

అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణం : 23 కిలోమీటర్లు

కాల్వ వెడల్పు : 120 మీటర్ల నుంచి 160 మీటర్ల వరకు

కాల్వ విస్తరించి ఉన్న మండలాలు : రామడుగు, గంగాధర, బోయినపల్లి

పనులు జరిగినవి : సుమారు యాభై శాతం

యాభై శాతం పూర్తి

అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణం పనులు సుమారు 23 కిలోమీటర్ల మేర చేపట్టాలి. రెండు కిలో మీటర్లు తప్ప మిగతా అన్ని చోట్ల పనులు ప్రారంభమైనట్లు తెలిసింది. వరదకాల్వ లోతు సుమారు 34 మీటర్లు, వెడల్పు సుమారు 80 నుంచి వందకుపైగా మీటర్ల మేర ఉంటుంది. పలు ప్రాంతాల్లో సుమారు యాభై శాతం మేర పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ల ద్వారా తెలిసింది. బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో ముంపు ఇళ్ల ప్రాంతం, బీటీ రోడ్డు ఏరియాలో పనులు మొదలుకాలేదు. కొన్ని చోట్ల ఇంకా భూసేకరణ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు.


దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో వరద కాల్వ నిర్మాణం

బిల్లులపై అనుమానంతోనే ఆగిన పనులు ?

రాష్ట్ర ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో.. రావోనని అనుమానంతో కాంట్రాక్టర్ పనులు నిలపివేసినట్లు సమాచారం. ఇప్పటికే పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా పనులు చేస్తే ఏమవుతుందోననే భయంతో పనులు పొందిన ఏజెన్సీ కాంట్రాక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. కాగా కొన్ని బిల్లులు పెండింగ్ ఉండడంతోనే పనులు ఆగాయని ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు.

ఇద్దరు యువకుల అరెస్ట్


పట్టుబడిన యువకులతో పోలీసులు

మెట్‌పల్లి: వేర్వేరు దొంగతనం కేసుల్లో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కోరుట్లకు చెందిన యువకులు తెన్నేరు శ్రీకాంత్, చంద్రగిరి పద్మాకర్ బైక్‌పై అక్కడకు వచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని సోదా చేయగా.. వారి వద్ద కరిగించిన బంగారం దొరికింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఈనెల 3న కళానగర్‌లో వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించినట్లు, జగిత్యాల పట్టణంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి ద్విచక్రవాహనం, రూ.80వేలు, 25గ్రాముల బంగారాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌నగర్ (పాత కోర్టు) సమీపంలో నివాసముండే సామ చంద్రశేఖర్(38) ఆదివారం ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలం క్రితం చంద్రశేఖర్‌కు వివాహమైంది. ఆ తర్వాత భార్యతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి మద్యానికి బానిసైన చంద్రశేఖర్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరిపోసుకొన్నాడని ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఒకరి మృతి


రాంసమ్మయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలం లోని పాతర్లపల్లికి చెందిన రాంసమ్మయ్య (53) మందమర్రిలోని కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. డౌన్ లూప్ లైన్‌లో ఆగి ఉన్న పీఎస్ఎన్‌హెచ్ గూడ్స్ రైలు కింద దూరి, 3వ ప్లాట్‌ఫాం పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మూసివేసిన బోరుబావిలో పడి మహిళకు తీవ్ర గాయాలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిరలో ఓ పొలంలో మూసివేసిన బోరుబావిలో కాలు పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని గర్జనపల్లికి చెందిన గుంటుకు దేవేంద్ర అడవిపదిరలో నాటు వేసేందుకు వెళ్లింది. పొలాన్ని నాటుకు సిద్ధం చేస్తుండగా ట్రాక్టర్ కేజ్‌వీల్ పొలంలోని కేసింగ్‌పైన ఉన్న బండరాయికి తగలడంతో అది తొలగిపోయింది. గమనించకుండా నాటువేస్తున్న దేవేంద్ర కాలు బోరులో పడి ఇరుక్కుంది. తీవ్రంగా గాయపడ్డ దేవేంద్రను వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

‘అల్ఫోర్స్’లో మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్


పరీక్షను పర్యవేక్షిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు స్పందన లభించింది. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పించి, ప్రశ్నాపత్రం విడుదల చేశారు. రాష్ట్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు 12,600 మంది హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 22న జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. రామానుజన్ సేవలు స్ఫూర్తిదాయకమవి, చిన్న వయసులోనే గణిత శాస్త్రంపై పట్టు సాధించి, అనతికాలంలోనే అద్భుతాలు సృష్టించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): భూ వివాదంలో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌కు చెందిన రాచపల్లి కుమార్, అతని సోదరులు శంకర్, సతీశ్, మహేందర్‌లకు మధ్య భూ వివాదం ఉంది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆ ముగ్గురూ కుమార్, అతని భార్య కవిత ఆదివారం పొలంలో పని చేస్తుండగా వెళ్లి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితులకు తీవ్ర గాయాలయ్యాయి. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో చలికి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న ఇటుకబట్టీ కార్మికులకు ఆదివారం భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. జీవనోపాధి కోసం వచ్చిన కార్మికులు చలికాలంలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు దుప్పట్లు అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అల్లాడి విజయరాజు, నాగరాజు, అనిల్, మనోజ్, వేణుగోపాల్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడిమెట్ల రాగాల పురస్కారం



పవన్‌కు సన్మానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నడిమెట్ల రాగాల పురస్కారం–2023 ప్రధాన సభను నిర్వహించారు. ప్రజాకవి, గాయకులైన పురస్కార ప్రదాత నడిమెట్ల రామయ్య పురస్కారాన్ని కవి, గాయకుడు రావుల పవన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచ్ బోగోండ లక్ష్మిఐలయ్య, కవులు గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, సీవీ కుమార్, శంకరయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ఇప్పించండి



బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేసిన జాడి బాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు తనకు టికెట్ ఇప్పించాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి కోరారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తాను కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేశానని, ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ తరఫున ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు నిర్వహించానని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటులో నేతకాని కులానికి చెందిన సుమారు రెండున్నర లక్షల పైచిలుకు ఓట్లు కలిగి ఉన్నారని, దీంతో పాటు ప్రధాని నరేంద్ర అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు పేదవారందరికీ కిందిస్థాయిలో అందుతున్నాయని, ఇవన్నీ తనకు అనుకూలిస్తాయన్నారు. మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, నేతకాని సంఘం సలహాదారు గోల కిష్టయ్య, ఎస్సీ ఉప కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర లక్ష్మణ్, నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు గంగరాజు, ఎం.లక్ష్మి లక్ష్మీరాజం, నాయకుడు ప్రసాదరావు, బీజేవైఎం పశ్చిమ జోన్ అధ్యక్షుడు పొన్నాల రాము, బండారి శివశంకర్, రాములు తదితరులున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



మాట్లాడుతున్న కుమారస్వామి

శంకరపట్నం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే మహనీయుల ఆదర్శాలను అలవర్చుకొని నేటిబాలలు రేపటి పౌరులుగా ఎదగాలని పేబ్యాక్ టు స్వచ్ఛంద ససంస్థ కన్వీనర్ గాలిపల్లి కుమారస్వామి అన్నారు. మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగటానికి సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిసాయం అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులను సంస్థ ద్వారా ఆదుకుంటామన్నారు. విద్యార్థులకు రాతపరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులలో కొందరికి దుస్తులు, బహుమతులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శంకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి ఆలయ వార్షికోత్సవం



విశేషాలంకరణలో లలితాదేవి అమ్మవారు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని అశోక్‌నగర్ మలయాళ సద్గురు గీతా మందిర సన్యాస మఠంలో లలితాదేవి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామి పర్యవేక్షణలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ జరిగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు విష్ణుమూర్తి, రంజిత్, సత్యనారాయణ, వేణుమాధవ్, దశరథం, లక్ష్మీనారాయణ, శారద, పద్మ, మణెమ్మ, రాధ, భక్తులు పాల్గొన్నారు.



లలితాదేవికి పూజలు చేస్తున్న విష్ణుసేవానందగిరిస్వామి

మంత్రి శ్రీధర్‌బాబుకు గజమాలతో సత్కారం



శ్రీధర్‌బాబును గజమాలతో సత్కరిస్తున్న అనిల్‌కుమార్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తొలిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా స్థానిక అలుగునూరు చౌరస్తా వద్ద అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడాకారుడు గట్టు అనిల్‌కుమార్‌గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. చౌరస్తా వద్ద భారీ క్రేన్‌ను ఏర్పాటు చేసి పెద్దఎత్తున గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట క్రీడాకారులు తదితరులున్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం

- నగరాన్ని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు
- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్‌ల సహకారంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని 38వ డివిజన్ శ్రీహరినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కచ్చు రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు నగర అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇక్కడ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ పాలకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్లముందే కనిపిస్తోందన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరమంతా సీసీ కెమెరాలు, వాటి పర్యవేక్షణకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, అన్ని కాలనీలకు చెందినవారు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



కెమెరాలు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం

శ్రీహరినగర్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిర్యాల అనిల్‌రావు, ఉపాధ్యక్షుడిగా మునుగొండ వీరేశం, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా నాంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కూర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా అనిల్‌యాదవ్, శేఖర్‌రావు, సాగర్‌రావు ఎన్నికయ్యారు.

బండరాళ్లు మీద పడటంతో దెబ్బతిన్న కారు

శంకరపట్నం: తాడికల్ శివారులో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం బండరాయిని తొలగించేందుకు బ్లాస్టింగ్ చేశారు. ఈక్రమంలో రహదారిపై వెళ్తున్న కారుపై బండరాళ్లు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతింది. బ్లాస్టింగ్ చేపట్టే కాంట్రాక్టర్ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టలేదని వాహనదారులు ఆరోపించారు. ఈవిషయమై కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డిని వివరణ కోరగా కారు స్వల్పంగా దెబ్బతిందని, వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా శరత్

జమ్మికుంట: పట్టణంలో వాసవి క్లబ్ కమిటీ సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా శరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ సీనియర్ సభ్యులు మాట్లాడారు. పట్టణంలో 2017లో 40 మంది సభ్యులతో ప్రారంభమై 270 మందికి చేరుకొని విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రూ.4లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జోనల్ చైర్మన్ సురేందర్, రీజినల్ చైర్మన్ రాజా భాస్కర్, క్లబ్ మాజీ అధ్యక్షుడు నీలకంఠం, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి సతీశ్, క్లబ్ ప్రారంభ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ట్రినిటి విద్యార్థులు

కరీంనగర్: స్థానిక లయోల కళాశాలలో ఈనెల 11, 12ల్లో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోని గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థులు జె.ప్రదీప్‌నాయక్, ఆర్.ప్రీతమ్, ఆర్.విక్రమ్, కార్తికేయ, ఎ.శ్రీరామ్ ఎంపికైనట్లు ట్రినిటి కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. ఆదివారం ట్రినిటి కళాశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను ట్రినిటి కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

సిద్దార్థలో క్రిసాలిస్

సప్తగిరికాలనీ: మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్‌లోని సిద్దార్థ విద్యాసంస్థల్లో క్రిసాలిస్–జి–20 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంతవరకు పాఠ్యాంశంలో చదువుకున్న అంశాలన్నీ విద్యార్థులు తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, కమ్యూనికేషన్స్ అభివృద్ధిపరచడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ కూడా ఒకే ఒక ప్రశ్నపై వైవిధ్యంగా ఆలోచిస్తూ వివిధ సమాధానాలను తల్లిదండ్రులకు వివరించారు. భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని, క్లీన్ ఇండియా–గ్రీన్ ఇండియా, వివిధ సంస్కృతులు, వివిధ వేషధారణలు, వైవిధ్య ఆహార అలవాట్లు, యోగా ఉపయోగాలు, వివిధ భారతీయ పండుగలు, వివిధ భాషాలు మొదలైన అన్ని అంశాలను సిద్దార్థ వేదికగా విద్యార్థులు ప్రదర్శించిన తీరు తల్లిదండ్రులను ఆకట్టుకుంది. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు విద్యను ఎలా నేర్చుకోవచ్చో అవగతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

క్రిస్మస్ వేడుకలు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ అధ్యక్ష మండలం జ్యోతినగర్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్ ఆదివారం నిర్వహించారు. ఆరు చర్చిలు కలిసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించాయి. స్తుతి గీతాలు, కోలాటం, నాట్యం చేశారు. ఈ కార్యక్రమంలో దైవ సందేశాన్ని అందించిన మోడరేటర్ ద రైట్ రెవరెండ్ డాక్టర్ ప్రొఫెసర్ కె.రూబేన్ మార్క్, దయోసిషన్ అధికారులు, గ్రూప్ అధికారులు, ఆరు గ్రామాల పాస్టేట్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.





గొప్ప వ్యక్తులు.. రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్: రిటైర్డ్ ఉద్యోగుల మేధస్సు, సేవలను ప్రభుత్వాలు ఇప్పటికీ ఉపయోగించుకుంటున్నాయని, అంత గొప్ప వ్యక్తులు రిటైర్డ్ ఉద్యోగులని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని పెన్షనర్స్ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన పెన్షనర్ దినోత్సవ కార్యక్రమానికి మేయర్ హాజరయ్యారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులను మేయర్ సన్మానించారు. ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్‌ను పెన్షనర్లు సన్మానించారు. పై అధికారుల ఒత్తిళ్లను తట్టుకొని ఉద్యోగరీత్యా ప్రజలకు సేవలందిస్తూ కుటుంబాలను పోషించుకున్నారని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదనే విషయాన్ని ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు గమనించాలని.. మంచి మనస్తత్వంతో ప్రజలకు సేవలందించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోసం అంజయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న మేయర్

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట టోల్‌ప్లాజా, ఎల్ఎండీ, అలుగునూర్‌లో ఐటీశాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబుకు నాయకులు ఘన స్వాగతం పలికారు. టోల్‌ప్లాజా వద్ద వచ్చునూరు మాజీ సర్పంచ్ శ్రీగిరి రంగారావు ఆధ్వర్యంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా స్వాగతం పలికారు. రంగారావు, జిల్లా, మండల నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మధు, సమద్, శ్రీనివాస్, రమేశ్, సంపత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛమందిస్తున్న రంగారావు

కబడ్డీ పోటీల్లో వింధ్యావ్యాలీకి ప్రథమ స్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ పట్టణ స్థాయి ఉన్నత పాఠశాలల బాలుర కబడ్డీ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానం సాధించింది. జిల్లా వికాస తరంగిణి యువ వికాస్ ఆధ్వర్యంలో మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో బాలుర జట్టు విశేష ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టుకు మెమెంటో, బహుమతులను అందించారు. చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాష్‌రావు, వైస్ చైర్మన్ ఆర్.పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

చిత్ర కథ — వరిగడ్డి కరువు



రైతులందరూ హార్వెస్టర్లతో వరి కోతలు చేపట్టడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. హార్వెస్టర్‌తో వరి కోస్తే 60 శాతం వరకు మాత్రమే గడ్డి రాగా.. మిగతాది పొల్లుగా మారుతోంది. పాడి పశువులు, ఎద్దులున్న రైతులు పశుగ్రాసం కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు చెల్లించి వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్లలో తరలించి గడ్డిని నిల్వ చేసుకుంటున్నారు.

– కరీంనగర్‌రూరల్

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పరామర్శించారు. చిన్నముల్కనూర్‌కు చెందిన ముప్పిడి భాస్కర్‌రెడ్డి వర్ధంతికి హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ముదిమాణిక్యం గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ ఎడవెల్లి భాస్కర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంట ఎంపీపీ కొత్త వినీత, పార్టీ మండల అధ్యక్షుడు అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, సర్పంచులు వెంకటనర్సింహారెడ్డి, రవీందర్, శ్రీనివాస్, వెంకటేశం, లక్ష్మణ్, నాయకులు నారాయణరెడ్డి, రాజేశం, రాంబాబు, శ్రీనివాస్, సర్వర్‌పాషా, రైతు సమన్వయసమితి జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, జిల్లా నాయకుడు కృష్ణమాచారి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె, రాంపూర్, సింగాపూర్ గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబ సభ్యులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరామర్శించారు. వెంట మండల అధ్యక్షుడు కిరణ్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌రాహుల్, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, నాయకులు అనిల్, రామకృష్ణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజ్ కుమార్, వేణు, సదానందం, వినోద్, సంపత్, గణేశ్, పాల్గొన్నారు.

గుండిలో ఉచిత వైద్యశిబిరం

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం కరీంనగర్ సుమన్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు కళ్యాణ్‌సుమన్ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండి మానస, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాది నాగరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

రామడుగు: చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె. సత్యప్రసన్నను ఆదివారం పార్టీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, నర్సింగ్, అబ్దుల్ నబీ, సురేశ్, బాబు, పలువురు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామం అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దరిపెల్లి సురేశ్ ఎన్నికయ్యారు. నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండేటి సుధాకర్, తాళ్లపల్లి తిరులేశ్, కనకం వెంకటస్వామి, మంతెన లక్ష్మీనారాయణ, సారయ్య తదితరులు ఉన్నారు. కాగా నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభినందించారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల: ధనుర్మాసం ప్రారంభం కావడంతో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. జనవరి 14వ తేదీ వరకు ఈ తిరుప్పావై పారాయణం కొనసాగనున్నది. ఆదివారం తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభమయ్యాయి. తిరుమల పెద్దజీయర్ మఠంలో తిరుప్పావై పారాయణం ఆదివారం ప్రారంభమైంది. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొని మంగళాశాసనాలు అందించారు. శ్రీవారి ఆలయ పరిచారక కేఈ లక్ష్మీనరసింహన్ తిరుప్పావై ప్రవచనం వినిపించారు. మొదటి రోజు రెండు పాశురాలను పారాయణం చేశారు. తిరుమల ఆస్థాన మండపంలో హైదరాబాద్‌కు చెందిన వేదాంత విద్వాంసులు గోవర్ధనం స్వామినాథాచార్యులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక రూ.25లక్షల వరకు 'ఆరోగ్యశ్రీ'

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీలో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో గొప్ప మైలురాయికి శ్రీకారం చుడుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ దానిని మరింత బలోపేతం చేసే కార్యక్రమాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఇక నుంచి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమంతోపాటు సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల జారీని కూడా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభిస్తారు. అలాగే, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించడం.. దాని ద్వారా ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడికి వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలనే సందేహాలన్నింటినీ ప్రతిఇంట్లో నివృత్తిచేసే కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇక కొత్త కార్డుల పంపిణీ సందర్భంగా ప్రతీ ఇంట్లో కనీసం ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు స్వయంగా చూస్తారు.

ఓట్ల.. కేటుగాళ్లు

ఉనికి కోసం టీడీపీ సానుభూతిపరులతో బాబు బోగస్ వేషాలు

తెలంగాణలో నివాసం, ఓటు.. ఏపీలోనూ ఓటర్లుగా నమోదు

- పోలింగ్ ముగిసిన మర్నాడే హైదరాబాద్‌లో టీడీపీ నేతల మేళా
- సానుభూతిపరులతో శిబిరాలు.. ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ఫామ్ 6 దరఖాస్తులు
- ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయాలంటూ లక్షల సంఖ్యలో అప్లికేషన్లు
- ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరం
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ
- బాబు చూపిన బాటలోనే నడుస్తున్న జనసేన
- పవన్ సోదరుడు నాగేంద్రరావు, కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో ఓట్లు
- తామంతా వడ్డేశ్వరంలో నివాసం ఉంటున్నామంటూ మళ్లీ ఓటు కోసం దరఖాస్తు
- హైదరాబాద్‌లో ఓట్లున్న 4.30 లక్షల మందికి ఏపీలోనూ ఓట్లు..


Please refer to the screenshots below, being circulated on Social Media by Telugu Professional Wing belonging to Telugu Desam Party (as mentioned in the above banner photo). They have created WhatsApp groups area wise in Hyderabad, Telangana for new voter registration in AP.

New Voter Registration and Verification Drive for AP Voters

Dear Friends,

Telugu Professional Wing is organising voter registration and verification drive in below listed locations. Please use this opportunity to verify your vote and also register new vote in AP.

Telugu Professional Wing is organising voter registration and verification drive in below listed locations. Please use this opportunity to verify your vote and also register new vote in AP.

Locations - Contact person
Kukatpally - Vijay -
LB Nagar - Sailesh -

వాట్సాప్‌లో టీడీపీ పంపించిన సందేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లోనూ 2019కి మించి ఘోర పరాజయం తప్పదని నిర్ధారణకు వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓటమికి ఇప్పట్నుంచే సాకులు వెతుక్కుంటున్నారు. ఒకవైపు ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెడుతున్న ఆయన మరోవైపు నిబంధనలను కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ యథేచ్ఛగా దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17, 18 ప్రకారం దేశంలో ఒక నియోజకవర్గంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలి. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు నమోదు చేయించుకోవడం చట్ట ప్రకారం నేరం. రాజకీయాల్లో 1978 నుంచి ఉన్న చంద్రబాబుకు ఇది తెలిసినా తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. తెలంగాణలోనూ, ఏపీలోనూ రెండు చోట్లా ఓట్లు ఉన్న వారు (డూప్లికేట్లు) 4,30,264 మంది ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఏపీలోనూ సరిహద్దు నియోజకవర్గాల్లో చేర్పించారు. వాటిని తొలగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాలని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పరిశీలకులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో పోలింగ్ ముగిసిన మర్నాడే..

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న పూర్తయింది. ఆ మరుసటి రోజే అంటే డిసెంబర్ 1 నుంచే హైదరాబాద్‌లో ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా చేర్పించేందుకు ఆ పార్టీ భారీ ఎత్తున శిబిరాలు నిర్వహించింది. కూకట్‌పల్లి, నిజాంపేట, వనస్థలిపురం, మణికొండ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో శిబిరాల ఇన్‌ఛార్జ్‌లను నియమించిన టీడీపీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ సానుభూతిపరులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వయసు, చిరునామా ధ్రువీకరించే ఆధార్ కార్డును వాట్సాప్‌లో పంపితే తామే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేయిస్తామని, ఎన్నికల సంఘానికి తామే ఫారం 6 సమర్పిస్తామంటూ సందేశాలు పంపింది. టీడీపీని భుజానికెత్తుకునే మోసే ఓ సామాజిక వర్గం నాయకులు ఈ ప్రచారంలో ప్రధాన భూమిక పోషించారు. ఇలా హైదరాబాద్, తెలంగాణలో నివాసం ఉంటున్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరులను ఏపీలోని పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా చేర్చేందుకు ఫారం 6 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. ఈ ప్రక్రియను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

> ప్రజాస్వామ్యమంటే... ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం. ప్రజలే ప్రభువులు! ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమే. ఒకే ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశిస్తుంది. కేవలం ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తుంది. ఓటర్ల జాబితా ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజాతీర్పు అంత స్పష్టంగా ఉంటుంది. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రజల ఆశీస్సులతో కాకుండా.. అడ్డదారుల్లో అధికారం కోసం అర్రులు చాచే వ్యక్తిని ఏమంటారు? కేటుగాడనే కదా! ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి దొంగదారిలో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాటి నుంచి ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ 'డూప్లికేటు' వేషాలు వేస్తున్నారు!

పవన్ కుటుంబం బరి తెగింపు..

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అనే తరహాలో డూప్లికేటు ఓట్లు చేర్చడంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అదే బాట పట్టారు. ఆయన సోదరుడు కొణిదల నాగేంద్రరావుకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నెంబరు 168లో సీరియల్ నెంబరు 323 ఎఫ్‌వైవై 6038202 ఓటరు కార్డు నెంబరుతో ఓటు ఉంది. నాగేంద్రరావు సతీమణి పద్మజ కొణిదలకు సీరియల్ నెంబరు 324, వారి కుమారుడు కొణిదెల సాయివరుణ్ తేజ్‌కు సీరియల్ నెంబరు 325తో అక్కడ ఓట్లున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అంటే డిసెంబరు 4న ఏపీలోనూ ఓటు హక్కు కోసం వారు దరఖాస్తు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారంగా నగర్ మూడో వీధి 5–263 డోర్ నెంబర్ ఇంటిలో తాము నివాసం ఉంటున్నామంటూ కొణిదల నాగేంద్రరావు, పద్మజ, సాయివరుణ్ తేజ్ ఓటర్లుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తు సమర్పించడం గమనార్హం. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే జనసేనను స్థాపించిన సినీనటుడు పవన్ కళ్యాణ్ తాజాగా మరోసారి జత కట్టడం ద్వారా దీన్ని రుజువు చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబుకు బేషరతుగా మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా టీడీపీకి మేలు చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పవన్ ఇంటికి చంద్రబాబు

- లోక్‌సభ ఎన్నికల్లో జనసేనతో పొత్తు ఉండదన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఉంటుందని పలుమార్లు చెప్పిన పవన్
- కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళంలో ఇరు పార్టీలు
- దీంతో పవన్ వద్దకు వెళ్లి చర్చలు జరిపిన చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – జనసేన ఉమ్మడిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజుల కిత్రం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుకు బీజేపీ కూడా కలిసి వస్తుందని పవన్ గతంలో పలుమార్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళం ఏర్పడింది. దీనిపైనా పవన్, చంద్రబాబు మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. బీజేపీ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాకే కిషన్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారా అన్న దానిపై ఇరువురు నేతలు చర్చించుకొని ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోపక్క.. ఈ నెల 20న విజయనగరం జిల్లాలో లోకేశ్ యువగళం యాత్ర ముగింపు కార్యక్రమం జరగనుంది. దీనికి పవన్ రావడంలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం ప్రకటన చేశారు. ఆ కార్యక్రమానికి పవన్ కూడా హాజరైతే టీడీపీకి మేలు జరుగుతుందని లోకేశ్ భావిస్తున్నారు. లోకేశ్ ఒత్తిడితో ముగింపు కార్యక్రమానికి పవన్‌ను ఆహ్వానించేందుకే చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ వర్గాల కథనం మరోలా ఉంది. ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు, రాష్ట్రమంతటా చంద్రబాబు– పవన్ ఉమ్మడిగా సభల ఏర్పాటుకు సంబంధించి ఇరువురు నేతలు చర్చించుకున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

> **అధికార వైఎస్సార్‌సీపీ ముందే రాజకీయం వేడెక్కించడంతో..**
>
> 2024 ఎన్నికలకు మరికొద్ది నెలలే సమయం ఉండటంతో వైఎస్సార్‌సీపీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుండి నడిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత మార్పులకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాల్లో కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలను నియమిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ నేతృత్వంలోని జనసేన అభ్యర్థులని వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఆ రెండు పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు తొందరగా తేల్చాల్సిన పరిస్థితిని వైఎస్సార్‌సీపీ వారి ముందుంచింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ తాజా భేటీ జరిగి ఉంటుందని ఆ పార్టీల నేతలు భావిస్తున్నారు.


తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



జనం.. జైత్రయాత్ర

కర్నూలు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

పులితోనే జీవ వైవిధ్యం


రంజాన్ విరాని

జన్నారం: పులి ఉంటే వాతావరణ సమతుల్యత ఏర్పడుతుంది. జీవవైవిధ్యంలో అది ముఖ్యపాత్ర పోషిస్తుంది. పులికి అన్నివిధాల అనువైన ప్రదేశంగా కవ్వాల్ టైగర్‌జోన్ ఉన్నా ఇక్కడికి రావడం లేదు. పులి వచ్చే కారిడర్‌లో అలజడితో రాకపోకలు సాగిస్తుందే తప్పా ఇక్కడ ఉండటం లేదు. అటవీ గ్రామాల ప్రజలకు నమ్మకం కలిగిస్తూ వారి సహకారంతో పనులు చేస్తేనే పులి ఇక్కడకు రావడం సాధ్యమవుతుందని తిప్పేశ్వర్ గౌరవ వన్యప్రాణి సంరక్షకుడు, ప్రొఫెసర్ రంజాన్ విరాని అన్నారు. జన్నారం అటవీ డివిజన్ కేంద్రానికి వచ్చిన ఆయన్ను ఆదివారం 'సాక్షి' పలకరించింది. ఆయన మాటల్లోనే..

- టైగర్‌జోన్ అభివృద్ధికి ఆదివాసీల సహకారం తప్పనిసరి
- పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి
- 'సాక్షి'తో తిప్పేశ్వర్ వన్యప్రాణి సంరక్షకుడు ప్రొఫెసర్ రంజాన్ విరాని

పునరావాసం కల్పించాలి

అడవిలో పశువులు, మనుషుల అలజడితో పులి ఇక్కడకు రావడం లేదని తెలుస్తోంది. ఈ ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పిస్తే అలజడి తగ్గి పులి వచ్చే అవకాశం ఉంది.

తిప్పేశ్వర్‌లో రెండు గ్రామాల పునరావాసం

తిప్పేశ్వర్ మహా పుణ్యక్షేత్రమైన తిప్పాయిమాత కొలువైన స్థలం. అక్కడికి సుదూర ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున 2012లో తిప్పేశ్వర్, 2014లో మారేగావ్ గ్రామాలకు పునరావాసం కల్పించారు. మరో పుట్టిపుం గిరిగ్రామానికి పునరావాసం కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం తిప్పేశ్వర్‌లో 23 పులులు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్క ఆడ పులి, ఆరు పిల్లలతో ఉంది. ఇక్కడ ఆదివాసీ గిరిజనుల సహకారంతో కారిడర్‌లో అలజడి లేకుండా ఉంచితే తిప్పేశ్వర్, తాడోబా నుంచి పులులు వచ్చే అవకాశం ఉంది.

టూరిజంతో అందరికి ఉపాధి

కవ్వాల్ టైగర్‌జోన్ పర్యాటకుల ఆహ్లాదం నింపేందుకు అనువైన ప్రాంతం. ఇక్కడ చాలా వనరులు ఉన్నాయి. పక్కనే కడెం, కుంటాల, ఇటువైపు ధర్మపురి లక్ష్మీనర్సింహాస్వామి, గూడెం సత్యనారాయణస్వామి ఆలయాలు, కవ్వాల్ అడవులు కలుపుకుని టూరిజం ప్యాక్‌గా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుంది. వచ్చే ఆదాయంతో ఆదివాసీ గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. టూరిజంలో వారికి అవకాశం కల్పించాలి. గిరిజనులు చేసే బుట్టలు, ఇతర వాటిని కొనుగోళ్లు చేసే అవకాశం ఉంది. వారి నృత్యాలు, గుస్సాడీ లాంటి ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఇక్కడే బస చేయడం వల్ల హోటళ్లు, ఇతర వ్యాపారం జరుగుతుంది. వచ్చే ఆదాయంతో టైగర్‌జోన్ అభివృద్ధితోపాటు, వన్యప్రాణుల సంరక్షణ చేసుకునే వీలుంటుంది.

వన్యప్రాణులకు నిలయంగా అడవులు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లోని అడవులు వన్యప్రాణులకు ఆవాసాలుగా ఉన్నాయి. గడ్డిక్షేత్రాలు, నీటి వనరుల ద్వారా వీటి సంఖ్య ఎక్కువగా ఉంది. ఉదయం అడవిలోకి వెళ్తే రకరకాల వన్యప్రాణులు కనిపించాయి. స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. పది పులులకు సరిపడా వన్యప్రాణులు ఇక్కడ ఉన్నాయి. రాబోయే రోజుల్లో అటవీ అధికారులతోపాటు రిసార్ట్ నిర్వాహకులకు శిక్షణ ఇస్తాం.

గుర్తింపు ఎన్నికలపై నీలినీడలు

- హైకోర్టును ఆశ్రయించిన ఇంధనశాఖ కార్యదర్శి
- వాయిదావైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు
- పార్లమెంటు ఎన్నికల తర్వాత నిర్వహించే యోచన



సింగరేణి కార్మికుల విగ్రహం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై నీలినీడలు అలుముకున్నాయి. రాష్ట్ర ఎనర్జీ సెక్రటరీ గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేయాలని హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా డిప్యూటీ చీఫ్ మినిస్టర్ భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు ఇటీవల భేటీ అయ్యారు. ఎన్నికల వాయిదా వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలు ఇప్పుడు నిర్వహిస్తేనే బాగుటుందని ఐఎన్‌టీయూసీ నేతలు వివరించినట్లుగా సమాచారం. ఈనెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటీ చీఫ్‌లేబర్ కమిషనర్ డి.శ్రీనివాస్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందే గుర్తింపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. రెవెన్యూ, పోలీసుశాఖ చేతులెత్తేయడంతో వాయిదా వేశారు. అప్పటికే అన్నికార్మిక సంఘాలు నామినేషన్లు దాఖలు చేశాయి. గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాల ముద్రణ కూడా పూర్తయింది. ఈఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తుండగా.. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని యాజమాన్యం అభ్యంతరం తెలిపింది. జూన్‌లో మరోసారి కార్మిక సంఘాలను ఆహ్వానించినా.. సింగరేణి కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

గుర్తింపు ఎప్పుడో..?

– 2017 అక్టోబర్ 5న నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయం సాధించింది. నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించగా 2021తో గడువు పూర్తయ్యింది. గెలిచిన తర్వాత ఆర్నెల్లకు గుర్తింపు లేఖ అందజేయడంతో ఆ లెక్క ప్రకారం కూడా 2022 ఏప్రిల్ నాటికి గడువు ముగి 17నెలలు గడిచింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈక్రమంలో ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తోంది. అప్పటివరకు పొత్తులు ఇలాగే కొనసాగిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాలు కైవసం చేసుకుని విజఢంకా మోగించాలనే లక్ష్యంతో ఉన్నట్లుగా సమాచారం. ఈమేరకు హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన భేటీలో మంత్రులు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

జోష్‌లో ఐఎన్‌టీయూసీ..

అసెంబ్లీ ఎన్నికల్లో ఒకటి మినహా అన్నిస్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అంతేకాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఐఎన్‌టీయూసీలో జోష్ పెరిగింది. చాలామంది కార్మికులు, కార్మిక నేతలు యూనియన్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. గుర్తింపు ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామనే ధీమాతో ఐఎన్‌టీయూసీ నాయకులు దూకుడు పెంచారు. ఈక్రమంలో ఎన్నికలు ఆలస్యమైతే ఈ ప్రభావం ఐఎన్‌టీయూసీపై పడే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

నేడు హైకోర్టు బెంచ్‌కు వచ్చే అవకాశం..

ఎనర్జీ సెక్రటరీ వేసిన పిటిషన్ సోమవారం కోర్టులోని బెంచ్‌కు వచ్చే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని కార్మికులు, నాయకులు ఎదురుచూస్తున్నారు. సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఎన్నికలు వాయిదా పడకుండా హైకోర్టులో ఇప్పటికే కేవియట్ పటిషన్ దాఖలు చేసినట్లుగా చెబుతున్నారు.

ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు ఆవుడం పీఈటీ


పీఈటీ సంతోష్‌కుమార్

నెన్నెల: ఈ నెల 15 నుంచి 21 వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు తెలంగాణ జట్టు తరఫున నెన్నెల మండలం ఆవుడం ఉన్నత పాఠశాలకు చెందిన పీఈటీ నిట్టూరి సంతోష్‌కుమార్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం రాజ్యలక్ష్మీ తెలిపారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చి కప్పు సాధించాలని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు


జైపూర్ జట్టుకు చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్


గర్ల్స్ విన్నర్ జట్టుకు చెక్కు అందిస్తున్న భాగ్యలక్ష్మి

- బాయ్స్ విన్నర్ జైపూర్ జట్టు, గర్ల్స్ విన్నర్ ఆసిఫాబాద్ జట్టు

మందమర్రిరూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ – 17 హ్యాండ్‌బాల్ పోటీలు మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో జైపూర్, సిర్పూర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో జైపూర్ జట్టు విజేతగా నిలిచింది. రామకృష్ణాపూర్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ఆసిఫాబాద్, మంచిర్యాల జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆసిఫాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ఆదిలాబాద్ జట్టు మూడోస్థానం సాధించింది. విజేత జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు, షీల్డు, రన్నరప్ జట్లకు రూ.3 వేల నగదు, షీల్డు, మూడో స్థానంలో నిలిచిన జట్లకు రూ.2 వేల నగదు, ప్రశంసా పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, సభ్యులు వెంకటేశ్వర్లు, శంకర్, కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరుగుతున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో మన క్రీడాకారులు పతకాలు సాధించారని తెలంగాణ జట్టు కోచ్ మహేందర్ ఆదివారం తెలిపారు. 35 కేజీల విభాగంలో ప్రవీణ్‌కుమార్ రజత, 30 కేజీల విభాగంలో శివ, 50 కేజీల విభాగంలో జంపయ్య కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి పతకాలు రావడం పట్ల జూడో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, భారత జూడో సమాఖ్య కోశాధికారి కైలాసం యాదవ్, జూడో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కదారి అనంతరెడ్డి, అజీజ్, కోశాధికారి బాలరాజు, పెద్దపెల్లి జిల్లా చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు సంజీవ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీ టికెట్ ఇవ్వండి


వినతిపత్రం అందిస్తున్న బాల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసే అవకాశం కల్పించాలని దళిత మోర్చా అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి కోరారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. నాయకులు లక్ష్మణ్, గంగరాజు, రమేశ్, కిష్టయ్య, లక్ష్మీరాజం, ప్రసాదరావు, రాము, శివశంకర్, రాములు ఉన్నారు.

వెంకటరమణ విన్నపం..

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసేందుకు బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ఆసిఫాబాద్ అసెంబ్లీ ప్రభారి క్యాతం వెంకటరమణ కోరారు. ఈమేరకు నిర్మల్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను ఆయన కలిసి విన్నవించారు.

సన్నిధి

సువార్త



అది చిరస్మరణీయమైన క్రిస్మస్!!

అమెరికాలోని విస్కాన్సిన్ లో ఒక షాపింగ్ మాల్ చిరుద్యోగి, ఏడాదంతా కూడబెట్టిన తన డబ్బుతో బహుమానాలు కొని క్రిస్మస్ సమయంలో శాంటాక్లాజ్ గా వాటిని పిల్లలకు పంచుతాడు. అంతా అతన్ని సాంటా అనే పిలుస్తారు. ఒక క్రిస్మస్ సమయంలో చిన్న పిల్లవాడు, వృద్ధురాలైన అతని తాతమ్మ, చేతిలో ఒక పదేళ్ల పాప ఫోటోతో వచ్చి ఆయన్ను కలిశారు. 'ఎవరీమె?' అనడిగాడు శాంటా. 'నా సోదరి శారా' అన్నాడా పిల్లాడు. అతన్ని దగ్గరికి తీసుకొని 'ఇదిగో ఈ బహుమానాల్లో నీకు, నీ సోదరికి కూడా ఏమి కావాలో తీసుకో' అన్నాడు శాంటా. అపుడతని తాతమ్మ, 'శారా రక్తకణాల కాన్సర్‌తో ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య ఉంది. ఈ క్రిస్మస్ దాకా ఆమె బతకదేమో అంటున్నారు డాక్టర్లు. కాని శారా ఈ క్రిస్మస్ కు శాంటాను చూడాలనుకొంటోంది. వీలైతే ఒకసారి ఆసుపత్రికి రాగలరా? అని ఆమె శాంటాను కన్నీళ్లతో ప్రాధేయపడింది. శారా కథ విన్న శాంటా బాగా కలత చెంది, సరేనన్నాడు. ఆ సాయంత్రమే తన శాంటా డ్రెస్‌లో అతను ఆసుపత్రికి వెళ్ళాడు. గదిలో శారా అస్థిపంజరంలాగా మంచం పైన ఉంది. ఆమె తల్లి, తండ్రి, తమ్ముడు, తాతమ్మ, మరొక ఆంటీ చుట్టూ ఉన్నారు.

కృశించిన ఆమె వంటినిండా మచ్చలున్నాయి. కీమోథెరపీతో వెంట్రుకలు పూర్తిగా ఊడిపోయాయి. గది నిండా మృత్యువు వాతావరణం. శాంటా మనస్సు చివుక్కుమంది. అయినా తమాయించుకొని, శాంటా పద్ధతిలో ఒహ్హో.... అంటూ పెద్దగా ఆనంద శబ్దాలు చేస్తూ గదిలోకి వెళ్ళాడు. అతన్ని చూసి ఆనందం పట్టలేక 'శాంటా ...' అంటూ శారా గట్టిగా అరిచి మంచం మీది నుంచి లేవబోయింది. శాంటా పరిగెత్తుకెళ్లి ఆమె నుదుటిమీద ముద్దుపెట్టి, ఆమె పక్కనే కూర్చున్నాడు. శారా ఆనందం తో సాంటాకు ఏవేవో ఊసులు చెబుతోంది. కన్నీళ్లు ఆపుకొంటూనే సాంటా అవన్నీ వింటూ తాను కూడా చెబుతున్నాడు. శారాలో అంత ఆనందాన్ని చూసిన కుటుంబ సభ్యుల ఆనందానికి కూడా అంతు లేకుండా పోయింది. దానికి కారకుడైన సాంటాకు కృతజ్ఞతలు తెలిపారు. 'శారా, ఒక దేవదూతను నీకోసం ప్రత్యేకంగా నియమించమని దేవుని ప్రార్థిస్తాను' అన్నాడాయన. అంతా కళ్ళు మూసుకోగా, శాంటా ఆమె మంచం వద్ద మోకరిల్లి, శారా తల మీద చేయి పెట్టి, 'దేవా ఈ చిన్నబిడ్డను ముట్టండి, శారా వ్యాధిని బాగుచెయ్యండి' అంటూ ప్రార్థించాడు. అంతా 'ఆమెన్' అన్న వెంటనే, 'సైలెంట్ నైట్...' అనే సంప్రదాయక క్రిస్మస్ కీర్తనను శాంటా శ్రావ్యంగా అందుకోగా, చెమ్మగిల్లిన నేత్రాలతో సారాతో సహా అంతా కలిసి అద్భుతంగా పాడారు.'శారా, నేను చనిపోతున్నాను అని కాక, నేను బాగవుతాను అన్న భావన ఇక నుంచి నీలో బలపడాలి. ఈ వేసవిలో నువ్వు నీ స్నేహితులతో తనివి తీరా ఆడుకోబోతున్నావు. వచ్చే ఏడాది క్రిస్మస్ సమయంలో నా మాల్ కు వచ్చి నన్ను కలుసుకోబోతున్నావు' అని శాంటా శారాకు ధైర్యం చెప్పాడు. మెరిసే కళ్ళతో శారా 'సరే సాంటా' అంది .సాంటా శారాకు ఆటవస్తువులివ్వలేదు, ఆ క్రిస్మస్ కు జీవితంపై 'ఆశ' అనే గొప్ప బహుమతినిచ్చాడు. అంతా ఆయన్ను హత్తుకొని సాగనంపారు.

ఏడాది తరువాత మాల్‌కు ఒకమ్మాయి వచ్చి సాంటాను కలిసి 'నేను గుర్తున్నానా సాంటా?' అనడిగింది. పిల్లలందరితో అన్నట్టే 'ఎందుకు గుర్తులేవు? ఉన్నావు' అన్నాడు శాంటా. 'పోయిన ఏడాది నన్ను చూసేందుకు మీరు ఆసుపత్రికి వచ్చారు' అని ఆమె అంటూండగానే శాంటాకు గుర్తొచ్చి 'నీవు శారావు కదూ' అన్నాడు అత్యాశ్చర్యంగా. అద్భుతం!! జుట్టు బాగా పెరిగి, ఎంతో బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా ఉంది శారా. ఆనంద బాష్పాలతో శారాను శాంటా హత్తుకున్నాడు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులంతా వచ్చారు. ఈసారి ఆమె బొమ్మల కోసం రాలేదు. తనలాంటి పిల్లలకు పంచమంటూ బోలెడు ఆటబొమ్మలు, వస్తువులు తెచ్చిచ్చి వెళ్ళింది. 'ఇది నేను ఎన్నటికీ మర్చిపోలేని క్రిస్మస్' అంటూ, శారాకిచ్చిన 'కొత్త జీవితం' అనే బహుమానానికి ఆకాశం వైపు చూస్తూ సాంటా దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు.

– సంధేశ్ అలెగ్జాండర్

మంచిమాట



వ్యక్తం... అవ్యక్తం

పైకి పచ్చగా కనిపించే చెట్టు ఎంత విస్తరించి ఉన్నదో అంత కన్న ఎక్కువగా దాని వేళ్ళు నేలలో పాతుకుని పోయి ఉంటాయి. చెట్టు అంటే పైకి కనిపించే కొమ్మలు, ఆకులు, పూలు, పళ్ళు మాత్రమే అనుకుంటే ఎంత పొరపాటో తెలుస్తోంది కదా. అదే విధంగా మనకి పైకి కనిపించే ప్రపంచం వెనుక ఎంతో ప్రయత్నం ఉంది. కనపడేది ఒక వంతు మాత్రమే... మూలమైనది మూడు వంతులు అని మన ఋషులు దర్శించి తెలియ చేశారు.

ఒక వైద్యుడి దగ్గరకి వెళ్లినప్పుడు ఆయన నాలుగు మాటలు చకచక రాయటం చూసి, ఈ మాత్రానికే రూ. 500 తీసుకున్నాడు అని వాపోతారు. కాని, ఆ నాలుగు మాటలు, అంటే మందుల పేర్లు రాయటానికి ఆయన ఎంత కాలం కృషి చేసి ఉంటారో . ఒకసారి ఒక యంత్రం హఠాత్తుగా ఆగిపోయిందట. అందరూ రకరకాలుగా ప్రయత్నం చేశారు కానీ అది మొండికేసింది. ఒక ఇంజినీర్‌ని పిలిచారు. ఆయన వచ్చి అటు ఇటు పరిశీలించి సుత్తి తీసుకుని సున్నితంగా ఒక దెబ్బ వెయ్యగానే అది పని చెయ్యటం మొదలు పెట్టింది. తన ఫీజు అడగగానే ఒక సుత్తిదెబ్బ ఇంత ఖరీదా? అని అడిగాడట యజమాని. దానికి ఆ ఇంజినీరు సుత్తి దెబ్బకి ఒక రూపాయే. కానీ ఎక్కడ కొట్టాలో, ఎట్లా కొట్టాలో తెలుసుకున్నందుకు మిగిలినది అన్నాడట. నిజమే కదా. సుత్తిదెబ్బ అయితే ఎవరైనా కొట్టి ఉండవచ్చుగా. ఇంజినీరు ని పిలవటం ఎందుకు? పైకి కనిపించే పని వెనక ఉన్న కృషే పనిలో నైపుణ్యానికి కారణం.

''పాదోస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతమ్ దివి'' అంది పురుష సూక్తం. అది అర్థం కావటానికి మానవుడు స్వయంగా ఇతర ప్రమేయం లేకుండా తయారు చెయ్యగల ఒకే ఒక్కమాటని ఉదాహరణగా తీసుకోవచ్చు.''త్రీణి నిహితా గుహాని తాని విదుర్బ్రాహ్మణా మనీషిణః నేంగయన్తి తురీయమ్ వాచో మనుష్యా వదంతి''పరా, పశ్యంతి, మాధ్యమా అనే మూడుస్థాయుల ప్రయత్నం తరువాత వైఖరి అనబడే అందరికి వినపడే వాక్కు వెలువడుతుంది. మనకి తెలియకుండానే ఇంత ప్రయత్నం జరిగిపోతోంది. ఇది అర్థం చేసుకోగలిగితే సృష్టి రహస్యం చాలా వరకు తెలిసినట్టే. దృశ్యమాన జగత్తుకి కారణమైన అదృశ్యంగా ఉన్న దానిని కనీసం ఊహించగలుగుతాం. ఇది ఇంకా బాగా అర్థం కావాలంటే ఒక నాటక ప్రదర్శననో, చలనచిత్రాన్నో చూడండి. రంగస్థలం మీద ఒక గంటో, రెండుగంటలో ప్రదర్శించే నాటకానికి పూర్వరంగం అంటే ముందు చేసే ప్రయత్నం ఎంతో. తెరమీద కనపడే ఒక దృశ్యాన్ని చిత్రీకరించటానికి ఎంతమంది ఎన్నిరోజులు శ్రమించి ఉంటారో ఈ మధ్య కాలంలో బాగా ప్రచారం చేస్తూనే ఉన్నారుగా. ఒక గంట పాట కచేరీకి ఇన్ని వేలా? అని ప్రశ్నించే వారికి సమాధానం అది ఆ గంట కచేరీకి కాదు, దానికి ముందు చేసిన సాధనకి అని.

ఒక మేధావి ఇచ్చిన గంట ఉపన్యాసం వింటే వంద గ్రంథాలు చదివినట్టే అనేది అందుకనే. ఒక్క గంట మాట్లాడటానికి వాళ్ళు అప్పటికి కొన్ని గ్రంథాలు చదువుతారు. అంతకుముందే ఎన్నో గ్రంథాలు చదివి ఉంటారు. దానికి వారి అనుభవం, విశ్లేషణ జోడించబడతాయి. ఈ దృష్టి అలవరచుకుంటే వ్యక్తం నుండి అవ్యక్తానికి ప్రస్థానం ప్రారంభమైనట్టే.

ఒక చెట్టుని కొట్టటానికి గంట పట్టింది. ఎంత తేలిగ్గా అయిపోయిందో అని చూసే వాళ్ళు అనుకుంటారు. కాని, గంట సమయంలో కొట్టటానికి గాను గొడ్డలికి తగినంత పదును పెట్టటానికి కనీసం పది గంటలు పట్టి ఉంటుంది. కనపడే పని వెనక కనపడకుండా ఉన్న సంసిద్ధత కోసం చేసిన ప్రయత్నం ఎంత ఉంటుందో అర్థం చేసుకుంటే పని సమయాన్ని సరిగా అంచనా వేసినట్టు అవుతుంది. చాలా సందర్భాలలో చేసే పని విలువని సరిగా అంచనా వెయ్యలేకపోవటానికి ఇటువంటి అవగాహనాలోపమే కారణం.

– డా. ఎన్.అనంత లక్ష్మి

వాగ్గేయకార వైభవం

ఇల్లు గుర్తుకు రావడం లేదా..!



శంకరాచార్యులవారికి వారి గురువయిన గోవింద భగవత్పాదులవారి మీద ఎటువంటి గురి ఉంటుందో అంత గొప్ప గురి వాగ్గేయకారులకు కూడా వారి గురువులపట్ల వ్యక్తమయింది. శ్రద్ధాసక్తులతో శుశ్రూష చేసి వారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ముత్తుస్వామి దీక్షితార్ వారి చిన్నతనంలో వారింటికి వయోధికుడయిన చిదంబరనాథయోగి వచ్చి విడిది చేసాడు. ఆయన కాశీ వెడుతూ సహాయంగా తనవెంట ముత్తుస్వామిని పంపమని వారి తండ్రిని అడిగాడు.

శిష్యుడు నాకు ఒక మంచి గురువు కావాలని ఎంత తాపత్రయ పడతాడో అలాగే ఒక గురువు కూడా శిష్యుడిని పొందాలని ఆర్తిపొందుతాడు. జీవితంలో మొదటిసారిగా వివేకానందుడు వచ్చినప్పుడు రామకృష్ణ పరమహంస పిచ్చిగా గంతులు వేస్తూ కౌగిలించుకున్నాడు.'నీ గురించి ఎంత కాలం నుంచి ఎదురు చూస్తున్నాన్రా నాయనా! ఇంత కాలానికి నామీద దయ కలిగిందా... ఇప్పుడు వచ్చావా..' అని మాట్లాడుతుంటే 'ఈయనకు పిచ్చి ఉందని విన్నా. నిజమేననిపిస్తున్నది. ఈయన నాగురించి ఎదురు చూడటమేమిటి?' అనుకున్నాడు వివేకానందుడు. యోగ్యుడయిన శిష్యుడిని గుర్తించి ఉద్ధరించడానికి ఆరాటపడతాడు గురువు. ముత్తుస్వామి వారిలో ఆ యోగికి ఏ తేజస్సు కనబడిందో తన వెంట తీసుకెళ్ళారు. రామచంద్రమూర్తిని విశ్వామిత్ర మహర్షితో పంపించడానికి దశరథ మహారాజు ఎలా సంకోచించారో అలా మథనపడుతున్న ముత్తుస్వామి తండ్రికి ఆయన మిత్రుడు నచ్చచెప్పి అంగీకరింపచేసాడు. ఇంత చిన్నవయసులో అమ్మానాన్నా దగ్గర ఉండకుండా, ఆడుకుంటూ పాడుకుంటూ చదువుకుంటూ తోబుట్టువులతో, తోటి పిల్లలతో ఆనందంగా గడపకుండా... ఎక్కడ కాశీ ...అదేమన్నా పక్క ఊరా దిగబెట్టి రావడానికి ... వంటి ఆలోచనలేవీ చేయకుండా... ఇంతటి మహానుభావుడితో కలిసి వెళ్ళడం, ఆయన మాటలు వినడం నా జీవిత అభ్యున్నతికి కారణం- అని అనుకున్న ముత్తుస్వామి గురువు వెంట బయల్దేరి వెళ్ళాడు. అక్కడ గురువు శిష్యుడికి శ్రీవిద్య మంత్రాన్ని ఉపదేశించారు.

గురువులు ఒక మంత్రం ఇస్తే వాగ్గేయకారులకు ఎంత తిరుగులేని నమ్మకం అంటే.. త్యాగరాజ స్వామివారు రోజుకు లక్షా 25వేల సార్లు తారకనామాన్ని జపిస్తూ గొప్ప గొప్ప కీర్తనలు మనకు అందిస్తూ చివరకు ఆయనలో ఐక్యమయ్యారు. అలాగే ముత్తుస్వామి వారు కూడా అమ్మవారికి మనసులోనే గుడి కట్టి మంత్రజపం, ఆరాధన చేస్తుండేవారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఒక రోజున గురువుగారు ముత్తుస్వామిని పిలిచి –''లేత వయసులో నాతో కలిసి వచ్చేసావు, ఎక్కడో దక్షిణదేశం నుంచి... ఎక్కడ మలవి అగ్రహారం, ఎక్కడ కాశీ పట్టణం! చాలా కాలమయింది నీవిక్కడికి వచ్చి. –నేను మా అమ్మగారిని, నాన్నగారిని చూడాలని ఉంది, తోబుట్టువులు గుర్తుకొస్తున్నారు. వారిని విడిచి వచ్చాను. నేను ఇక ఇంటికి ఎప్పుడు బయల్దేరాలి?'' అని అడగాలి కదా! అడగవేం ..'' అన్నారు. దానికి ముత్తుస్వామి..''గురువుగారికి స్థాన శుశ్రూష, ఆత్మశుశ్రూష, దేహ శుశ్రూష చేస్తున్నా.. ఇలా గురువుగారిని సేవించడం అంటే పరబ్రహ్మాన్ని సేవించినట్టే... ఇంతకన్నా నాకు ఇంకేం భాగ్యం కావాలి'' అని బదులిస్తే గురువు తన్మయత్వం చెందారు.

సినిమా

బాక్సాఫీస్ వేటలో యానిమల్ బ్లాక్ బస్టర్



● రష్మిక, రణ్‌బీర్ కపూర్

బాక్సాఫీస్ వద్ద 'యానిమల్' వసూళ్ల వేట కొనసాగుతోంది. తొలి చిత్రం 'అర్జున్ రెడ్డి'తోనే సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఆ తర్వాత హిందీ పరిశ్రమ వైపు వెళ్లారు. అక్కడ 'అర్జున్ రెడ్డి' చిత్రాన్నే 'కబీర్ సింగ్'గా రీమేక్ చేసి, మరో సూపర్ హిట్ అందుకున్నారు. ఈ రెండు చిత్రాలు ఒక ఎత్తయితే సందీప్ తెరకెక్కించిన మూడో చిత్రం 'యానిమల్' వసూళ్ల పరంగా మరో ఎత్తు అనాలి. రణ్‌బీర్ కపూర్ కథానాయకునిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం డిసెంబర్ 1న విడుదలై, సంచలన వసూళ్లతో దూసుకెళుతోంది. విడుదలైన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ. 116 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇక తొలి వారాంతానికి రూ. 356 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ సినిమా 16 రోజులకు ప్రపంచవ్యాప్తంగా రూ. 817.36 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. రణ్‌బీర్ కపూర్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించే దిశగా ఈ చిత్రం దూసుకెళ్తోంది. ఇప్పటివరకూ సాధించిన వసూళ్ల ప్రకారం ఈ ఏడాది విడుదలై, అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో 'యానిమల్' టాప్ ఫైవ్‌లో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది షారుక్ ఖాన్ హీరోగా నటించిన 'జవాన్', 'పఠాన్' చిత్రాలు రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్ కొల్లగొట్టి మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇక 'యానిమల్' చిత్రం తెలుగులోనూ మంచి వసూళ్లు రాబడుతోంది. తెలుగు అనువాదాన్ని 'దిల్' రాజు విడుదల చేశారు. రిలీజ్ అయిన తొలి రోజే రూ. 15 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించిందని 'దిల్' రాజు పేర్కొన్నారు. తెలుగు వెర్షన్ ఇప్పటివరకూ దాదాపు రూ. 60 కోట్ల పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇలా ఈ ఏడాది సందీప్ రెడ్డి బాక్సాఫీస్‌ని షేక్ చేసే చిత్రం తీశారు. ఈ చిత్రానికి ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా ఓ నిర్మాత. రష్మికా మందన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రి కీలక పాత్రలు పోషించారు. 'యానిమల్'కి రెండో భాగం 'యానిమల్ పార్క్' రానున్న సంగతి తెలిసిందే.



● సందీప్ రెడ్డి వంగా

రవితేజ మిస్టర్ బచ్చన్



● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్ ఖరారైంది.'నామ్ తో సునా హోగా..!' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఈ సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి కె. రఘురామకృష్ణ, టీజీ భరత్‌లు కలిసి కెమెరా స్విచ్చాన్ చేయగా, మంగత్ పాఠక్ క్లాప్ ఇచ్చారు. ముహూర్తపు షాట్‌కు ''మిస్టర్ బచ్చన్... నామ్ తో సునా హోగా!'' అని రవితేజ డైలాగ్ చెప్పగా, వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. రవితేజ, విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, రఘురామకృష్ణలు కలిసి హరీష్ శంకర్‌కు ఈ సినిమా స్క్రిప్ట్‌ను అందించారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె. మేయర్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ఊతకొట్టుడు కొట్టేశాడు!

'ఏం చేస్తాన్నాడెంటి.. మీవోడు.. ' (ఆషికా రంగనాథ్), 'నిన్నే మావిడితోటలో ఇరవైమందిని ఊతకొట్టుడు కొట్టేశాడు ('అల్లరి' నరేశ్)', 'ఆడేమైనా కుర్రాడనుకుంటున్నాడా..కొంచెం తగ్గమను (ఆషికా)'...అన్న డైలాగ్స్‌తో విడుదలైంది 'నా సామిరంగ' సినిమా టీజర్. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'నా సామిరంగ' చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. 'ఏం అడగాలో దానికి తెలియదు. ఏం అడుగుతుందో నీకు తెలియదు. ఏం చేయాలో నాకు తెలియదు' (నాగార్జున) అన్న డైలాగ్స్‌తో ఈ టీజర్ సాగుతుంది. ''సినిమాలో నాగార్జునగారి గోదావరి యాస చాలా బాగుంటుంది. రొమాన్స్, స్నేహం, యాక్షన్ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: కీరవాణి.



● రాజ్ తరుణ్, నాగార్జున, 'అల్లరి' నరేశ్

రజనీ సినిమాలో రణ్‌వీర్?

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది వేసవిలో ప్రారంభం కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం దర్శకుడు లోకేష్ కనగరాజ్ బాలీవుడ్ స్టార్స్ షారుక్ ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లను సంప్రదించారట. అయితే ఇటీవల కాలంలో ఇతర చిత్రాల్లో ఎక్కువగా గెస్ట్ రోల్స్ చేసిన కారణంతో రజనీ సినిమాకు షారుక్ సున్నితంగా నో చెప్పారని, దీంతో రణ్‌వీర్‌సింగ్‌ను లోకేష్ కలిసి కథ వినిపించారని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... రజనీకాంత్ సినిమాలో రణ్‌వీర్‌సింగ్ నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు రజనీకాంత్ ప్రస్తుతం 'వేట్టయాన్' సినిమాతో బిజీగా ఉన్నారు. అలాగే రజనీకాంత్ ఓ లీడ్ రోల్ చేసిన 'లాల్ సలామ్' చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.



● రణ్‌వీర్ సింగ్

చలో కోల్‌కత్తా



● కాజోల్

ప్రేక్షకులను భయపెడతా అంటున్నారు బాలీవుడ్ నటి కాజోల్. ఆమె ప్రధాన పాత్రధారిగా విశాల్ ఫురియా ఓ సినిమాను తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారని బాలీవుడ్ సమాచారం. పూర్తిస్థాయి హారర్ జానర్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావొచ్చాయని, జనవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేలా విశాల్ ప్లాన్ చేశారని టాక్. తొలి షెడ్యూల్ కోల్‌కతాలో మొదలవుతుందట. నెల రోజులకు పైగా అక్కడి లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన చేశారట యూనిట్. ఇక ఈ సినిమాను కాజోల్ భర్త, దర్శక-నటుడు, నిర్మాత అజయ్ దేవగన్ నిర్మించనున్నారని బాలీవుడ్ భోగట్టా.

కామెడీ ఎక్స్‌ప్రెస్



● హెబ్బా పటేల్, చైతన్యా రావు

చైతన్యారావు, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఎన్ఆర్ఐ ఎంటర్‌టైన్మెంట్స్, న్యూ రీల్ ఇండియా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో నాగార్జున విడుదల చేసి, మాట్లాడుతూ–'' వినోదాత్మకంగా సందేశంతో కూడిన ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''లాస్ ఏంజెల్స్‌లో ఉంటూ ఎన్నో హాలీవుడ్ చిత్రాలకు పని చేశాను. కానీ తెలుగు సినిమా చేయాలనేది నా కల. నాగార్జున, అమలగార్ల ప్రోత్సాహంతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేశాను. మా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన నాగార్జునగారికి ధన్యవాదాలు'' అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: కళ్యాణీ మాలిక్, నేపథ్యసంగీతం: ఆర్‌పీ పట్నాయక్.

విలేజ్ లవ్‌స్టోరీ



● అవికా గోర్, అనురాగ్

అనురాగ్, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా సత్య ద్వారపూడి దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన గ్రామీణ ప్రేమకథా చిత్రం 'ఉమాపతి'. ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. రెండు ఊర్ల మధ్య గొడవలు హీరో హీరోయిన్ల ప్రేమకు ఎలా అడ్డంకిగా మారాయి? ఫైనల్‌గా వీరి లవ్‌స్టోరీ ఎలా ముగుస్తుంది? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందన్నట్లుగా విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. పోసాని కృష్ణమురళి, తులసి, ప్రవీణ్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: శక్తికాంత్ కార్తీక్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు.



పాకిస్తాన్‌తో డేవిస్‌కప్ మ్యాచ్: భారత జట్టులో సాకేత్

ఇస్లామాబాద్ వేదికగా పాకిస్తాన్ జట్టుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగే డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో పాల్గొనే భారత టెన్నిస్ జట్టును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని జట్టులోకి పునరాగమనం చేశాడు. 2022 సెప్టెంబర్‌లో నార్వేతో జరిగిన వరల్డ్ గ్రూప్ తొలి రౌండ్ మ్యాచ్‌లో చివరిసారి సాకేత్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, యూకీ బాంబ్రీ, నిక్కీ పునాచా, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.

ఇషాన్ కిషన్ స్థానంలో కేఎస్ భరత్

దక్షిణాఫ్రికాతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టులో ఒక మార్పు జరిగింది. ముందుగా ప్రకటించిన జట్టులో సభ్యుడిగా ఉన్న ఇషాన్ కిషన్ వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్ నుంచి వైదొలిగాడు. ఇషాన్ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వికెట్ కీపర్ కేఎస్ భరత్‌తో భర్తీ చేశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోనే ఆడుతున్న భారత 'ఎ' జట్టుకు భరత్ కెప్టెన్‌గా ఉన్నాడు. భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్టు సెంచూరియన్‌లో (డిసెంబర్ 26–30), రెండో టెస్టు కేప్‌టౌన్‌లో (జనవరి 3–7) జరుగుతాయి.



అర్ష్‌దీప్, అవేశ్ అదుర్స్

వాండరర్స్ వేదికపై ఆఖరి టి20లో ధనాధన్ మెరుపులతో సునాయాసంగా 200 పైచిలుకు పరుగులు చేసిన భారత్... తర్వాత సఫారీ మెడకు స్పిన్ ఉచ్చు బిగించి మ్యాచ్ గెలిచింది. సిరీస్‌ను సమం చేసింది. మారని వేదికపై మారిన ఫార్మాట్‌లో అలాంటి విజయంతోనే టీమిండియా వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. అయితే ఇందులో ముందు దక్షిణాఫ్రికాను కుప్ప కూల్చేసి తర్వాత సులువైన లక్ష్యాన్ని టీమిండియా చకచకా ఛేదించేసింది. ఈ గెలుపుతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో 1–0తో ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే రేపు పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగుతుంది.

- నిప్పులు చెరిగిన భారత పేస్ బౌలర్లు
- తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై 8 వికెట్లతో భారత్ ఘనవిజయం
- అర్ధ సెంచరీలతో రాణించిన సాయి సుదర్శన్, శ్రేయస్ అయ్యర్




అవేశ్
4/27

అర్ష్‌దీప్
5/37


సాయి సుదర్శన్
55 నాటౌట్

జొహన్నెస్‌బర్గ్: పేస్ బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్ (5/37), అవేశ్ ఖాన్ (4/27)ల అసాధారణ స్పెల్... అరంగేట్రం మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ (43 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు), సీనియర్ శ్రేయస్ అయ్యర్ (45 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు.. వెరసి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో గెలిచి శుభారంభం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 27.3 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. ఎనిమిదో వరుసలో బ్యాటింగ్‌కు దిగిన ఫెలుక్వాయో (49 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్! అనంతరం భారత్ 16.4 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసి గెలిచింది. కెరీర్‌లోని తొలి మూడు వన్డేల్లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయిన అర్ష్‌దీప్ తన నాలుగో వన్డేలో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. అంతేకాకుండా దక్షిణాఫ్రికాపై వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి భారత పేస్ బౌలర్‌గా అర్ష్‌దీప్ గుర్తింపు పొందాడు.

ఆ నలుగురితోనే...

ముందు బౌలింగ్‌లో ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఇద్దరిద్దరు చేసిన ప్రదర్శనతో టీమిండియా గర్జించింది. టాస్ గెలవగానే బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాపై అర్ష్‌దీప్ తన తొలిఓవర్ (ఇన్నింగ్స్ రెండో)లోనే చావుదెబ్బ తీశాడు. వరుస బంతుల్లో హెన్‌డ్రిక్స్ (0), డసెన్ (0)లను డకౌట్ చేశాడు. అడపాదడపా ఫోర్లు, సిక్స్‌లు కొడుతున్న మరో ఓపెనర్ టోని డి జోర్జి (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)ని కూడా అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికా కుదేలైంది. ఆ తర్వాత పదో ఓవర్ ఆఖరి బంతికి క్లాసెన్ (6)నూ అతనే పెవిలియన్ చేర్చితే... 11వ ఓవర్ తొలి రెండు బంతుల్లో అవేశ్... మార్క్‌రమ్ (12), ముల్డర్ (0)లను పడగొట్టడంతో 52 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఫెలుక్వాయో చేసిన ఆ కాస్త పోరాటంతో సఫారీ వంద పైచిలుకు స్కోరు చేయగలిగింది.

సాయి, అయ్యర్ ఫిఫ్టీ–ఫిఫ్టీ

రుతురాజ్ (5) విఫలమైనా... సాయి సుదర్శన్, శ్రేయస్ అయ్యర్ ఆతిథ్య బౌలర్లపై పరుగుల భరతం పట్టడంతో ఏ దశలోనూ భారత్‌కు ఇబ్బందే ఎదురవలేదు. ఇద్దరు బౌండరీలతో స్కోరు వేగాన్ని పెంచారు. ఈ క్రమంలోనే భారత్ 8.4 ఓవర్లో 50 పరుగుల్ని, 15.1 ఓవర్లో వంద పరుగుల్ని అధిగమించింది. 16వ ఓవర్లోనే సుదర్శన్ 41 బంతుల్లో... అయ్యర్ 44 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నారు. లక్ష్యానికి చేరువయ్యాక అయ్యర్ అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తిలక్ వర్మ (1 నాటౌట్)తో సాయి సుదర్శన్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (బి) అర్ష్‌దీప్ 0; టోని (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 28; డసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (బి) అవేశ్ 12; క్లాసెన్ (బి) అర్ష్‌దీప్ 6; మిల్లర్ (సి) రాహుల్ (బి) అవేశ్ 2; ముల్డర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ 0; ఫెలుక్వాయో (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 33; కేశవ్ (సి) రుతురాజ్ (బి) అవేశ్ 4; బర్గర్ (బి) కుల్దీప్ 7; షమ్సీ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (27.3 ఓవర్లలో ఆలౌట్) 116. వికెట్ల పతనం:** 1–3, 2–3, 3–42, 4–52, 5–52, 6–52, 7–58, 8–73, 9–101, 10–116. **బౌలింగ్:** ముకేశ్ 7–0–46–0, అర్ష్‌దీప్ 10–0–37–5, అవేశ్ 8–3–27–4, కుల్దీప్ 2.3–0–3–1.

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముల్డర్ 5; సాయి సుదర్శన్ (నాటౌట్) 55; అయ్యర్ (సి) మిల్లర్ (బి) ఫెలుక్వాయో 52; తిలక్ వర్మ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (16.4 ఓవర్లలో 2 వికెట్లకు) 117. వికెట్ల పతనం:** 1–23, 2–111. **బౌలింగ్:** బర్గర్ 5.4–1–35–0, ముల్డర్ 4–0–26–1, కేశవ్ 3–0–19–0, షమ్సీ 3–0–22–0, ఫెలుక్వాయో 1–0–15–1.

253 భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 253వ ప్లేయర్‌గా తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల సాయి సుదర్శన్ గుర్తింపు పొందాడు.

116 స్వదేశంలో వన్డేల్లో దక్షిణాఫ్రికా జట్టుకిదే అత్యల్ప స్కోరు. 2018లో సెంచూరియన్‌లో భారత్‌పైనే దక్షిణాఫ్రికా 118 పరుగులకు ఆలౌటైంది.

17 భారత్ తరఫున అరంగేట్రం వన్డేలోనే అర్ధ సెంచరీ చేసిన 17వ ప్లేయర్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు.

6 వన్డే మ్యాచ్‌లో ఇద్దరు భారత పేస్ బౌలర్లు నాలుగు అంతకంటే ఎక్కువ వికెట్లు చొప్పున తీయడం ఇది ఆరోసారి మాత్రమే.

ఆసీస్ ఘన విజయం

- 360 పరుగుల తేడాతో ఓడిన పాక్
- 500 వికెట్ల క్లబ్‌లో లయన్


లయన్

పెర్త్: పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్టులో ఆ్రస్టేలియా 360 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. 450 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 30.2 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. పరుగుల తేడా పరంగా టెస్టుల్లో పాకిస్తాన్‌కిది రెండో అతిపెద్ద పరాజయం. పాక్ జట్టులో సౌద్ షకీల్ (24), బాబర్ ఆజమ్ (14), ఇమామ్ ఉల్ హఖ్ (10) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. ఆసీస్ బౌలర్లు మిచెల్ స్టార్క్ (3/31), హాజల్‌వుడ్ (3/13), నాథన్ లయన్ (2/14) పాక్‌ను దెబ్బ తీశారు. రెండు వికెట్లు తీసిన క్రమంలో ఆసీస్ ఆఫ్ స్పిన్నర్ లయన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. తద్వారా లయన్ టెస్టుల్లో 500 వికెట్లు తీసిన ఎనిమిదో బౌలర్‌గా... షేన్ వార్న్ (708), మెక్‌గ్రాత్ (563) తర్వాత ఆ్రస్టేలియా నుంచి ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా గుర్తింపు పొందాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 84/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ్రస్టేలియా 5 వికెట్లకు 233 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ్రస్టేలియా గడ్డపై పాకిస్తాన్‌కిది వరుసగా 15వ పరాజయం. చివరిసారి 1995లో ఆ్రస్టేలియా గడ్డపై పాకిస్తాన్ టెస్టులో గెలిచింది.


ఫిల్ సాల్ట్

ఇంగ్లండ్ సంచలనం

సెయింట్ జార్జ్: ఉత్కంఠ రేపిన మూడో టి20లో భారీ సిక్సర్లతో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ వేటలో 1–2తో నిలిచింది. మొదట విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగుల స్కోరు చేసింది. పూరన్ (45 బంతుల్లో 82; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెప్టెన్ పావెల్ (21 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత ఇంగ్లండ్ 19.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసి నెగ్గింది. ఇంగ్లండ్ స్కోరు 15 ఓవర్లలో 140/2. ఈ దశలో 30 బంతుల్లో 83 పరుగుల విజయ సమీకరణం ఇంగ్లండ్‌కు క్లిష్టమైంది. అయితే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (56 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 9 సిక్స్‌లు), బ్రూక్ (7 బంతుల్లో 31 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) భారీషాట్లతో అసాధ్యాన్ని సాధ్యం చేశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు 18 సిక్స్‌లు, విండీస్ బ్యాటర్లు 16 సిక్స్‌లు కొట్టడం విశేషం.

జైపూర్ పింక్‌పాంథర్స్ గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ రెండో విజయం నమోదు చేసింది. పట్నా పైరేట్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 29–28తో గెలిచింది. జైపూర్ తరఫున అజిత్ అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేశాడు.

ధ్రువ్–తనీషా జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



కటక్: ఒడిశా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారులకు రెండు విభాగాల్లో టైటిల్స్ లభించాయి. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో ద్వయం విజేతగా నిలువగా... పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్ చాంపియన్ అయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో ధ్రువ్–తనీషా జోడీ 74 నిమిషాల్లో 17–21, 21–19, 23–21తో హీ యోంగ్ కాయ్ టెర్రీ–తాన్ వె హాన్ జెస్సికా (సింగపూర్) జంటను ఓడించింది. ధ్రువ్–తనీషా జోడీకి 7,900 డాలర్ల (రూ. 6 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సతీశ్ 21–18, 19–21, 21–14తో ఆయుశ్ శెట్టి (భారత్)పై గెలిచాడు. సతీశ్‌కు 7,500 డాలర్ల (రూ. 6 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. మహిళల డబుల్స్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 14–21, 17–21తో మెలీసా–రాచెల్ రోజ్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో గరగ కృష్ణప్రసాద్–సాయిప్రతీక్ (భారత్) జంట 20–22, 18–21, 17–21తో లిన్ బింగ్ వె–సు చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎంఈ సీఈఈ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2024

వైమానిక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏఎంఈ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2024 ప్రకటన విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా విమానయాన రంగంలో లైసెన్స్/ఇంజనీరింగ్/డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయి.

కోర్సుల వివరాలు

- » **లైసెన్స్ ప్రోగ్రామ్:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(డీజీసీఏ), కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(ఈఏఎస్ఏ).
- » **ఇంజనీరింగ్ ప్రోగ్రామ్:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్.
- » **గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్:** బీబీఏ(ఏవియేషన్), బీఎస్సీ(ఏఎంఈ).
- » **సర్టిఫికేట్ ప్రోగ్రామ్:** క్యాబిన్ క్రూ, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్,ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్.
- » **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత గ్రూపులో 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి లేదా ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు. వయసు: 14 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.03.2024
- » **అడ్మిట్ కార్డుల జారీ:**2024 ఏప్రిల్ చివరి వారం
- » **ప్రవేశ పరీక్ష తేది:** 2024 మే మొదటి వారం.
- » **ఫలితాల వెల్లడి తేది:** 2024 మే రెండో వారం
- » **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేది:** 2024, మే మూడో వారం.
- » **వెబ్‌సైట్:** www.amecee.in

ఐఐఎం లక్నోలో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, లక్నో.. జూన్ 2024 సెషన్‌కు సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(పీహెచ్‌డీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **స్పెషలైజేషన్:** అగ్రి–బిజినెస్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, డెసిషన్ సైన్స్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.
- » **అర్హత:** డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. గేట్/జీఆర్ఈ/జీమ్యాట్/క్యాట్ లేదా జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్)లో స్కోరు సాధించి ఉండాలి.
- » **వయసు:** 55 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.
- » **వెబ్‌సైట్:** www.iiml.ac.in

కల సాకారం చేసుకోండిలా!

ఉద్యోగార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో శుభవార్త! డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024, జనవరి 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు దశల ఎంపిక ప్రక్రియలో.. తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష తేదీని కూడా ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్–1 నోటిఫికేషన్, పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » 81 గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్
- » బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
- » జనవరి 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- » మొత్తం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ
- » మార్చి 17న ప్రిలిమినరీ ఎగ్జామినేషన్


ఏపీపీఎస్సీ గ్రూప్ 1

మొత్తం 81 పోస్టులు

ఏపీపీఎస్సీ తాజా గ్రూప్1 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 81 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో డిప్యూటీ కలెక్టర్–9 పోస్టులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్–18 పోస్టులు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్)–26 పోస్టులు, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్–6 పోస్టులు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి–3, కో–ఆపరేటివ్ సర్వీస్ డిప్యూటీ రిజిస్ట్రార్–5 పోస్టులు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్–3 పోస్టులు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్–4 పోస్టులు వంటివి ఉన్నాయి.

అర్హత

రాష్ట్ర స్థాయిలో ఎంతో కీలకంగా భావించే గ్రూప్–1 సర్వీసులకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం ఉంది. అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టులకు కామర్స్ గ్రూప్‌ను అర్హతగా పేర్కొనే అవకాశం ఉంది. విద్యార్హతలు, వయసు తదితర పూర్తి వివరాలు.. జనవరి 1, 2024న ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

గ్రూప్–1 పోస్టులకు మొత్తం మూడంచెల విధానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.అవి..ప్రిలిమినరీ పరీక్ష,మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

మొదటి దశలో ప్రిలిమ్స్

గ్రూప్–1 పోస్టుల ఎంపిక ప్రక్రియలో ముందుగా ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో సాగుతుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కుల జాబితాలో నిలిచిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఒక్కో పోస్టుకు 50 మందిని చొప్పున (1:50 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

240 మార్కులకు ప్రిలిమ్స్

- ప్రిలిమినరీ పరీక్షను రెండు పేపర్లు(పేపర్1, పేపర్ 2)గా 240 మార్కులకు నిర్వహిస్తారు. ప్రిలిమ్స్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మూడు గంటల వ్యవధిలో జరుగుతుంది.
- పేపర్–1 నాలుగు విభాగాల్లో మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు ఉంటుంది.
- హిస్టరీ అండ్ కల్చర్; రాజ్యాంగం, పాలిటీ; సోషల్ జస్టిస్, అంతర్జాతీయ సంబంధాలు; భారత్, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ,జాగ్రఫీల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2 పరీక్ష రెండు భాగాలుగా 120 ప్రశ్నలు –120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్ ఏలో జనరల్ మెంటల్ ఎబిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ అండ్ సైకలాజికల్ ఎబిలిటీస్ 60 మార్కులకు, పార్ట్ బీలో సైన్స్ అండ్ టెక్నాలజీ (30 మార్కులు), ప్రాంతీయం, జాతీయం, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్(30 మార్కులు) 60 మార్కులకు ఉంటాయి.
- నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కులను తగ్గిస్తారు.

రెండో దశ మెయిన్స్ ఇలా

- తొలి దశలో అర్హత సాధించిన వారికి రెండో దశలో మెయిన్ పరీక్ష ఉంటుంది. మెయిన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఏడు పేపర్లలో నిర్వహిస్తారు. ఇందులో రెండు అర్హత పరీక్షలు లాంగ్వేజ్ పేపర్–తెలుగు 150 మార్కులకు, లాంగ్వేజ్ ఇంగ్లిష్ 150 మార్కులకు ఉంటాయి.
- వీటితోపాటు పేపర్–1 జనరల్ ఎస్సే–150 మార్కులకు; పేపర్–2 ఏపీ, భారత చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం–150 మార్కులకు; పేపర్–3 పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా, ఎథిక్స్ –150 మార్కులకు; పేపర్–4 ఎకానమీ, భారత దేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి–150 మార్కులకు; పేపర్–5 సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ అంశాలు–150 మార్కులకు ఉంటాయి. ఈ ఐదు పేపర్లు మొత్తం 750 మార్కులకు జరుగుతాయి. ▪ ప్రతి పేపర్‌కు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.
- తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్లు కేవలం అర్హత పేపర్లు మాత్రమే. వీటిలో పొందిన మార్కులను మెరిట్‌కు పరిగణనలోకి తీసుకోరు. కానీ వీటిలో కనీస ఉత్తీర్ణత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఓసీ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 30% మార్కులు సాధించాలి. అప్పుడే మెయిన్ ఎగ్జామినేషన్‌లోని మిగిలిన అయిదు పేపర్ల మూల్యాంకన చేస్తారు. ఈ అయిదు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా.. చివరి దశ ఇంటర్వ్యూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

తుది దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో తుది దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ. మెయిన్ పరీక్షలోని అయిదు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా.. రిజర్వేషన్లు ఇతర నిబంధనలను అనుసరించి 1:2 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయిస్తారు. మెయిన్ 750 మార్కులు, ఇంటర్వ్యూ 75మార్కులు మొత్తం 825 మార్కులకుగాను అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా.. రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ఖరారు చేస్తారు.

సిలబస్‌పై పట్టుతోనే పరీక్షలో రాణింపు!

గ్రూప్–1 పోస్టులకు తీవ్ర పోటీ ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆగకుండా..ఇప్పటి నుంచే ప్రిపరేషన్‌కు సమాయత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రిపరేషన్ ప్రారంభించే ముందు అభ్యర్థులు సిలబస్ ఆసాంతం అవగాహన చేసుకుని.. వాటికి కల్పిస్తున్న వెయిటేజీని గమనించాలి. దీనికి అనుగుణంగా ప్రిపరేషన్ ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

సమకాలీన అంశాలు, కాన్సెప్ట్‌లు

ప్రిపరేషన్ సమయంలో ఆయా అంశాలను అభ్యసించేటప్పుడు వాటిని సమకాలీన అంశాలతోనూ సమన్వయం చేసుకుంటూ డిస్క్రిప్టివ్ విధానంలో ప్రిపరేషన్ సాగిస్తే.. కోర్ సబ్జెక్ట్ నైపుణ్యంతో పాటు సమకాలీన పరిస్థితుల్లో అన్వయించే నైపుణ్యం కూడా లభిస్తుంది. అభ్యర్థులు ప్రిలిమినరీ సబ్జెక్ట్‌లను, మెయిన్స్ సబ్జెక్ట్‌లతో అనుసంధానం చేసుకుంటూ అభ్యసనం సాగించాలి. దాదాపు 70 శాతం అంశాలు రెండు పరీక్షల్లోనూ ఉన్నాయి. ఈ రెండిటిలో ఉన్న అంశాలకు ఉమ్మడి ప్రిపరేషన్ సాగించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తర్వాత మెయిన్స్‌కు ప్రత్యేకంగా ఉన్న అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి.

డిస్క్రిప్టివ్ అప్రోచ్

గ్రూప్–1 అభ్యర్థులు డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో చదవడం చాలా ముఖ్యం. ప్రిలిమ్స్ దశ నుంచే ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన అంశాలను.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో.. విశ్లేషించుకుంటూ అభ్యసించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు ఇలా అన్ని కోణాల్లో అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ముఖ్యంగా నవరత్నాలు, వాటికింద అమలు చేస్తున్న పథకాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాల ఔపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఇతర ఆర్థిక విధానాలు, వాటి ద్వారా కలిగిన అభివృద్ధిపైనా దృష్టి సారించాలి.

చరిత్ర.. ఆసాంతం

హిస్టరీలో రాష్ట్ర చరిత్రకు సంబంధించి రాష్ట్ర సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలి. జాతీయోద్యమంలో ఆంధ్రదేశ పాత్ర గురించి అవగాహన ఏర్పరచుకోవాలి. ఇదే తీరులో భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరులు గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. అదే విధంగా గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

పాలిటీకి ఇలా

ఈ సబ్జెక్ట్‌లో పట్టు సాధించాలంటే.. రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు (రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజా సేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. వాస్తవానికి దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలు లేనప్పటికీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు కొంత మేలు చేస్తాయి. వీటితోపాటు స్ఫూర్తి దాయక నేతల వివరాలు, వారు పాలించిన తీరు తదితర అంశాలను సేకరించుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా, సివిల్ అండ్ క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి తెలుసుకోవాలి.

ఎకానమీ.. ఎంతో కీలకం

ఎకనామీ విషయంలో ఎంతో విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది. ప్రిపరేషన్ ప్రారంభ దశలో ఎకానమీకి సంబంధించి మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకు గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటి ద్వారా లబ్ధి చేకూరే వర్గాలు, అదే విధంగా జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఇటీవల కాలంలో తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024 జనవరి 1 – 2024 జనవరి 21
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024, మార్చి 17
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	970	274
	71,484	21,457

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,814	▲	52
డోజోన్స్	37,305	▲	57
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,576	▽	73
డాక్స్	16,751	▽	1
షాంఘై	2,943	▽	16
నికాయ్	32,971	▲	304

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.24	106.80
€	యూరో	ఎస్‌బీఐ	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.67	57.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.18	22.00
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

ఇంటి రుణం.. భారం దింపుకుందాం

గృహ రుణం.. రెండేళ్ల క్రితం వరకు ఇల్లు కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా కనిపించిన సాధనం. కేవలం 6.7 శాతం వార్షిక రేటుపై ఇంటి కొనుగోలుకు రుణం లభించింది. కానీ, స్థూల ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక రేటును 2022 మే నుంచి 2.5 శాతం మేర పెంచింది. ఫలితంగా గృహ రుణం రేట్లు 9.5–10 శాతానికి చేరాయి. దీంతో అప్పటికే ఇంటి కోసం రుణం తీసుకున్న వారికి నెలవారీ ఈఎంఐ భారంగా మారింది. 15 ఏళ్ల కనిష్టాలకు చేరిన గృహ రుణ రేట్లు ఒక్కసారిగా భారంగా మారాయి. ఆ తర్వాత ద్రవ్యోల్బణం గరిష్టాల నుంచి కొంత మేర దిగివచ్చింది. అంతర్జాతీయంగా కఠినతర ద్రవ్య విధానం దాదాపు చివరి దశకు చేరింది. దీంతో వడ్డీ రేట్ల పెంపు సైతం ముగింపునకు వచ్చేసిందని విశ్లేషకుల అభిప్రాయం. ఆర్‌బీఐ సైతం రేట్ల యథాతథ స్థితినే కొనసాగిస్తోంది. అయినా కానీ, వడ్డీ రేట్ల తగ్గింపునకు మరికొన్ని త్రైమాసికాలు వేచి చూడాల్సి రావచ్చని భావిస్తున్నారు. దాదాపు అన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రేట్ల పెంపు భారాన్ని రుణ గ్రహీతలకు బదిలీ చేశాయి. ఈ తరుణంలో ఈఎంఐ భారం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాల్లో బ్యాలన్స్‌ను మరో రుణదాతకు బదిలీ చేసుకోవడం ఒకటి. దాని గురించి వివరించే కథనం ఇది...

ఇంటి కోసం రుణం తీసుకున్న వారికి ప్రస్తుత ఈఎంఐ భారంగా అనిపిస్తే, అప్పుడు ఇతర బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వసూలు చేస్తున్న వడ్డీ రేట్లను ఒక్కసారి పరిశీలించాలి. ఇతర సంస్థలతో పోలిస్తే మీ బ్యాంక్ అధిక రేటు వసూలు చేస్తున్నట్టు గుర్తిస్తే కనుక, అప్పుడు దాన్ని తక్కువ రేటుకు ఆఫర్ చేస్తున్న బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. ఇలా మిగిలి ఉన్న రుణాన్ని మరో సంస్థకు బదిలీ చేసుకునే ముందు, ఇందుకు అనుసరించాల్సిన ప్రక్రియ, ఇందుకు అయ్యే చార్జీలు, అసలు బదిలీ చేసుకోవడం వల్ల మిగిలే ప్రయోజనం ఎంత మేర? తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం. ఫ్లోటింగ్ రేటు విధానంలో రేట్లను ఎలా నిర్ణయిస్తారనేది కూడా తెలుసుకోవాలి.

ఈఎంఐ భారంగా మారితే ప్రత్యామ్నాయాలు

- రుణాన్ని బదిలీ చేసుకోవడం ఒక ఆప్షన్
- తక్కువ రేటు రుణానికి మారిపోవాలి
- దీనివల్ల గణనీయంగా ఆదా
- కాల వ్యవధి ఆధారంగా దీనిపై నిర్ణయం

రేట్ల విధానాలు..

గృహ రుణంపై ఫిక్స్‌డ్ (స్థిర), ఫ్లోటింగ్ (అస్థిర) రేట్ల విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్లోటింగ్ రేటు రుణాలు ఆర్‌బీఐ కీలక రేట్ల సవరణకు అనుగుణంగా మార్పులకు లోనవుతుంటాయి. ఫిక్స్‌డ్ రేట్ విధానంలో నిర్ణీత కాలం పాటు రుణంపై ఒకటే రేటు కొనసాగుతుంది. కనుక ఫ్లోటింగ్ రేట్ రుణాలతో పోలిస్తే ఫిక్స్‌డ్ రేట్ రుణాలపై వడ్డీ రేటు 1.5–2 శాతం వరకు అధికంగా ఉంటుంది. ప్రస్తుతం అధిక శాతం గృహ రుణాలు ఫ్లోటింగ్ రేట్ విధానంలోనే ఉంటున్నాయి. ఆర్‌బీఐ 2016లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. బ్యాంక్‌లు లేదా ఎన్‌బీఎఫ్‌సీలకు నిధులపై అయ్యే వ్యయంతోపాటు, జీ–సెక్ ఈల్డ్స్, బ్యాంకింగ్ రంగంలో లిక్విడిటీ తదితర అంశాలు ఈ విధానంలో రేట్లను ప్రభావితం చేస్తాయి. బ్యాంక్ సొంతంగా రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఎంసీఎల్ఆర్ విధానంలో ఉంటుంది. ఎంసీఎల్ఆర్ అంటే క్లుప్తంగా నిధులపై బ్యాంక్‌లకు అయ్యే వ్యయం. దీనికి అదనంగా తనకు కావాల్సిన మార్జిన్‌ను బ్యాంక్ జోడించి రుణాలపై రేటును నిర్ణయిస్తుంది. ఆర్‌బీఐ రేట్లను మార్చినప్పుడు ఎంసీఎల్ఆర్‌లోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, వెంటనే కాదు. సాధారణంగా ఆరు నెలల నుంచి ఏడాది సమయం తీసుకుంటుంది. ఎంసీఎల్ఆర్‌లో ఒక్క రెపో రేటు కాకుండా, ఇతర అంశాలు కూడా రేట్లను ప్రభావితం చేస్తాయి. నిజానికి ఎంసీఎల్ఆర్ విధానం అంత పారదర్శకమైనది కాదు. రిటైల్ రుణ గ్రహీతలు దీన్ని అర్థం చేసుకోలేరు. ఈ లోపాలను అధిగమించేందుకు వీలుగా ఆర్‌బీఐ 2019లో రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (ఆర్ఎల్ఎల్ఆర్)ను ప్రవేశపెట్టింది.

వడ్డీ రేట్లు పెరిగినప్పుడు సాధారణంగా బ్యాంక్‌లు గృహ రుణాలపై ఈఎంఐని పెంచడానికి బదులు, రుణ కాలవ్యవధిని పెంచుతుంటాయి. దాంతో ఈఎంఐలో ఎలాంటి మార్పు ఉండదు. దీంతో ఇబ్బందేమీ లేదన్నట్టు వ్యవహరించరాదు. ప్రస్తుత బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీతో మెరుగైన డీల్ కోసం సంప్రదించాలి. సానుకూల స్పందన రానప్పుడు మిగిలి ఉన్న రుణ బకాయిని మరో బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించాలి. బ్యాలన్స్ బదిలీకి సంబంధించి అర్హత ఉందా? అన్నది తెలుసుకోవాలి. బ్యాలన్స్ బదిలీకి అనుమతించే విషయంలో కొన్ని బ్యాంక్‌లు, పూర్వపు సంస్థ వద్ద కనీసం 24 నెలల పాటు అయినా క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లించిన చరిత్రను అడుగుతున్నాయి. ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు, లేదా స్వాధీనం చేసిన ఇళ్లకు సంబంధించి రుణం బ్యాలన్స్ బదిలీకే బ్యాంక్‌లు ఆసక్తి చూపిస్తున్నాయి. వీటికి అదనంగా వేతనం, క్రెడిట్ స్కోర్ కూడా కీలకమవుతాయి. ముఖ్యంగా మిగిలిన రుణాన్ని, తక్కువ వడ్డీ రేటుకు ఆఫర్ చేస్తున్న మరో సంస్థకు బదిలీ చేసుకోవడం వల్ల కొంత ఆదా చేసుకుందామని భావించే వారు..

పారదర్శక.. రెపో లింక్డ్ లెండింగ్ రేట్



రెపో లింక్డ్ లెండింగ్ రేట్ ఎంతో పారదర్శకమైనది. రెపో రేట్‌కు బ్యాంక్‌లు తమకు కావాల్సిన మార్జిన్‌ను కలిపి రుణాలపై రేట్లను నిర్ణయిస్తాయి. దీంతో రుణ గ్రహీతలు సైతం సులభంగా అర్థం చేసుకోగలరు. రెపో రేటు పెరిగి, తగ్గినప్పుడు తమపై పడే భారం ఎంతన్నది సులభంగా తెలుసుకోగలరు. అంతేకాదు రేట్ల విధానం సులభంగా ఉండడంతో, ఆర్‌బీఐ రెపో రేటును సవరించిన వెంటనే బ్యాంక్‌లు రుణ గ్రహీతలకు దాన్ని బదలాయిస్తాయి. సాధారణంగా ఆర్‌బీఐ రెపో రేటు సవరణ అనంతరం వారం నుంచి నెల రోజుల వ్యవధిలో ఆర్ఎల్ఎల్ఆర్ రుణాల రేట్లు మార్పులకు లోనవుతాయి. రెపో రేటు విధానంలో.. వడ్డీ రేట్లు తగ్గించడం, పెంచడం వేగంగా జరుగుతుంది. కనుక వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో ఆ భారం వెంటనే రుణ గ్రహీతలకు బదలాయింపు అవుతుందని గుర్తు పెట్టుకోవాలి. ఈ విధానంలో బ్యాంక్‌లు సాధారణంగా రెపో రేటుపై 2.5–3 శాతాన్ని తమ మార్జిన్ కింద చార్జ్ చేస్తుంటాయి. ప్రస్తుతం గృహ రుణాలపై బ్యాంక్‌లు 9.5–10 శాతం వసూలు చేస్తున్నాయి. రెపో రేటు 6.5 శాతంపై 3–3.5 శాతం మార్జిన్‌గా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్‌బీఎఫ్‌సీలు అయితే 10.5 శాతం వరకు చార్జ్ చేస్తున్నాయి. అయితే, ఇదే రేటు అందరికీ ప్రామాణికంగా అమలవుతుందని చెప్పలేం. రుణం మొత్తం, కాల వ్యవధి, క్రెడిట్ స్కోర్ తదితర అంశాలు కూడా రేటుపై ప్రభావం చూపిస్తాయి. రేట్ల అస్థిరతలు పెద్ద పట్టింపు కాదంటే, రిటైల్ రుణ గ్రహీతలకు ఎంసీఎల్ఆర్ కంటే ఆర్ఎల్ఎల్ఆర్ రేటు అనుకూలంగా ఉంటుంది.

చార్జీల పట్ల అవగాహన




ఫిక్స్‌డ్ వడ్డీ రేటు విధానంలో రుణం తీసుకున్న వారు, మరో సంస్థకు దాన్ని బదిలీ చేసుకోవడం ఖరీదైన వ్యవహారమే అవుతుంది. ఎందుకంటే ఇప్పటికే రుణం ఇచ్చిన సంస్థ మిగిలి ఉన్న రుణాన్ని బదిలీ చేసేందుకు గాను, ఆ మొత్తంపై 2–4 శాతం వరకు చార్జ్ వసూలు చేయవచ్చు. అదే ఫ్లోటింగ్ రేట్ విధానంలో రుణం తీసుకుని ఉంటే, ఎలాంటి ముందస్తు చెల్లింపుల రుసుములు లేకుండా మిగిలి ఉన్న రుణాన్ని మరో బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీకి బదిలీ చేసుకోవచ్చు. ఎందుకంటే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై ముందస్తు చెల్లింపుల చార్జీలను ఆర్‌బీఐ నిషేధించింది. అయితే రుణాన్ని మరో సంస్థకు బదిలీ చేసుకోవాలంటే రుణ గ్రహీత కొన్ని రకాల చార్జీలు భరించాల్సి వస్తుంది. అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. రుణంపై (బదిలీ చేసుకునే మొత్తం) 0.50 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు కింద చాలా బ్యాంక్‌లు తీసుకుంటున్నాయి. కొన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయడం లేదు. నూతన తరం బ్యాంక్‌లు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు 3 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు తీసుకుంటున్నాయి. కాకపోతే అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒకే మాదిరి చార్జీలు ఉంటాయని అనుకోవద్దు. కనుక ఆయా సంస్థల వెబ్‌సైట్లకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. నేరుగా సంప్రదింపులు చేయడం ద్వారా చార్జీల భారం లేకుండా చూసుకోవచ్చు.

రుణం బదిలీతో ఆదా ఎంత?



అసలు ఎంత ఆదా అవుతుందన్న దానిపై అంచనాకు రావాలి. ఉదాహరణకు రూ.75 లక్షల రుణం, 20 ఏళ్ల కాలానికి మిగిలి ఉందని అనుకుందాం. 9.5 శాతం వడ్డీ రేటు ఆధారంగా దీని ఈఎంఐ రూ.69,910 అవుతుంది. ఈ రుణాన్ని బదిలీ చేసుకుంటే, కొత్త సంస్థ 9.1 శాతం రేటుకు ఆఫర్ చేసిందనుకుంటే, అప్పుడు ఎంతో ఆదా అవుతుంది. కొత్త సంస్థ వద్ద 9.1 శాతం రేటు ప్రకారం ఇదే రుణంపై ఈఎంఐ రూ.67,963 అవుతుంది. 20 ఏళ్ల కాలంలో రూ.4,67,280 ఆదా అవుతుంది. ఇది ఏడు నెలల ఈఎంఐకి సమానం. అంటే రుణం ఏడు నెలల ముందే తీరిపోతుంది. మరో సంస్థకు రుణాన్ని బదిలీ చేసుకోవడం వల్ల మిగిలే ప్రయోజనం ఇలా ఉంటుంది. రుణం తీసుకున్న తర్వాత పెరిగిన ఆదాయం, మెరుగుపడిన క్రెడిట్ స్కోర్, మెరుగైన చెల్లింపుల చరిత్ర ఆధారంగా కొత్త సంస్థ తక్కువ రేటుకు ఆఫర్ చేసే అవకాశాలు ఉంటాయి. వడ్డీ రేటు ఎంత తగ్గితే ఆదా అయ్యే మొత్తం అధికంగా ఉంటుంది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ అయితే ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు తక్కువ రేట్లకు రుణాలను ఆఫర్ చేస్తున్నాయి. 0.25–0.50 శాతం మేర వడ్డీ తక్కువగా ఉండి, రుణ చెల్లింపుల కాలం మరో 15 ఏళ్ల అయినా ఉంటే నిస్సంకోచంగా రుణాన్ని బదిలీ చేసుకోవచ్చు. 2024 మధ్య నుంచి వడ్డీ రేట్లు తగ్గితే, అప్పుడు ఈఎంఐ భారం మరింత దిగొస్తుంది.



రూ. 20,000 వరకు చార్జీలు

రుణ బదిలీలకు సంబంధించి న్యాయపరమైన, సాంకేతిక మదింపు చార్జీలు కూడా భరించాల్సి వస్తుంది. ఇవి రూ.5,000 నుంచి రూ. 20,000 వరకు ఉంటాయి. కొన్ని బ్యాంక్‌లు విడిగా పేర్కొనకుండా, ఈ మొత్తాన్ని ప్రాసెసింగ్ ఫీజులో కలిపేస్తున్నాయి. కనుక చార్జీల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకోవాలి. ఇక మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంవోడీటీ) గురించి కూడా తెలుసుకోవాలి. రుణ గ్రహీత తన ఇంటి డాక్యుమెంట్లను రుణదాతకు స్వాధీనం చేయడం. రుణం ఇచ్చే సంస్థ తన పేరిట ఆ ప్రాపర్టీని రిజిస్ట్రేషన్ చేయించుకుంటుంది. ఇందుకు అయ్యే చార్జీలను రుణ గ్రహీత భరించాల్సి వస్తుంది. ఈ చార్జీలు రుణంలో 0.1–0.2 శాతంగా ఉంటాయి. ఇందులో ఎలాంటి తగ్గింపు రాదు. సుమారు రూ.75 లక్షల గృహ రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేసుకుంటున్నారని అనుకుంటే, ఇందుకోసం పలు రకాల చార్జీల రూపంలో రూ.62,500 వరకు కోల్పోవాల్సి వస్తుంది. లీగల్ ఫీజులు, ప్రాసెసింగ్ ఫీజుల్లో తగ్గింపు పొందడం ద్వారా ఈ భారాన్ని వీలైనంత తగ్గించుకోవచ్చు.



బదిలీ చేస్తే అయ్యే వ్యయాలు

బదిలీ రుణం	రూ.75 లక్షలు
ప్రాసెసింగ్ ఫీజు	రుణంపై 0.3–3% వరకు
లీగల్ ఫీజు	రూ.5,000–20,000
ఎంవోటీడీ చార్జీలు	రుణంపై 0.1–0.2 శాతం
ఫ్రాంకింగ్ చార్జీలు	రుణంపై 0.1–0.2 శాతం

సంహీ హోటల్స్ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 174
టార్గెట్: రూ. 290



ఎందుకంటే: ఆతిథ్య రంగ కంపెనీ సంహీ హోటల్స్ పేరున్న బ్రాండెడ్ హోటళ్ల సంస్థ. అసెట్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌తోపాటు.. దేశీయంగా అత్యధిక ఇన్వెంటరీ గదులను కలిగి ఉంది. నిర్వహణలోని 31 హోటళ్ల ద్వారా 4,801 గదుల(సొంతం, లీజ్ కలిపి) పోర్ట్‌ఫోలియో సంస్థ సొంతం. వీటిలో వినియోగ ప్రధానంగా నిలిచే ప్రాంతాలలో 13 హోటళ్లున్నాయి. ఇతర సంస్థల కొనుగోలు, లాభాల బాట పట్టించే బిజినెస్ మోడల్ కారణంగా కార్యకలాపాలు ప్రారంభమైన 2011 నుంచీ ఏటా సగటున 369 గదులను జత చేసుకుంటూ వస్తోంది. తద్వారా వేగంగా వృద్ధి చెందుతున్న ఆతిథ్య రంగ కంపెనీగా నిలుస్తోంది. ఈ బాటలో 2028కల్లా 920 గదులను ఆధునీకరించడం, రీబ్రాండింగ్ చేయడంసహా.. 617 రూములను జత చేసుకోనుంది. ప్రధానంగా కొనుగోళ్లకు సరిపోయే హోటళ్లను గుర్తించడం, సొంతం చేసుకోవడం, నష్టాలలో నడుస్తున్న వీటిని లాభాల బాట పట్టించడం వంటి అంశాలలో సంస్థకున్న సామర్థ్యాలు అదనపు ఆకర్షణగా చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ ధరలతోకూడిన హోటళ్లను కలిగి ఉండటం సంస్థ బలిమికాగా.. లాభదాయక కార్యకలాపాల నిర్వహణా దక్షతతో పటిష్ట ఫలితాలు సాధిస్తోంది. అప్‌సైకిల్‌లో ఆస్తులను సమకూర్చుకుంటూ, నికర రుణ భారాన్ని తగ్గించుకుంటోంది. 2023 మార్చితో పోలిస్తే నికర రుణాలు 35 శాతం దిగివచ్చి రూ. 1,840 కోట్లకు చేరాయి. వెరసి త్రైమాసిక ఫైనాన్స్ వ్యయాలు 57 శాతం క్షీణించి రూ. 60 కోట్లకు పరిమితమయ్యాయి. వార్షిక ప్రాతిపదికన మూడేళ్ల(2023–26)లో ఆదాయం 13 శాతం, నిర్వహణ లాభం 24 శాతం చొప్పున వృద్ధి చూపగలవని అంచనా. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికావడంతో భవిష్యత్ ప్రణాళికలను, పనితీరును నిశితంగా పరిశీలించవలసి ఉంటుంది.

సన్‌టెక్ రియల్టీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 477
టార్గెట్: రూ. 640



ఎందుకంటే: రియల్టీ రంగ కంపెనీ సన్‌టెక్ రియల్టీ ప్రధానంగా ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం(ఎంఎంఆర్)లో పట్టు కలిగి ఉంది. ఇది దేశంలోనే అతిపెద్ద మైక్రో మార్కెట్‌కాగా.. కరోనా మహమ్మారికంటే ముందుస్థాయితో పోలిస్తే ఎంఎంఆర్ 70 శాతం అధిక అమ్మకాలను సాధిస్తోంది. మల్టీ మైక్రో మార్కెట్‌లో కార్యకలాపాలు విస్తరించిన రియల్టీ డెవలపర్‌గా సన్‌టెక్ వివిధ ధరలలో లగ్జరీ(ప్రీమియం) ప్రాజెక్టులను చేపడుతోంది. ప్రాజెక్టుల నిర్మాణం, పూర్తి, విక్రయం తదితర అంశాలలో కంపెనీకున్న సామర్థ్యాలు, ట్రాక్ రికార్డ్ కారణంగా రియల్టీ రంగంలో కనిపిస్తున్న పటిష్ట డిమాండు కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది. కంపెనీ సొంతం చేసుకున్న ఎనిమిది ప్రాజెక్టులలో ప్రారంభించిన మూడు కొత్త ప్రాజెక్టులు 2018–23 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 22 శాతం ముందస్తు అమ్మకాలను సాధించిపెట్టాయి. భవిష్యత్‌లో అంటే 2023–26 కాలంలో 25 శాతం వృద్ధిని అందుకునే అవకాశముంది. వెరసి రూ. 3,100 కోట్లను సాధించే వీలుంది. ఇటీవల 2–3 కొత్త ప్రాజెక్టులను చేపట్టే సన్నాహాల్లో ఉంది. అత్యంత తక్కువ రుణ, ఈక్విటీ(0.1) నిష్పత్తితో పటిష్ట బ్యాలన్స్‌షీట్‌ను కలిగిన కంపెనీగా నిలుస్తోంది. వీటికి జతగా అత్యుత్తమ క్యాష్ ఫ్లోను సాధిస్తోంది. 2023–26 కాలంలో రూ. 1,600 కోట్లు అందుకుంది. ఇటీవల ఐఎఫ్‌సీతో జట్టుకట్టడం ద్వారా భవిష్యత్ వృద్ధికి బాటలు వేసుకుంది. ఐఎఫ్‌సీ ప్లాట్‌ఫామ్ ద్వారా జత చేసుకోనున్న భవిష్యత్ ప్రాజెక్టులతో రూ. 1,400 కోట్ల విలువను జమ చేసుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం. అయితే కొత్త ప్రాజెక్టులను ప్రవేశపెట్టడంలో జాప్యం, అమ్మకాలు మందగించడం వంటి అంశాలు మానిటైజేషన్ ప్రక్రియను దెబ్బతీసే అవకాశముంది. వీటిని కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

జోస్ ఆలుక్కాస్ 'వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్'



కోయంబత్తూర్: జోస్ ఆలుక్కాస్ 'వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్' ప్రారంభించింది. ఉత్సవ ఆఫర్లలో భాగంగా రూ.50,000 లేదా అంతకు మించి విలువ చేసే వజ్రాభరణాల కొనుగోలుపై ఒక బంగారం నాణం ఉచితంగా పొందవచ్చు. అదనంగా వజ్రాభరణాలపై 25% వరకు, ప్లాటినంపై 7% తగ్గింపు లభిస్తుంది. ''వింటర్ డిలైట్ డైమండ్ ఫెస్టివల్‌లో అద్భుతమైన కొత్త వజ్రాల సేకరణలు ఆవిష్కరించాము. ఇటీవల ప్రవేశపెట్టిన ప్రీమియం డైమండ్ కలెక్షన్స్ 'నిత్యారా' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని షోరూంల్లో ఫెస్టివల్ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

సంపద సృష్టిలో రిలయన్స్ టాప్

ఇన్వెస్టర్ల సంపద సృష్టికి గత ఐదేళ్ల కాలం (2018–23)లో డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్ చెయిర్‌ను అలంకరించింది. ఈ బాటలో సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ రెండో ర్యాంకులో నిలవగా.. లాయిడ్స్ మెటల్స్, అదానీ గ్రూప్ సైతం ఇదే బాటలో నడవడం గమనార్హం! వివరాలు చూద్దాం..

- 2018–23 మధ్య రూ. 9,63,800 కోట్లు
- తదుపరి రూ. 6,77,400 కోట్లతో టీసీఎస్
- లాయిడ్స్ మెటల్, అదానీ గ్రూప్ సైతం..



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్ల సంపదగా పేర్కొనే మార్కెట్ విలువ(క్యాపిటలైజేషన్)లో పలు దిగ్గజాలు గత ఐదేళ్లలో జోరు చూపాయి. పారిశ్రామిక దిగ్గజం ముకేష్ అంబానీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) అత్యధికంగా రూ. 9,63,800 కోట్ల మార్కెట్ క్యాప్‌ను జమ చేసుకుంది. నంబర్‌వన్ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) రూ. 6,77,400 కోట్ల విలువను జత చేసుకోవడం ద్వారా తదుపరి ర్యాంకును సాధించింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక ప్రకారం సంపద సృష్టిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఆల్‌రౌండ్ ప్రతిభను కనబరిచింది. స్టాక్ మార్కెట్లో వివిధ కంపెనీల పనితీరును పరిశీలించిన మోతీలాల్ ఓస్వాల్ ఆర్ఐఎల్ వరుసగా ఐదో ఏడాదిలోనూ టాప్‌లో నిలిచినట్లు పేర్కొంది.


ఐసీఐసీఐ, ఎయిర్‌టెల్

2018–23 కాలంలో ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ మార్కెట్ క్యాప్ రూ. 4,15,500 కోట్లమేర బలపడగా.. ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ విలువ రూ. 3,61,800 కోట్లు పుంజుకుంది. మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ రూ. 2,80,800 కోట్లను జత చేసుకుంది. అయితే లాయిడ్స్ మెటల్స్ అత్యంత వేగంగా 79 శాతం సంపదను పెంచుకున్న కంపెనీగా ఆవిర్భవించింది. ఈ బాటలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ 78 శాతం వార్షిక వృద్ధితో ద్వితీయ ర్యాంకును సాధించింది. ఈ కాలంలో మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్‌ను మించుతూ అత్యంత నిలకడగా పురోగమించిన కంపెనీగా క్యాప్రి గ్లోబల్ నిలిచింది. ఏడాదికి 50 శాతం చొప్పున లాభపడింది.

రూ. 10 లక్షలు.. ఐదేళ్లలో రూ.కోటి

గత ఐదేళ్లుగా అత్యున్నత ర్యాలీ చేసిన టాప్–10 కంపెనీలలో 2018లో రూ. 10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. 2023కల్లా ఈ పెట్టుబడి రూ. కోటికి చేరి ఉండేదని నివేదిక పేర్కొంది.

అస్థిరతలను అధిగమించడం ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్ పథకాల మధ్య పెట్టుబడులను ఎటువంటి సందర్భాల్లో మార్చుకోవాలి?
– సుఖ్‌దేవ్ భాటియా

మీరు ఇన్వెస్ట్ చేస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాలను రెండు రకాల కారణాల వల్ల మార్చాల్సి రావచ్చు. మొదట మీ లక్ష్యాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు పెట్టుబడులను వాటికి అనుగుణంగా సవరించుకోవాల్సి ఉంటుంది. లక్ష్యాలను చేరుకున్నప్పుడు కూడా ఈ అవసరం ఏర్పడుతుంది. ఉదాహరణకు మీరు రిటైర్మెంట్ లేదా పిల్లల ఉన్నతవిద్య కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుంటే.. నిర్ణీత కాలవ్యవధికి ముందే మీకు కావాల్సిన మొత్తం సమకూరితే ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఏదైనా ఒక పథకంలో కొన్ని కారణాలను చూసి ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. అవన్నీ మారిపోయినట్టయితే పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. ఫండ్ మేనేజర్ మారిపోవడం పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి సరైన కారణం కాబోదు. గతంలో మంచి రాబడులను ఇచ్చిన పథకం కొత్త ఫండ్ మేనేజర్ నిర్వహణలో అంత మంచి పనితీరు చూపించకపోతే అప్పుడు వేరే పథకానికి మారిపోయే ఆలోచన చేయవచ్చు. అలాగే, నిలకడగా మంచి రాబడులను ఇస్తుందన్న కారణంతో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. మీరు ఆశించిన విధంగా పనితీరు లేకపోయినా దాని నుంచి తప్పుకోవచ్చు.

ఈక్విటీ మార్కెట్లలో అస్థిర పరిస్థితులను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– శ్రవణ్

ఈక్విటీలు అంతర్గతంగా ఆటుపోట్లతో ఉంటాయి. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. కాకపోతే ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోవడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమల్లో పెట్టాలి. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో మార్కెట్లలో చేసిన పెట్టుబడులపై ఆధారపడకూడదు. ఇందుకోసం అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల కాలం వరకు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ విధమైన చర్యలు అమలు చేయాలి. అలాగే, క్రమం తప్పకుండా మార్కెట్లలో సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల పరిస్థితుల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో దిద్దుబాట్లు మంచి పెట్టుబడుల అవకాశాలు అవుతాయి. తక్కువ రేట్లకే కొనుగోళ్లు చేసుకోవచ్చు. ప్రతికూల సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను సమకూర్చుకోవచ్చు. మార్కెట్లలో దిద్దుబాట్లకు భయపడి, మరింత పడిపోతాయేమోనన్న ఆందోళనతో పెట్టుబడి పెట్టకుండా ఉంటే, మంచి అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

రిలయన్స్ జనరల్ 'హెల్త్ గ్లోబల్' ప్లాన్

ముంబై: రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ 'రిలయన్స్ హెల్త్ గ్లోబల్' పేరుతో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని విడుదల చేసింది. భారతీయులు దేశీయంగా, అంతర్జాతీయంగా వైద్య సేవలు పొందేందుకు వీలుగా ఈ పాలసీని రూపొందించినట్టు సంస్థ ప్రకటించింది. కేన్సర్, బైపాస్ సర్జరీ తదితర క్లిష్టమైన వ్యాధులకు విదేశాల్లోనూ చికిత్స తీసుకునే సమగ్ర కవరేజీతో కూడిన పాలసీ ఇదని, దేశంలో అపరిమిత సమ్ ఇన్సూర్డ్ లభిస్తుందని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేశ్ జైన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

18-12-2023	
విశాఖ	601–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	582–00
విజయవాడ	582–00
17-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	572–00
వరంగల్	574–00

‘డ్రగ్ ఫ్రీ తెలంగాణ’కు టీఎస్–నాబ్ కీలకం

- సమర్థులైన సిబ్బందికి ప్రోత్సాహకాలు, పదోన్నతులు
- సీఎంతో జరిగిన భేటీ వివరాలు వెల్లడించిన సందీప్ శాండిల్య



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గత సోమవారం మాదకద్రవ్యాల కట్టడిపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన అప్పటి కొత్వాల్, ఇప్పటి తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీఎస్–నాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య దాదాపు రెండున్నర గంటల ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. ‘డ్రగ్ ఫ్రీ తెలంగాణ’సాధించడంలో టీఎస్–నాబ్ కీలకమని, ఇందులో పనిచేస్తున్న సమర్థులైన అధికారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలతో పాటు పదోన్నతులు ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు ఆయన వివరించారు. ప్రజెంటేషన్‌లో సందీప్ శాండిల్య పేర్కొన్న అంశాలు... మానవ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితరాల్లో టీఎస్–నాబ్ డైరెక్టర్‌కు పరిమితులు లేకుండా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తరహా సదుపాయాలు ఉండాలి. టీఎస్–నాబ్ సిబ్బంది, అధికారులకు ఆ రెండు విభాగాల తరహాలో అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు తదితర సౌకర్యాలు అవసరం. విద్యా సంస్థలు, సినిమా రంగం, ఐటీ పరిశ్రమ, బార్లు, పబ్‌లు, రేవ్ పార్టీలు, రిసార్ట్‌లపై టీఎస్–నాబ్ ప్రధానంగా దృష్టి పెట్టనుంది. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు (ఏడీసీ) ఏర్పాటు కావాలి. ఈ కమిటీలు తాము తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలి. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంరక్షకులు డ్రగ్ దుర్వినియోగానికి సంబంధించిన ‘టెల్ టేల్’అంశాలను వివరించాలి. మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం తెలిస్తే, 8712671111 నంబర్ లేదా ఈ–మెయిల్ ఐడీ tsnab-hyd@tspolice.gov.in ద్వారా పోలీసుల దృష్టికి తేవాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి రివార్డులు ఇస్తారు. యాజమాన్యాలకు విద్యా సంస్థల్లో డ్రగ్స్ వినియోగంపై తనిఖీలు చేసే బాధ్యత ఉంది. దీన్ని విస్మరిస్తే వారిపైనా చర్యలు ఉంటాయి. టీఎస్–నాబ్ డ్రగ్స్ టెస్టింగ్ కిట్లను సమకూర్చుకుంటుంది. ప్రస్తుతం మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పట్టుకోవడానికి బ్రీత్ ఎనలైజర్లు వాడుతున్నారు. త్వరలో డ్రగ్స్ వినియోగదాలను గుర్తించడానికీ ఇలాంటి పరికరాలు సమకూర్చుకోనున్నారు.

సాయుధ దళాలు.. వినూత్నంగా ఉండాలి

కాలానుగుణంగా కొత్త ఆవిష్కరణలు ఎంతో అవసరం..

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన 213 మంది ఫ్లైట్ కేడెట్లు..

సాక్షి, హైదరాబాద్: సాయుధ దళాలలో సంప్రదాయ పద్ధతులకు తగిన ప్రాధాన్యం ఇస్తూనే.. కాలానుగుణంగా కొత్త ఆవిష్కరణలు తేవాల్సిన అవసరం ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. కొత్త ఆలోచనలు చేయకుండా చాలా కాలం ఒకే తరహా సంప్రదాయాలను అనుసరిస్తే వ్యవస్థలో జడత్వం వస్తుందని అభిప్రాయపడ్డారు. యువ అధికారులు తమలో నూతనత్వానికి, వినూత్న ఆలోచనలకు ఎప్పటికప్పుడు పదునుపెట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ శివార్లలోని దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (CGP) జరిగింది. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న 213 ఫ్లైట్ కేడెట్లు (వీరిలో 25 మంది మహిళలు) పాల్గొన్నారు.



కేడెట్లను పరిచయం చేసుకుంటున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

గౌరవ వందనం స్వీకరించి..

పరేడ్‌కు సమీక్ష అధికారిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొని యువ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. యువ కేడెట్లు భారత వాయుసేనలోని వివిధ విభాగాల్లో విధుల్లోకి చేరడానికి సూచికగా వారందరికీ అధికారిక హోదా కల్పిస్తూ రాష్ట్రపతి కమిషన్ (అధికారిక బ్యాడ్జ్‌లను)ను ప్రదానం చేశారు. తర్వాత రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు. ‘‘నిరంతరం అభివృద్ధి చెందుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయాలు, ఆవిష్కరణల మధ్య సమతుల్యత సాధించండి. సంప్రదాయాన్ని మాత్రమే పాటిస్తే.. మనం ఎండిపోయిన సరస్సులా మారిపోతాం. మనం ప్రవహించే నదిలా ఉండాలి. ఇందుకు సంప్రదాయంతో పాటు కొత్తదనాన్ని తీసుకురావాలి. వాయుసేన అధికారులుగా మీరు ఆకాశంలో ఎగురుతూ ఉండండి. ఎక్కు వ ఎత్తును తాకండి, కానీ నేలతో మీ సంబంధాన్ని కొనసాగించండి’’అని పిలుపునిచ్చారు. అకాడమీలో భారత వాయుసేనకు చెందిన అధికారులతోపాటు నౌకాదళానికి చెందిన ఎనిమిది మంది అధికారులు, కోస్ట్ గార్డ్ (తీర రక్షక దళం) నుంచి 9 మంది, స్నేహపూర్వక దేశమైన వియత్నాం నుంచి ఇద్దరు అధికారులు కూడా ఫ్లయింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నుంచి అవార్డులు అందుకున్నారు. శిక్షణలో టాపర్‌గా నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అతుల్ ప్రకాశ్ రాష్ట్రపతి ఫలకాన్ని చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ స్వోర్డ్ ఆఫ్ హానర్‌ను రాజ్‌నాథ్ చేతులమీదుగా అందుకున్నారు. గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లలో మెరిట్‌లో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అమరీందర్ జీత్ సింగ్‌కు రాష్ట్రపతి ఫలకం లభించింది. అంతకుముందు ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, యువ కేడెట్లతో ప్రమాణం చేయించారు.

ఆకట్టుకున్న కవాతు

శిక్షణలో ప్రథమస్థానంలో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ అతుల్ ప్రకాశ్ ఆదివారం నాటి కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా యువ ఫ్లయింగ్ కేడెట్లు చేసిన కవాతు ఆకట్టుకుంది. పరేడ్ అనంతరం భారత వాయుసేన నిర్వహించిన వైమానిక ప్రదర్శన అలరించింది. సారంగ్ హెలికాప్టర్ బృందం, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృంద విన్యాసాలు, సుఖోయ్–30 ఎంకేఐ గగనతల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ అధికారులతోపాటు యువ ఫ్లయింగ్ ఆఫీసర్ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

‘గగన’ విజయం

ఫ్లైట్ కేడెట్ల సక్సెస్ స్టోరీ..

సాక్షి, హైదరాబాద్: కలలు కన్నారు.. ఆ కలను నిజం చేసుకునేందుకు కష్టపడ్డారు.. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుంటూ గగనతలంలో విజయబావుటా ఎగురవేశారు ఈ యువ ఫ్లయింగ్ కేడెట్లు. ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం అయినా.. అంతిమ లక్ష్యం మాత్రం భరతమాత సేవలో తాము ఉండాలన్నదే. ఆదివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొని భారత వాయుసేనలోని వివిధ విభాగాల్లోకి అడుగుపెట్టిన సందర్భంగా యువ అధికారులు ‘సాక్షి’తో తమ అభిప్రాయాలు ఇలా పంచుకున్నారు.

దేశ సేవలో నేను మూడో తరం..



దేశ సేవలో మా కుటుంబ నుంచి మూడో తరం అధికారిగా నేను ఎయిర్‌ఫోర్స్‌లో చేరడం ఎంతో సంతోషంగా ఉంది. మా తాతగారు పోలీస్ అఫీసర్‌గా చేశారు. మా నాన్న కర్నల్ రాజేశ్ రాజస్థాన్‌లో పనిచేస్తున్నారు. నేను ఇప్పుడు ఎయిర్‌ఫోర్స్‌లో నావిగేషన్ బ్రాంచ్‌లో సెలక్ట్ అయ్యాను. వెపన్ సిస్టం ఆపరేటర్‌గా నాకు బాధ్యతలు ఇవ్వనున్నారు. ఇది ఎంతో చాలెంజింగ్ జాబ్. శిక్షణ సమయంలో ఎన్నో కఠిన పరిస్థితులను దాటిన తర్వాత నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎలాంటి బాధ్యత అయినా నిర్వర్తించగలనన్న నమ్మకం పెరిగింది. మా స్వస్థలం జైపూర్. నేను బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టం అమేథీలో చేశాను.

– ఫ్లయింగ్ కేడెట్ థాన్యాసింగ్, జైపూర్

నాన్నే నాకు స్ఫూర్తి...



మాది వికారాబాద్ జిల్లా చీమల్‌దరి గ్రామం. నాన్న పేరు శేఖర్. ప్రైవేటు ఉద్యోగి, అమ్మ బాలమణి టైలర్. చిన్నప్పటి నుంచి నాన్న స్ఫూర్తితోనే నేను డిఫెన్స్ వైపు రాగలిగాను. కార్గిల్ యుద్ధంలో సూర్యకిరణ్ పైలెట్ బృందం ఎంతో కీలకంగా పనిచేసిందన్న వార్తలను చూసి మా నాన్న నాకు సూర్యకిరణ్ అని పేరు పెట్టారు. చిన్నప్పటి నుంచే నన్ను డిఫెన్స్‌కు వెళ్లేలా ప్రోత్సహించారు. అలా నేను ఏడో తరగతిలో డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్‌కు ప్రవేశ పరీక్ష రాసి 8వ తరగతిలో చేరాను. అందులో రాష్ట్రానికి ఒక్క సీటు మాత్రమే కేటాయిస్తారు. అంత పోటీలోనూ నేను సీటు సాధించాను. అక్కడే ఇంటర్మీడియెట్ వరకు చదివాను. ఆ తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీలో రెండేళ్లు శిక్షణ తీసుకున్న తర్వాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి సెలక్ట్ అయ్యాను.

– సూర్యకిరణ్, చీమల్‌దరి, వికారాబాద్ జిల్లా

భారత సైన్యంలో చేరడం నా కల..



నా పేరు లతా కౌషిక్. మాది హరియాణా రాష్ట్రంలోని జజ్జర్ జిల్లా దుబల్‌దాన్ గ్రామం. మానాన్న రైతు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలోని మిరండా కాలేజీలో బీఎస్సీ హానర్స్, మ్యాథ్స్ చదివాను. డిఫెన్స్ ఫోర్స్‌లో చేరడం ద్వారా దేశానికి, ప్రజల రక్షణకు పనిచేయవచ్చని నా కోరిక. ఆడపిల్ల డిఫెన్స్‌లోకి ఎందుకు అని ఏనాడు మా ఇంట్లో వాళ్లు అనలేదు. మా నాన్నతో సహా కుటుంబం అంతా నన్ను ప్రోత్సహించడంతోనే నేను ఎయిర్‌ఫోర్స్‌కి వచ్చాను. లక్ష్యం స్పష్టంగా ఉంటే ఏదీ మనల్ని అడ్డుకోలేదు. అన్ని పరిస్థితులు కలిసి వస్తాయి.

– లతా కౌషిక్, ఫ్లయింగ్ ఆఫీసర్, హరియాణా

ఎప్పుడూ ఫ్లైట్ ఎక్కని నేను ఫైటర్ పైలట్ అయ్యాను..



నాపేరు జోసెఫ్. నేను ఒక్కసారి కూడా ఫ్లైట్ ఎక్కలేదు. ఇప్పుడు ఏకంగా ఫైటర్ పైలెట్ కావడం సంతోషంగా ఉంది. మా సొంత ప్రాంతం గుంటూరు. నేను టెన్త్ వరకు గుంటూరులో చదివాను. ఎయిర్‌ఫోర్స్‌కి రావాలని అనుకోలేదు. ఇంటర్మీడియెట్ తర్వాత ఎన్‌డీఏ గురించి తెలుసుకుని ఈ కెరీర్‌ని ఎంచుకున్నాను. మొదటి ప్రయత్నంలో ఫెయిల్ అయ్యాను. తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీకి వెళ్లగలిగాను. అక్కడ నుంచి భారత వాయుసేనలో సెలక్ట్ అయ్యాను. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయికి చేరాను. పేరెంట్స్ సపోర్ట్ లేకుండా పిల్లలు ఏదీ సాధించలేరు. తల్లిదండ్రులు పూర్తిగా సహకరిస్తేనే పిల్లలు వారి కలలు నిజం చేసుకోగలుగుతారు.

– జోసెఫ్, ఫైటర్ పైలెట్, గుంటూరు

భారత వాయుసేనలో నూతన విభాగం

2024 జనవరి నుంచి వెపన్ సిస్టం బ్రాంచి శిక్షణ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనలో అత్యంత కీలకంగా మారనున్న నూతన విభాగం వెపన్ సిస్టం బ్రాంచి అధికారులకు శిక్షణ వచ్చే జనవరిలో ప్రారంభం కానుంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత భారత వాయుసేనలో ప్రారంభిస్తున్న తొలి ప్రత్యేక విభాగం ఇదే కావడం గమనార్హం. 2022లో చండీగఢ్‌లో నిర్వహించిన ఎయిర్‌ఫోర్స్ డే వేడుకల్లో భాగంగా ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఈ నూతన విభాగం ఏర్పాటు గురించి ప్రస్తావించారు. కాగా, వెపన్‌సిస్టం బ్రాంచి అధికారుల శిక్షణను దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 2024 జనవరిలో ప్రారంభించనున్నట్టు వాయుసేన ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ శిక్షణ 2024 డిసెంబర్‌లో ముగుస్తుందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తు యుద్ధ అవసరాలకు అనుగుణంగా మిస్సైల్స్, డ్రోన్లు, స్పేస్ బేస్డ్ ఆయుధాలను నియంత్రించడంలో ఈ వెపన్‌సిస్టం బ్రాంచి కీలకంగా మారనుంది. ఈ బ్రాంచి అధికారులు అందుబాటులోకి వస్తే భారత వాయుసేన మరింత శక్తివంతంగా మారుతుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మొదటి వెపన్ సిస్టం బ్రాంచిలో మొత్తం 33 మంది అధికారులకు శిక్షణ ఇచ్చేలా వాయుసేన కసరత్తు ముమ్మరం చేసింది.

బీఈఈ మీడియా సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ) సంస్థ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారుగా అస్సూరి చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ఉత్తర్వులు జారీచేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాల ద్వారా ఇంధన పొదుపు, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించే బాధ్యతలను ఆయనకు అప్పగించారు. చంద్రశేఖర్‌రెడ్డి ఏపీ ట్రాన్స్‌కోలోని ప్రజాసంబంధాల విభాగంలో దీర్ఘకాలంగా పనిచేసి రిటైర్ అయ్యారు.



టెన్షన్!

ఎస్సెస్సీ విద్యార్థులపై స్పెషల్ నజర్

ప్రభుత్వ బడుల్లో 100 శాతం ఉత్తీర్ణతకు చర్యలు

- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- హైదరాబాద్ జిల్లాలో గత ఏడాది ఫలితాలు నిరాశాజనకం
- అటువంటి పరిస్థితి రాకూడదని విద్యాశాఖ కార్యాచరణ

పదో తరగతిపై విద్యా శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణకు దిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు సిద్ధమైంది. ఇప్పటికే విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేసింది. ఈ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి చేసి వచ్చే నెల నుంచి రివిజన్ ప్రక్రియను కొనసాగించేలా అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. ఆ దిశగా అడుగులుపడే అవకాశాలు మాత్రం కనిపించడం లేదు.

–సాక్షి, సిటీబ్యూరో

వెంటాడుతున్న టీచర్ల కొరత

సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరంలోని సర్కారు బడులను సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతోంది. పదవీ విరమణ చేసిన టీచర్ల స్థానంలో కొత్తవారి భర్తీ లేక ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. సబ్జెక్టు టీచర్లతో పాటు భాషా పండితుల పోస్టులు కూడా ఖాళీగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. కరోనా నేపథ్యంలో వరుసగా రెండేళ్ల పాటు ప్రభుత్వ నిర్ణయంతో పరీక్షలు లేకుండా విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారు. గతేడాది సబ్జెక్టు టీచర్లు లేకుండానే విద్యా సంవత్సరం గడిచిపోయింది. ఫలితంగా చాలా మంది విద్యార్థులు పలు సబ్జెక్టులు తప్పారు. ఈ సంవత్సరం కూడా టీచర్ల భర్తీ ఊసే లేకుండాపోయింది.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్ జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల పరిస్థితి అధ్వానంగా మారింది. కేవలం 72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 7,244 మంది విద్యార్థుల్లో సుమారు 2,009 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. నాంపల్లి, బహదూర్‌పురా, చార్మినార్, బండ్లగూడ, సికింద్రాబాద్ మండలాల్లోని బడుల్లో 63 శాతం మించి ఉత్తీర్ణత లేకపోగా, మారేడుపల్లి, హిమాయత్‌నగర్, గోల్కొండ, ముషీరాబాద్ మండలాల్లో 75 శాతం మించి ఉత్తీర్ణత నమోదు కాలేదు. కేవలం తొమ్మిది సర్కారు బడుల్లోనే వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సబ్జెక్టుల వారీగా ఫలితాలను పరిశీలిస్తే గణిత శాస్త్రంలో 9,425, సైన్స్‌లో 6,321, ఇంగ్లిష్‌లో 1,129, సాంఘిక శాస్త్రంలో 1,021మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇక ప్రథమ, ద్వితీయ భాషల్లోనూ కొందరు విద్యార్థులు పాస్ కాలేదు. ప్రథమ భాష తెలుగులో 1,331, హిందీలో 845, ఉర్దూలో 685, ద్వితీయ భాష తెలుగులో 1,390, హిందీలో 117, మంది ఉత్తీర్ణత సాధించలేకపోయినట్లు విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

తగ్గిన సామర్థ్యాలు..

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తగ్గడంతో పాటు సబ్జెక్టులపై కనీస పట్టు లేకుండా పోయింది. నిపుణుల కొరతతో ప్రధాన సబ్జెక్టుల్లో పాఠ్యాంశాల బోధన కూడా సరిగా సాగడం లేదు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులతోనే ప్రధానోపాధ్యాయులు బోధన కొనసాగించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడం సమస్యగా తయారైంది. ఈ విషయాన్ని విద్యా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ఆ సబ్జెక్టులపై స్పెషల్ ఫోకస్..

పదో తరగతిలో ఎక్కువగా ఫెయిలయ్యే సబ్జెక్టులపై ఫోకస్ పెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. పాఠశాల పని దినాల్లో ఉదయం వేళల్లో బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వారానికి దాదాపు 12 క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదు క్లాసులు సామాన్య శాస్త్రం, మూడు క్లాసులు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్టులు బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఫోన్ చేసి.. నిద్ర లేపాలని..

పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు విద్యా శాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది.

అర్ధరాత్రి దారి దోపిడి

స్కూటీపై వచ్చి..లారీని అడ్డగించి రూ.1.35 లక్షలు ఎత్తుకెళ్లిన వైనం

శంషాబాద్ రూరల్: అర్ధరాత్రి రహదారిపై డీసీఎం లారీని అడ్డగించి వ్యాపారి వద్ద ఉన్న రూ.1,35,000 నగదును దుండుగుల దోచుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కిష్టగిరికి చెందిన రాములు, ప్రకాష్ , మరో ఇద్దరు కలిసి గొర్రెల వ్యాపారం చేస్తుంటారు. శనివారం పెబ్బేరులోని సంతలో గొర్రెలను కొనుగోలు చేశారు. కిష్టగిరి వాసి రమేష్‌కు చెందిన మినీ డీసీఎంలో ఈ గొర్రెలను తీసుకుని వరంగల్ వెళ్లి విక్రయించారు. అదే రోజు రాత్రి వీరు తిరుగు ప్రయాణం అయ్యారు. ఔటర్‌పై వస్తూ మార్గ మధ్యలో తుక్కుగూడ వద్ద ప్రకాష్ వాహనం నుంచి దిగి బంధువుల వద్దకు వెళ్లాడు. వాహనంలో రమేష్‌తో పాటు రాములు ఉన్నారు. వీరు మండలంలోని పెద్దగోల్కొండ టోల్ గేటు నుంచి పీ–వన్ రోడ్డు మీదుగా వెళ్తున్నారు. గొల్లూరు చౌరస్తా వద్దకు రాగానే అకస్మాత్తుగా ముగ్గురు దుండగులు స్కూటీపై వచ్చి వాహనాన్ని అడ్డగించారు. డీసీఎంలో గంజాయి ఉందేమో తనిఖీ చేయాలంటూ హిందీలో మాట్లాడారు. గొర్రెలు అమ్మగా వచ్చిన రూ.1,35,000 డబ్బులు రాములు జేబులో ఉంచగా..వాటిని బలవంతంగా తీసుకునేందుకు యత్నించారు. ప్రతిఘటించడంతో కత్తిని గొంతుపై పెట్టి బెదిరించి డబ్బులు లాక్కున్నారు. ఇదే సమయంలో డ్రైవర్ రమేష్‌కు ప్రకాష్ ఫోన్ నుంచి కాల్ వస్తుండగా..మాట్లాడేందుకు యత్నించగా.. దుండగులు అతన్ని కత్తితో బెదిరించి ఫోన్ కట్ చేశారు. డబ్బులు తీసుకున్న దుండగులు అక్కడి నుంచి స్కూటీపై యూటర్న్ తీసుకుని శంకరాపురం వైపు పారిపోయారు.



దారి దోపిడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కాసేపటికే పెట్రోలింగ్ వాహనం..

ఈ ఘటన తర్వాత తేరుకున్న డ్రైవర్ రమేష్ తన వాహనాన్ని కూడా యూటర్న్ తీసుకుని దుండగులను వెంబడించే ప్రయత్నం చేశాడు. ఇదే సమయంలో అటుగా వచ్చిన ఓ వాహనదారుడికి ఈ విషయం చెప్పి ముందుకు పోతున్నారు. ఘటన జరిగిన సుమారు పది నిమిషాల తర్వాత అటుగా పోలీసుల పెట్రోలింగ్ వాహనం వచ్చింది. గమనించిన రమేష్ పోలీసులకు ఈ విషయాన్ని చెప్పాడు. వెంటనే పోలీసులు సమీప ప్రాంతాల్లో దుండగుల కోసం గాలింపు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. సంఘటన స్థలాన్ని ఏసీపీ భాస్కర్‌రావు, సీఐతో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్ మార్నింగ్ మంత్రిగారూ!



కేబీఆర్ పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మొన్నటి వరకు మాజీ ఎంపీగా, కాంగ్రెస్ సీనియర్ నేతగా పొన్నం ప్రభాకర్ కేబీఆర్ పార్కులో వాకింగ్‌కు వచ్చేవారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం.. ఆయన ఆదివారం కాస్త తీరిక దొరకడంతో వాకింగ్‌కు వచ్చి స్నేహితులను కలుసుకొని ముచ్చటించారు. 3 నెలలుగా ఆయన ఎన్నికల బిజీలో ఉండి వాకింగ్ చేయలేకపోయారు. ఇప్పుడిప్పుడే సమయం చిక్కుతుండటంతో వాకింగ్‌కు వస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ఆయన మిత్రులు గుడ్ మార్నింగ్ మంత్రిగారూ.. అంటూ ఆప్యాయంగా పలకరించారు. – వెంకటేశ్వరకాలనీ

సిటీలోనే డిటెన్షన్ సెంటర్!

- డిపోర్టేషన్ చేయాల్సిన విదేశీయుల కోసమే..
- రాష్ట్ర విభజన నుంచి సిటీ సీసీఎస్ అధీనంలోనే
- వికారాబాద్‌లో ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు
- సీఎం ఆదేశాల మేరకు ఇక్కడే ఏర్పాటుకు సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: విదేశీయుల్ని స్వదేశాలకు బలవంతంగా తిప్పిపంపడానికి (డిపోర్టేషన్) అవసరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉంచాల్సిన డిటెన్షన్ సెంటర్ సకల సౌకర్యాలతో నగరంలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఆధీనంలో ఉన్న ఈ సెంటర్‌ను వికారాబాద్‌లో ఏర్పాటు చేయాలని గతంలో భావించారు. అయితే సోమవారం నాటి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు సిటీలోనే ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేరాలు, అక్రమ నివాసం...

ఇక్కడ ఉన్న అవకాశాల నేపథ్యంలో నైజీరియా, సోమాలియా, టాంజానియా, ఐవరీ కోర్టు వంటి ఆఫ్రికన్ దేశాల నుంచి అనేక మంది వివిధ రకాలైన వీసాలపై హైదరాబాద్ వస్తున్నారు. వీరిలో కొందరు తమ వీసా, పాస్‌పోర్టుల గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్నారు. నకిలీ గుర్తింపుకార్డుల సహకారంతో తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఒకప్పుడు ఇలా ఉంటూ చిక్కిన వారిపై ఫారెనర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసేవాళ్లు. అనుమానాస్పద కదలికలు ఉన్నా, కొన్ని రకాలైన నేరాలకు పాల్పడినా ఇదే జరిగేది. దీంతో కోర్టులో ఆ కేసుల విచారణ పూర్తయ్యే వరకు డిపోర్టేషన్‌కు అవకాశం ఉండేది కాదు. దీంతో పాటు కొందరు నల్లజాతీయులు సైబర్ నేరాలు, డ్రగ్స్ విక్రయం చేస్తున్నారు. వీరు పట్టుబడినా, శిక్ష పూర్తి చేసుకున్నా, కోర్టు ఆదేశించినా డిపోర్టేషన్ చేయాల్సిందే.

తాత్కాలిక అంటూ ఇప్పటి వరకు...

ఇలా అత్యంత సమస్యాత్మక వ్యక్తులుగా మారుతున్న ఈ విదేశీయుల ప్రభావం సమాజంపై తీవ్రంగా ఉంటోంది. ఇది గమనించిన నగర పోలీసులు అక్రమంగా నివసిస్తున్న వారికి, అనుమానాస్పద కదలికలు కలిగిన వారిని అరెస్టు చేయడానికి బదులు డిపోర్ట్ చేయాలని నిర్ణయించారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారి పైనే కేసు నమోదు చేసి, అరెస్టు తదితర వ్యవహారాలు చేస్తున్నారు. ఈ డిపోర్టేషన్ ప్రక్రియలో అనేక దశలు ఉంటాయి. ఆయా ఎంబసీలకు సమాచారం ఇచ్చి వీరికి గుర్తింపు పత్రాలు, ఢిల్లీలోని కార్యాలయాల నుంచి టెంపరరీ ట్రావెల్ డాక్యుమెంట్లు పొందాలి. ఆపై విమాన టిక్కెట్లు ఖరీదు చేసి సదరు ఎయిర్‌వేస్ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్, ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ) నుంచి ఎగ్జిట్ పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు వారిని అదుపులో ఉంచుకోవాలి. దీనికోసమే డిటెన్షన్ సెంటర్‌ను వినియోగిస్తారు. రాష్ట్ర విభజనకు ముందు ఇది విశాఖపట్నంలో ఉండేది. తెలంగాణ ఏర్పడిన తరవాత తాత్కాలిక ప్రాతిపదికన అంటూ హైదరాబాద్ సీసీఎస్‌ను డిపోర్టేషన్ సెంటర్‌గా మార్చినా ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతోంది.

సీసీఎస్ మారినా సౌకర్యాల లేమి...

ఒకప్పుడు సీసీఎస్ పబ్లిక్‌గార్డెన్స్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను ఆనుకుని ఉండేది. అక్కడ ఐదుగురిని ఉంచడానికి సరిపోయే జైలు గదినే ఈ సెంటర్‌గా వాడారు. ప్రస్తుతం సీసీఎస్ బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌కు వెళ్లింది. దీంతో అక్కడే ఓ గదిని డిపోర్టేషన్ సెంటర్‌గా వాడుతున్నారు. ఒక్కోసారి పాత సీసీఎస్ లాకప్‌లోనే వీరిని ఉంచుతున్నారు. ఆ విదేశీయులకు అనువైన ఆహారం అందించలేకపోవడం కొత్త సమస్యలకు కారణం అవుతోంది. దీంతో నగర పోలీసు విభాగం ప్రత్యేకంగా డిటెన్షన్ సెంటర్ కోరుతూ మూడేళ్ళ క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో వికారాబాద్‌లో ఈ సెంటర్ ఏర్పాటుకు సర్కారు నిర్ణయించింది. దీనికి నిధుల కేటాయింపు జరగకపోవడంతో నిర్మాణం ముందుకు వెళ్ళలేదు. సోమవారం డ్రగ్స్ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు డిటెన్షన్ సెంటర్ అంశాన్ని ఆయనకు వివరించారు.

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సీఎం...

దీంతో తక్షణం స్పందించిన రేవంత్‌రెడ్డి నగరంలోనే అనువైన ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో డిటెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆదేశించారు. సరైన ప్రతిపాదనలతో వస్తే తక్షణం అందుకు అవసరమైన నిధులు అందిస్తానంటూ హామీ ఇచ్చారు. విదేశీయుల వ్యవహారం సున్నితమైంది, అంతర్జాతీయ సంబంధాలతో ముడిపడి ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఆయా దేశీయుల భాష తర్జుమా చేయడానికి ట్రాన్స్‌లేటర్లు, వారికి అనువైన ఆహారం అందించే వంట వారితో పాటు చుట్టూ సువిశాల సంస్థలం ఉండి మధ్యలో భవనం ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సెంటర్ నిర్వహణతో పాటు డిపోర్టేషన్ ప్రక్రియ చేపట్టడానికి అవసరమైన నిధులను అందించడానికి సీఎం సుముఖత వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కొత్త భవనం నిర్మించాలా? ఉన్నవాటిలో ఏదైనా వాడుకోవాలా? అనే అంశంపై దృష్టి పెట్టారు. వీలైనంత త్వరలో ఈ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.